thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 134 కరీంనగర్ బుధవారం, 23 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

న్యూఢిల్లీ : పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్లు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 3,000కు పెంచే అవకాశం ఉన్నట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ. 1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ. 3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

## ఏపీ, తెలంగాణలో తలసరి ఆదాయాల పెరుగుదల




న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో నికర దేశీయోత్పత్తి ఆదాయం గత పదేళ్లలో 78.9 శాతం, తెలంగాణలో 85.3 శాతం పెరిగిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్ సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ 2013-14లో ఏపీలో నికర దేశీయోత్పత్తి రూ. 79174 కాగా 2024-25లో అది రూ. 1,41,609కు చేరుకుందని ఆయన తెలిపారు.

కాగా, 2023-24లో ఏపీలో నికర దేశీయోత్పత్తి రూ. 1,31,083 కాగా అది ఏడాదిలోనే రూ. పదివేలకు పైగా పెరిగి 1,41,609కి చేరుకోవడం గమనార్హం. ఇక తెలంగాణలో 2023-24లో నికర దేశీయోత్పత్తి రూ. 1,77,000 కాగా, అది 2024-25లో రూ.పదివేలకు పైగా పెరిగి రూ. 1,87,912కు చేరుకుంది. గత పదేళ్లలో తెలంగాణలో నికర దేశీయోత్పత్తి 85.3 శాతం పెరిగిందని చెప్పారు.

## తెలంగాణ మణిహారంగా ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి మణిహారంగా నిలిచే మరో గొప్ప ప్రాజెక్టు ఔటర్ రింగ్ రైలు రూపుదిద్దుకుంటోంది. దేశంలోనే ఇదే తొలి ప్రాజెక్టుగా నిలవనుంది. మొత్తం 392 కిలోమీటర్ల పొడవుతో డిజైన్ చేసిన ఈ రైలు మార్గం తెలంగాణలోని 8 జిల్లాల పరిధిలో రానుంది. వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 14 మండలాలను ఈ ప్రాజెక్టు కలుపుతుంది. దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రాజెక్టుకు రూ. 12 వేల కోట్ల వ్యయంతో సిద్ధమవుతోంది. ఇప్పటికే దానికి సంబంధించిన డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట్లో ఈ ప్రాజెక్టు కోసం 508 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతిపాదించినా, రీజనల్ రింగ్ రోడ్డుకు సమీపంగా ఉండేలా చివరికి 392 కిలోమీటర్ల అట్టిపెట్టిన అలైన్‌మెంట్‌ను ఎంపిక చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల సూచనల మేరకు దక్షిణ మధ్య రైల్వే మార్గాన్ని సవరించింది. గత ప్రణాళికతో పోలిస్తే దాదాపు 120 కిలోమీటర్లు తగ్గించడంతో పాటు, అభివృద్ధి చెందే ప్రాంతాలపై దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్టులో విశేషంగా 6 చోట్ల "రైల్ ఓవర్ రైల్" వంతెనలు నిర్మించనున్నారు. వలిగొండ, గజ్వేల్, బూర్గుల, మాసాయిపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ప్రధాన existing రైల్వే మార్గాలపై కొత్త లైన్లు పైకిపైగా ఫ్లైఓవర్‌లా నిర్మించనున్నారు. రీజనల్ రింగ్ రోడ్డుకు కేవలం 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోనే ఈ ప్రాజెక్టు వెళ్లనుంది. దీంతో రహదారి, రైలు మార్గాలు సమాంతరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయి. కొత్తగా వచ్చే 26 రైల్వే స్టేషన్లు ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని కల్పిస్తాయి. బస్సులు, మెట్రో, రైలు మార్గాల మధ్య మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ ఏర్పడటంతో ప్రయాణదూరాలు తగ్గుతాయి. ప్రయివేట్ వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గి, కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇది ఉపకరిస్తుంది. ముఖ్యంగా కనెక్టివిటీ లేని శివారు ప్రాంతాల్లో అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మైలురాయిగా మారనుందని తెలంగాణ ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.




## మహాలక్ష్మీ.. మరో మైలు రాయి

## 200 కోట్లకు జీరో టికెట్ల జారీ!

హైదరాబాద్, జులై 22: తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. మహాలక్ష్మి పథకంలో భాగంగా నేటి వరకు అంటే.. మంగళవారం వరకు 199.60 కోట్ల జీరో టికెట్లు జారీ చేశారు. రేపటితో అంటే.. జులై 23వ తేదీతో 200 కోట్లకు ఈ జీరో టికెట్ల జారీ చేరనుంది. దీంతో ఏడాదిన్నర రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో మహిళల సంక్షేమంతోపాటు వారి సాధికారతకు పెద్ద పీట వేసినట్లు అయింది. ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీని ఈ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుంది. తద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు అయింది. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరిన జస్ట్ 48 గంటల్లోనే అంటే.. డిసెంబర్ 9వ తేదీన ఈ మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం దేశప్రజలందరిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఈ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకోవటంతో ఈ 18 నెలల్లోనే తెలంగాణ ఆడబిడ్డలు రికార్డు మొత్తంలో అంటే.. రూ. 6,671 కోట్లు ఆదా చేసుకున్నారు. ఈ పథకం ప్రారంభమైన తొలి రోజుల్లో రోజుకు సగటున 14 లక్షల మంది మహిళలు ఈ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఆ తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య రోజు రోజూకు పెరిగింది. ప్రస్తుతం సగటున రోజుకు 30 లక్షల మందికిపైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లో సుమారు 8 లక్షల మంది మహిళలు రోజూ సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. 2023 ఏడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే.. రాష్ట్రవ్యాప్తంగా మహాలక్ష్మీ పథకం పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ అలాగే పలు పథకాలను సైతం అమలు చేస్తామని ప్రకటించింది. ఇక ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని గంటలకే రేవంత్ రెడ్డి మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేశారు. పథకం అమలు కారణంగా.. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో రోజుకు లక్షలాది మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలో జులై 23వ తేదీ నాటికి 200 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నట్లు అవుతుంది.



## టీ బీజేపీ చీఫ్‌కి భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్: బీజేపీ తెలంగాణ అధ్యక్షులు రామ్ చందర్‌రావుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రామ్ చందర్ రావు భట్టికి పంపించిన లీగల్ నోటీస్‌లపై ఆయన స్పందించారు. లీగల్ నోటీస్‌లకు తాను భయపడేవాడిని కాదని.. ఆయన ఇచ్చిన నోటీస్‌లకు సమాధానం చెబుతానని తెలిపారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ సచివాలయంలో మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రామచందర్‌రావుకు దళిత బహుజనులంటే చిన్నచూపు ఉందని ధ్వజమెత్తారు. వారికి మేలుచేసే పనులకు అడ్డు తగలడం బీజేపీ అధ్యక్షుడికి బాగా అలవాటని మండిపడ్డారు మల్లు భట్టి విక్రమార్క. హెచ్‌సీయూ ఘటనలో ఆయన పాత్ర కూడా ఉందని అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్లు మీరే చెప్పారు మీరే చేయాలని అనడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీలో తీర్మానం చేయాలని తాము అడగటం లేదని.. కేంద్రప్రభుత్వం చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని.. ఆయనకు ఈ విషయం సరిగా అర్థం కానట్లు ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ కులగణన, రిజర్వేషన్లు దేశానికి దశ దిశ చూపుతాయని ఉద్ఘాటించారు. బీసీ సర్వే మొదలు పెట్టినప్పుడు కొంతమంది అవసరం లేదన్నారని.. ఇప్పుడు దేశవ్యాప్తంగా కులగణన సర్వే నిదర్శనంగా నిలిచిందని నొక్కిచెప్పారు మల్లు భట్టి విక్రమార్క.

# 'అంతకు మించి'

## ఢిల్లీ స్కాం కంటే పది రెట్లు...

## సెగలు పుట్టిస్తున్న ఏపీ మద్యం కుంభకోణం!




ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం అని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం కొట్టి పారేస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత కుట్ర కేసుగా అభివర్ణిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే మాత్రం తప్పనిసరిగా మద్యం కుంభకోణం జరిగి ఉంటుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ఒకప్పటి వైసిపి కీలక నేత విజయసాయిరెడ్డి సైతం మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రంగా సిట్టింగులు కూడా జరిగాయని.. అందులో తాను సైతం పాల్గొన్నానని.. తనకు మాత్రం సంబంధం లేదని ఆయన చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. అదే సమయంలో ఈ కేసుకు సంబంధించి తొలి చార్జ్ షీట్ ను కోర్టుకు సమర్పించింది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకటి కాదు రెండు కాదు మూడు 3,500 కోట్ల రూపాయల కుంభకోణం ఇది అని తేల్చేసింది. త్వరలో అంతిమ లబ్ధిదారుడు ఎవరు అనేది తెలుస్తామని కూడా స్పష్టం చేసింది. 20 రోజుల్లో మరో చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పింది.

**నిషేధం పక్కనపెట్టి వ్యాపారం..** వాస్తవానికి 2019 ఎన్నికల్లో మద్య నిషేధం హామీ ఇచ్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి. నవరత్నాల్లో భాగంగా సంపూర్ణ మద్యపాన నిషేధానికి హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా దశలవారీగా దుకాణాలను మూసివేస్తామని చెప్పి.. స్వయంగా ప్రభుత్వమే నడిపే విధంగా మద్యం పాలసీని అమాంతం మార్చారు. అక్కడే మద్యం కుంభకోణానికి బీజం పడింది. ఎక్కడో కేంద్రం సర్వీసులో ఉన్న అధికారిని తెచ్చి మద్యం పాలసీని తయారు చేసే బాధ్యతలు అప్పగించారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన రాజ్ కసిరెడ్డిని తెచ్చి సూత్రధారిగా మార్చారు. ఎంపీ మిథున్ రెడ్డి తెర వెనుక ఉండి నడిపించారు. మద్యం తయారీదారులతో పాటు డిస్టలరీలను తమ అదుపులోకి తెచ్చుకున్నారు. నాసిరకం మద్యం తయారీని ప్రోత్సహించారు. తద్వారా ప్రతీ సీసాకు కమీషన్ ఇంతా అని నిర్దేశించారు. అప్పటివరకు ఉన్న ప్రీమియం మద్యం బ్రాండ్లు కనిపించకుండా పోయాయి. చాలా రకాల కొత్త బ్రాండ్లు కనిపించాయి. దేశవ్యాప్తంగా వినిపించని బ్రాండ్లు సైతం ఏపీలో దర్శనం ఇవ్వడం విశేషం. షాపులు నడిపేది ప్రభుత్వం.. మద్యం కంపెనీలు వైసీపీ నేతలువి.. డిస్టలరీలు వారి కంట్రోల్ లోనే ఉండేవి.. కేవలం మద్యం పాలసీ మారింది. కానీ నడిపేది వైసిపి నేతలు. లబ్ధి పొందింది వారే. కానీ నాసిరకం మద్యంతో ప్రజారోగ్యానికి తీరని భంగం వాటిల్లింది. దాదాపు 30 వేల మందికి పైగా నాసిరకం మద్యానికి బలయ్యారని ఆరోపణలు కూడా బలంగా వినిపించాయి.

**ఆ సొమ్ముతోనే వ్యాపారాలు..** అయితే మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారి రాజ్ కసిరెడ్డి. కానీ ఆయన వెనుక ఉండి నడిపించింది అంతా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అని ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. కల్తీ మద్యం ద్వారా సంపాదించిన సొమ్ముతో బంగారం వ్యాపారం, రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరపడం, విదేశాల్లో మైనింగ్ వంటివి చేశారని గుర్తించింది సిట్. మద్యం పాలసీలో కీలక పాత్ర పోషించారు అప్పటి బేవరేజస్ చైర్మన్ వాసుదేవ రెడ్డి. వాస్తవానికి ఆయన ఈ రాష్ట్రానికి చెందిన అధికారి కాదు. ఐఆర్ఎస్ అధికారిగా ఉండేవారు. ఆయనను డిప్యూటేషన్ పై తీసుకొచ్చి అస్మదీయ అధికారిగా మార్చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారిగా ఉన్న సత్య ప్రసాద్ ని కన్వర్టెడ్ ఐఏఎస్ గా పదోన్నతి కల్పిస్తామని ప్రలోభ పెట్టారు. వారిద్దరిని పావుగా మార్చుకొని దోపిడీకి పాల్పడింది మాత్రం మిథున్ రెడ్డి అని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేలినట్లు తెలుస్తోంది.

**అదంతా బహిరంగ రహస్యమే..** అయితే మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఎవరు అన్నది బహిరంగ రహస్యమే.

కానీ ఈ బృందంలో ఎక్కువ లాభ పడింది మాత్రం పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. ప్రతి నెలా 5 కోట్ల రూపాయల వరకు మిథున్ రెడ్డికి వాటాల రూపంలో వెళ్లేవని తెలుస్తోంది. ఆయన కుటుంబీకులు డైరెక్టర్లుగా ఉన్న పి ఎల్ ఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల్లో ఆ నగదును జమ చేసుకున్నట్లు తేలింది. అయితే ఒక పద్ధతి ప్రకారం మద్యం కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కేవలం నగదు అమ్మకాలకు మాత్రమే ప్రోత్సహించారు. గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ లావాదేవీలు పైకి చూపి.. నగదు అమ్మకాల ద్వారా కుంభకోణానికి తెరలేపినట్లు సిట్ విచారణలో స్పష్టమైంది.

**అత్యంత సన్నిహితుల బృందంతో..** మరోవైపు మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు కీలక నేత అయితే.. అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లబ్ధి చేకూర్చాలని భావించినట్లు సీట్ చెబుతోంది. మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన సొమ్మును 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు పంచాలని ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో 40 మంది నిందితులు ఉండగా.. ఇప్పటివరకు అరెస్టయిన 12 మంది మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు. వీరే ఈ మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించారు. మద్యం ద్వారా వచ్చిన ఆదాయంతో ఇతర వ్యాపారాలు చేశారు. అదే సొమ్మును హవాలా రూపంలో విదేశాలకు తరలించి మైనింగ్ వ్యాపారాన్ని చేపట్టారు. ఇలా దోచేసిన సొమ్మును 175 నియోజకవర్గాలకు పంపించి మరోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు వ్యూహరచన చేశారు. అయితే వీరు ఒకటి తలిస్తే దైవము ఒకటి తలచినట్టు.. ప్రజా తీర్పు తారుమారు కావడంతో.. ఏపీలో అధికారం మార్పిడి కావడంతో అడ్డంగా బుక్ అయినట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే అంతిమ లబ్ధిదారుడు ఎవరు? ఆ సొమ్ముతో ఏం చేయదలుచుకున్నారో ఏపీ ప్రజలకు స్పష్టంగా తెలిసింది. ఈ విషయంలో మాత్రం ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.



# తెలంగాణకు రెడ్ అలర్ట్ మూడు రోజులు భారీ వర్షాలు

ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలో పలు జిల్లాలకు ఇవాళ రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వీటికి ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు.

# బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవడానికి సిద్ధం: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. "కులగణన అవసరం లేదని భాజపా మొదట మాట్లాడింది. తెలంగాణ ప్రభుత్వం, రాహుల్ గాంధీ ఒత్తిడితో జనగణనలో కులగణన చేరుస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం. కులగణనను క్యాబినెట్‌లో, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్‌లోనూ మద్దతు తెలపాలి. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది. ఆయన పంపిన లీగల్ నోటీసులకు ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. భారత రాష్ట్ర సమితి ప్రజలను మభ్యపెట్టింది. అందరూ అలాగే చేస్తారని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారేమో. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాం. అందుకే తెలంగాణను చూసి కేంద్రం కూడా కులగణనను ప్రకటించింది"అని భట్టి అన్నారు.

# బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయి.. కవిత ఫైర్



హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు బీసీల రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్ర చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇవాళ(మంగళవారం) తెలుగు యూనివర్సిటీ వద్ద కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభ, మండలిలో ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం పంపిందని.. కానీ రిజర్వేషన్‌లకు మతం రంగు పులిమి రాష్ట్రపతి వద్దకు కేంద్ర ప్రభుత్వం పంపలేదని చెప్పుకొచ్చారు ఎమ్మెల్సీ కవిత. తెలంగాణలో బీజేపీకి ఓట్లు రావని తెలిసే, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు రిజర్వేషన్ల బిల్లు తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చలేమని మాట్లాడారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలు చేస్తూ, దక్షిణాది రాష్ట్రాల్లో న్యాయపరమైన సమస్యలు అంటూ దాటవేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికి 50 సార్లకు పైగా ఢిల్లీ వెళ్లారని.. కానీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఒత్తిడి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కెవిట్ పిటీషన్ వేసి, రిజర్వేషన్లపై ఆర్డినెస్ తీసుకొచ్చి, చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.



# రాష్ట్రం నుంచి ఎన్నికైన భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి

హైదరాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు సాధ్యమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రామచందర్‌రావు మరోసారి తన నిజస్వరూపం బయట పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం అంటున్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో రిజర్వేషన్లు పెంచారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి.

ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్లు ఎందుకు అమలుకావో చూస్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం దాశరథి

హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం దాశరథి కృష్ణమాచార్య అని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కవిగా, రచయితగా.. తన రచనలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన దాశరథి శతజయంతి సందర్భంగా నివాళులర్పించారు. "నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్షర యుద్ధం సాగించి ధిక్కార స్వరం వినిపించిన వైతాళికుడు. రుద్రవీణ, అగ్నిధార, కవితాపుష్పకం, పునర్నవం, అమృతాభిషేకం, తిమిరంలో సమరం లాంటి సంకలనాలు, అద్భుత కావ్యాలు రచించారు. పీడిత ప్రజల గొంతుకగా జీవించిన దాశరథి తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం. అంతటి మహాకవిని గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం సముచితంగా గౌరవించింది. వారి పేరిట సాహితీ పురస్కారాన్ని ఏర్పాటు చేసి.. జయంతిని అధికారికంగా నిర్వహించింది. ఆ మహనీయుడి రచనలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నారు.



# రాజీనామాకు.. కారణాలు అవేనా..?

ఉపరాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ విపక్షాలు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికార కూటమి నేతలు మౌనం వహించగా.. ప్రధాని సహా పలువురు ఇప్పుడిప్పుడే స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉపరాష్ట్రపతి పదవి నుంచి వైదొలగడంపై పలు విశ్లేషణలు తెరమీదకు వచ్చాయి.

**నీతీశ్ కుమార్ కోసమే..?...** బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న నీతీశ్ కుమార్‌ను తదుపరి ఉపరాష్ట్రపతిగా చేయాలన్న ఉద్దేశంతోనే ధన్‌ఖడ్ రాజీనామా చేశారనే చర్చ నడుస్తోంది. భాజపా నేతలు చేస్తున్న ప్రకటనలు దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. నీతీశ్ ఉపరాష్ట్రపతి కావడంలో తప్పేంటని బిహార్ మంత్రి నీరజ్ కుమార్ సింగ్ వ్యాఖ్యానించారు. నీతీశ్ ఆ పదవిలో ఉంటే రాష్ట్రానికి ఎంతో మంచిదని, అందరూ అదే కోరుకుంటున్నారని మరో భాజపా ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం అదే రాష్ట్రానికి చెందిన జేడీయూ నేత హరివంశ్ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్నారు. మరోవైపు నీతీశ్‌కు ఉపరాష్ట్రపతి కావాలని ఉందనే విషయంపై గతంలోనూ ఊహాగానాలు వచ్చాయి. ఇదే విషయంపై అనేక మంది ఆ పార్టీ నేతలు తమను సంప్రదించారని భాజపా మాజీ ఎంపీ, దివంగత నేత సుశీల్ కుమార్ 2022లో పేర్కొన్నారు.

**అవమానంగా భావించారా..?...** వర్షాకాల సమావేశాల తొలిరోజు జరిగిన పరిణామాలు కూడా ధన్‌ఖడ్ రాజీనామా వెనక కారణాలనే వాదన ఉంది. జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోరుతూ 68 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసిన నోటీసు తనకు అందిందని, దాన్ని అంగీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించడం.. అధికార పార్టీకి మింగుడుపడని విషయంగా మారినట్లు సమాచారం. ఈ అంశానికి సంబంధించి లోక్‌సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెడుతున్న సమయంలోనే రాజ్యసభ ఛైర్మన్ దీన్ని అంగీకరించడం తొందరపాటు చర్యగా అధికార పార్టీ భావించిందనే వాదన ఉంది.

సోమవారం సాయంత్రం నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు హాజరుకాకపోవడం ధన్‌ఖడ్‌కు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. దీంతో రాజ్యసభ ఛైర్మన్ సభను మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారని తెలుస్తోంది. ఇలా సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగిన పరిణామాలపైనా తాజాగా చర్చ నడుస్తోంది. ఈ అంశాలను కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రస్తావిస్తున్నాయి.



# వాహనాలకూ డెత్ సర్టిఫికెట్

కాలం చెల్లిన వాహనాలతో కాలుష్యం విజృంభిస్తోంది. దీనిని కట్టడి చేసేందుకు 15 ఏళ్లు దాటిన వాహనాలు రోడ్లపైకి రాకుండా కేంద్రం ఇటీవల చర్యలు ప్రారంభించింది. 15 ఏళ్లు దాటిన ఆర్టీసీ బస్సులు, ప్రభుత్వ వాహనాలు అన్నింటినీ తప్పనిసరిగా తుక్కుగా మార్చాలి. కార్లు, ట్రాక్టర్లు, జీపులు, ద్విచక్రవాహనాలు, లారీలు, ట్రాక్టర్లను వాటి యజమానులు స్వచ్ఛందంగా తుక్కుగా మార్చుకోవచ్చు. ఈ ప్రక్రియను శాస్త్రీయంగా నిర్వహించేందుకు రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాహనంలో పనికొచ్చే భాగాలు, తుక్కు ఇనుముకు సంబంధించిన ధర నిర్ణయించి యూనిట్ వాళ్లు డబ్బు చెల్లిస్తారు. తుక్కుగా మార్చిన తర్వాత సర్టిఫికెట్ ఆఫ్ స్క్రాపింగ్ అనే ధ్రువపత్రాన్ని ఇస్తారు. దీన్ని వాహనానికి డెత్ సర్టిఫికెట్‌గా చెప్పుకోవచ్చు. కొత్త వాహనం కొనుగోలు సమయంలో వివిధ కార్ల కంపెనీలు ఈ సర్టిఫికెట్ ఉంటే రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ధర తగ్గిస్తున్నాయి.





# తెలంగాణ టెట్ ఫలితాలు వచ్చేశాయ్

హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) 2025 జూన్ ఫలితాలు విడుదలయ్యాయి. సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. టెట్ పరీక్షలకు మొత్తం 90,205 మంది హాజరుకాగా..30,649 మంది అర్హత సాధించినట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 18 నుంచి 30 వరకు మొత్తం 16 సెషన్లలో 7 భాషల్లో టెట్ పరీక్షలు నిర్వహించారు.

పేపర్ -1కి 47,224 మంది అభ్యర్థులు హాజరుకాగా..29,043 మంది (61.5 శాతం) అర్హత సాధించారు. పేపర్-2 గణితం-సైన్స్‌కి 48,998 మంది హాజరుకాగా.. 17,574 మంది క్వాలిఫై అయ్యారు. సోషల్ సైన్స్‌కి 41,207 మంది హాజరుకాగా..13,075 మంది అర్హత సాధించినట్టు విద్యాశాఖ పేర్కొంది. రెండు పేపర్లు కలిపి 90,205 మంది హాజరుకాగా.. 30,649 మంది (33.98 శాతం) అర్హత సాధించినట్టు ప్రకటించింది. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ సహా పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# రెయిన్ అలర్ట్.. వర్క్ ఫ్రమ్ హోమ్‌పై సైబరాబాద్ పోలీసుల సూచన


హైదరాబాద్: సైబరాబాద్ ప్రాంతంలో ఇవాళ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు సైబరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఐటీ కంపెనీలు మంగళవారం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిని పాటిస్తే మేలని సూచించారు. ఈ విషయంలో కంపెనీలు సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసు విభాగం ఎక్స్‌లో పోస్టు పెట్టింది.



# దైవ నిర్ణయం ఎలా ఉంటుందో!

దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే పదవీకాలం ముగియకముందే ఆయన రాజీనామా సమర్పించడంపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన పదవీవిరమణ గురించి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజీనామాకు పది రోజుల క్రితమే పదవీ విరమణపై జగదీప్ ధన్‌ఖడ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 2027 ఆగస్టులో సరైన సమయంలో రిటైర్ అవుతానన్నారు. అయితే అది దైవనిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొనడం గమనార్హం. జులై 10న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ.. తాను 2027 ఆగస్టులో సరైన సమయంలో దైవ నిర్ణయానికి లోబడి పదవీవిరమణ చేస్తానని అన్నారు. అనంతరం పది రోజుల తర్వాత అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొంటూ.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాజీనామా లేఖను పంపారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అనూహ్యంగా ఆయన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. పదవిలో ఉండగా ఉప రాష్ట్రపతి రాజీనామా చేసినా.. మరణించినా.. ఆయనను తొలగించినా సాధ్యమైనంత త్వరగా తదుపరి ఉప రాష్ట్రపతిని నియమించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 68లోని క్లాజ్ 2 పేర్కొంటుంది. ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవిని భర్తీ చేయడానికి ఎన్నికయిన తదుపరి వ్యక్తి పదవిని చేపట్టిన రోజు నుంచి ఐదేళ్లపాటు ఉప రాష్ట్రపతిగా కొనసాగుతారు. దీని ప్రకారం తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నికను సాధ్యమైనంత త్వరగా నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. తదుపరి ఉప రాష్ట్రపతి రేసులో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సింగ్ పేరు ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం చంద్రశేఖర ఆజాద్ - జూలై 23... ఆజాద్ జయంతి



భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాభ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్రం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందుడైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడాల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్' గా మారింది. "సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. "నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో" – ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను" అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారత మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపకం... దేశీయ కార్మిక శక్తి సంఘటితం

## జూలై 23...భారత మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవం

भारतीय मज़दूर संघ
Bharatiya Mazdoor Sangh

జూలై 23వ తేదీ భారత కార్మిక ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి. ఈ రోజే 1955లో ఢిల్లీలో డాక్టర్ దత్తోపంత్ ఠేంగడీ ఆధ్వర్యంలో భారత మజ్దూర్ సంఘ్ స్థాపించ బడింది. సంఘం స్థాపనకు ప్రధాన ప్రేరకులు దత్తోపంత్ ఠేంగడి. ఆయన ఒక గొప్ప తత్త్వవేత్త, సంఘ్ సిద్ధాంత వేత్త మాత్రమే కాక, దేశ భవిష్యత్తును కార్మికుల ద్వారా మలిచేందుకు కృషి చేసిన దార్శనికుడు. ఆయన నేతృత్వంలో జూలై 23, 1955న భోపాల్‌లో భారత మజ్దూర్ సంఘ్‌కు శ్రీకారం చుట్ట బడింది. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థ, స్వదేశీ పరిశ్రమల ఎదుగుదలకు కేంద్ర బిందువుగా రూపుదిద్దుకుంది. స్వతంత్ర భారతంలో కార్మిక ఉద్యమాలు ఎక్కువగా కమ్యూనిస్టు భావజాలం ఆధారంగా కొనసాగుతున్న నేపథ్యంలో, పూర్తిగా భిన్నమైన దృక్కోణంతో %-% దేశభక్తి, ధర్మపరమైన శ్రామిక న్యాయ బద్ధత, ఆధ్యాత్మికతతో కూడిన దిశానిర్దేశం చేయడమే లక్ష్యంగా స్థాపించ బడింది. హిందూ ధార్మిక పంథాలకు లోనైన సామాజిక దృక్కోణంతో కూడిన బీఎంఎస్ ఒక ప్రత్యామ్నాయ కార్మిక ఉద్యమంగా ప్రారంభమైంది. డాక్టర్ ఠేంగడీ, బీజేపీ, ఆరెస్సెస్ సంస్థాగత అనుబంధంతో ఉన్నప్పటికీ, బీఎంఎస్‌ను రాజకీయాలకు అతీతంగా, స్వతంత్రంగా నడిపించాడు. బీఎంఎస్ కేవలం పారిశ్రామిక కార్మికులకే కాదు, వ్యవసాయ కూలీలు, అంగన్ వాడీ కార్యకర్తలు, గిరిజన శ్రామికులు, నిరుద్యోగ యువత, అసంఘటిత రంగ ఉద్యోగులు, ప్రభుత్వం మరియు ప్రైవేటు రంగాల కార్మికుల వరకు విస్తరించిన ఒక సమగ్ర శ్రామిక వేదికగా ఎదిగింది. ఇది ఏ రాజకీయ పార్టీకీ అనుబంధంగా లేదు. ఇది రాజకీయాలకు దూరంగా ఉంటూ, స్వేచ్ఛతో పని చేసే అతిపెద్ద స్వతంత్ర కార్మిక సంఘంగా గుర్తింపు పొందింది. అనేక సందర్భాల్లో నియంత్రిత సంస్కరణలు, మోదీ ప్రభుత్వ కార్మిక కోడ్ బిల్లులపై విమర్శలు, కార్మిక హక్కుల పరిరక్షణలో పోరాట ధోరణి – బి ఎం ఎస్ కార్యకలాపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, మహిళా కార్మికుల రక్షణ, అసంఘటిత రంగ అభివృద్ధి తదితర అంశాలలో ఈ సంఘం సుదీర్ఘ కాలంగా పోరాడుతోంది. దేశవ్యాప్తంగా ఒకటిన్నర కోట్ల పైగా సభ్యత్వం కలిగి ఉన్న సంఘం – వ్యవసాయ కార్మికులు, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, మైనింగ్, ఫ్యాక్టరీలు, ప్రభుత్వ ఉద్యోగులు, నిర్మాణ రంగ కార్మికులు వంటి అనేక వర్గాలలో శ్రామికుల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తోంది. భారత మజ్దూర్ సంఘ్ వ్యాపకత గణాంక పరంగా పరిశీలిస్తే, 2024 నాటికి ఇది 1.71 కోట్ల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా నిలిచింది. ఇది దేశం లోని అన్ని రాష్ట్రాల్లో విస్తరించి, పదివేలకు పైగా యూనియన్లను కలిగి ఉంది. నేషనల్ ట్రేడ్ యూనియన్ ఇంటర్ ఫెడరేషన్‌లో ఇది అనుబంధ సభ్య సంఘంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ కార్మిక సంఘటితాలుగా పేరుగాంచిన వామపక్ష ప్రభావిత సంఘాల కన్నా భిన్నమైన మార్గాన్ని అనుసరించింది. స్వదేశీ ఆర్థిక దృక్కోణం, శ్రామికుడికి మానవ గౌరవం, కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత మీద ఆధారపడిన సంఘర్షణాత్మక కార్యక్రమాలు బీఎంఎస్ ప్రత్యేకతగా నిలిచాయి. బీఎంఎస్ కార్యకలాపాల పూర్వాపరాలు విశ్లేషిస్తే, ఇది 1970లలో ఎమర్జెన్సీ సమయంలో వ్యతిరేక స్వరంగా నిలబడిన ఘట్టం ముఖ్యమైనది. కార్మిక హక్కులను కాదని పెట్టే ప్రభుత్వ విధానాలపై నిరంతరం పోరాట ధోరణితో స్పందించింది. 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాలపై తీవ్రంగా విమర్శలు చేసింది. లిబరలైజేషన్, ప్రైవటైజేషన్, గ్లోబలైజేషన్ అనే ఎల్ పి జి విధానాలు దేశీయ పరిశ్రమలను నాశనం చేస్తున్నాయని, అసంఘటిత రంగాల ఉద్యోగులను అసురక్షిత స్థితి లోకి నెట్టుతున్నాయని బీఎంఎస్ స్పష్టంగా నిరసన తెలియ జేసింది. అప్పటి నుండి నేటి వరకు కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వాలతో చర్చలు జరిపే, అప్పుడప్పుడు ఆందోళనలకు దిగే బీఎంఎస్ తన ప్రజాస్వామిక పోరాట పద్ధతిని నిరంతరంగా ప్రదర్శిస్తోంది. డాక్టర్ దత్తోపంత్ ఠేంగడీ రచనలు, ఆలోచనలు, 'శ్రామిక సమాజ్' సిద్ధాంతం ఆధారంగా బీఎంఎస్ మౌలిక సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. ఆయన చెప్పిన 'రాష్ట్రాధిష్ఠిత ఉద్యమం కాదు – సమాజాధిష్ఠిత ఉద్యమం కావాలి' అనే వాఖ్యానికి అనుగుణంగా బీఎంఎస్ కార్యాచరణ సాగింది. కార్మికుడికి కేవలం జీతం, ఉద్యోగ భద్రత కల్పించడమే కాదు – అతడి ఆత్మ గౌరవాన్ని, కుటుంబ స్థిరతను, సామాజిక విలువలను కాపాడటం కూడా ముఖ్యమన్నది బీఎంఎస్ సిద్ధాంతం. బీఎంఎస్ కార్యచరణలో భాగంగా కార్మికులకు అవగాహన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, న్యాయ సహాయం వంటి అనేక రంగాల్లో విస్తరించిన సేవలు అందిస్తున్నది. ప్రతి సంవత్సరం జూలై 23న నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవం ద్వారా బీఎంఎస్ తన చరిత్రను స్మరించుకుంటూ, సంస్థ స్థాపకుని త్యాగాలను గుర్తు చేసుకుంటూ శ్రామిక శక్తికి నూతన ఉత్సాహాన్ని పంచుతుంది. ఆ రోజు దేశ వ్యాప్తంగా కార్యాలయాల్లో పతాక ఆవిష్కరణ, శ్రద్ధాంజలి సభలు, ఉపన్యాసాలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇది కేవలం ఒక సంఘటనా కార్యక్రమం మాత్రమే కాకుండా శ్రామిక చైతన్యానికి నూతన సంకేతంగా మారింది. బీఎంఎస్ కేవలం గత ఘట్టాలను గర్వంగా చెప్పుకునే ఉద్యమంగా కాదు – ప్రస్తుతం పెరుగుతున్న కార్మిక విపత్తులను గమనించి, నిరంతరం స్పందించే ఒక శక్తివంతమైన శ్రామిక వేదిక. నూతన కార్మిక కోడ్ చట్టాలు, ఇ ఎస్ ఐ, ఇ పి ఎఫ్, ఉచిత ఆరోగ్య సేవలు, కనీస వేతనాలు, పింఛన్ విధానాల మార్పుల్లో బీఎంఎస్ జోక్యం ప్రత్యేకంగా నిలిచింది. కార్మికుల పక్షాన నిఖార్సయిన వాదనలు చేస్తూ, ప్రభుత్వాలను ఒప్పించి అనేక రకాల ప్రయోజనాలు సాధించింది. ఈ నేపథ్యంలో బీఎంఎస్ స్థాపన దినోత్సవం అంటే కేవలం ఒక జ్ఞాపకార్థ దినమే కాదు – అది శ్రమ జీవుల గౌరవానికి, సమాజ నిర్మాణానికి, శ్రామికుల హక్కుల పరిరక్షణకు అంకితమైన ఉద్యమ ఆవిర్భావ దినం. శ్రమించే వాడు సృష్టికర్త అనే తత్త్వంతో దేశాభివృద్ధికి దోహదపడే ప్రతి కార్మికుని శక్తిని మేల్కొలిపే శక్తిగా బీఎంఎస్ ఉద్యమం నిలుస్తోంది. ఇది నిజంగా శ్రామిక సమాజానికి ఒక సాంస్కృతిక ప్రేరణా శక్తిగా మారిన సంఘటిత పథం.

**రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్టు – 9440595494**

# ఆకాశవాణి ఒక సాధారణ ప్రసార సంస్థ కాదు, సంస్కృతి ప్రసారిణి

## జాతీయ ప్రసార దినోత్సవం - రేడియో తరంగాల్లో ప్రజల జీవన ప్రవాహం

## రేడియోతో గడిపిన క్షణాలు-గత తరాల తీపి గురుతులు - జూలై 23...జాతీయ ప్రసార దినోత్సవం



ఒకనాడు రేడియో అనేది గోడకు వేలాడే గడియారంలా ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఉండేది. అది కేవలం ఓ సమాచార సాధనం కాదు... అది ప్రతి ఇంటికి ఓ సభ్యుడు, ప్రతి మనసుకు ఓ మిత్రుడు, ప్రతి ఉదయానికి ఓ ఆరాధన. రేడియో అంటే ఓ గొంతు మాత్రమే కాదు – అది ఓ ఊపిరి, ఓ అనుబంధం. పల్లె నుంచి పట్టణం దాకా, బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు, ప్రతి వయస్సు వారికీ రేడియో ఒక్క అనుభూతి. ఆ అనుభూతిని మాటల్లో తేలికగా చెప్పలేం. అది ఒక తేట గీతంలా గుండె గదుల్లోనూ, నొప్పి నిండిన నిశ్శబ్దాల్లోనూ హత్తుకుంటూ ఉంటుంది. తెల్లవారిన వెంటనే ' ఆకాశవాణి" అనే శబ్దంతో ప్రారంభమయ్యే రేడియో స్వరం %-% అది వినగానే మస్తిష్కం తేలిక పడేది. మునుపటి రోజుల్లో ఆ శబ్దం వినగానే ఇంటిలో ఉన్న వారంతా ఒక ప్రశాంత వాతావరణంలో తమ నిత్య పనులు ప్రారంభించేవారు. విందు వినోదాల వేదికగా, విజ్ఞాన వికాస మార్గంగా, ఆధ్యాత్మిక శాంతి సంకేతంగా ఈ మాధ్యమం ఆవిర్భవించింది. ప్రతి రోజు ఉదయం ఆరున్నర గంటల సమయంలో ప్రసారమయ్యే "సుప్రభాతం", "భక్తి రసార్చన", "వేద పారాయణం", "తిరుమల దర్శనం" వంటి కార్యక్రమాలు భక్తి భావంతో సజీవంగా మారేవి. ఆ స్వరాల తాకిడితో ఇంటి వాతావరణం పరిశుభ్ర మయిన అనుభూతి. పల్లె వాడల్లో , నగర వీధుల్లో ఆ స్వరాల పరిమళం వినిపించేది. ఉదయం "చక్కని మంచి మాట" అనే కార్యక్రమం ప్రసారమయ్యేది. మనోధైర్యం, జీవన సత్యాలు, నైతిక విలువల్ని స్పృశించే ఆ స్వల్ప ప్రసంగాలు గుండెకు ఓ వెలుగు. ఒక్కొక్క మాట ఒక్కొక్క జీవన సూక్తిలా మారేది. ఆ తరువాత "ఉదయ వాణి" అనే ముఖ్యమైన కార్యక్రమం %-% ఇందులో వార్తలు, రైతుల సమాచారం, మార్కెట్ ధరలు, ఆరోగ్య సలహాలు, జానపద గీతాలు, ప్రజలకు ఉపయోగపడే అంశాలు వినిపించేవి. దీనివల్ల ప్రభుత్వం చెప్పేది నేరుగా ప్రజల చెవుల్లోకి వెళ్లేది. ఇది నిజంగా ప్రజాస్వామ్యాన్ని బలపరిచే శ్రవణ వేదిక. ఆదివారం ఉదయాలు మరింత ప్రత్యేకమైనవి. "వినోద వీణ", "ఆనంద సందేశం", "అనురాగ గీతాలు", "జానపద పరిమళం", "భక్తి మంజరి", "ఆరోగ్య భారత్" వంటి కార్యక్రమాలు కుటుంబ సమేతంగా విందులా వినేలా చేసేవి. రేడియో చుట్టూ కూర్చుని తిండి తింటూ వినడం ఒక పండుగ అనుభూతి. ముఖ్యంగా "ఆనంద సందేశం" కార్యక్రమంలో ప్రముఖులు తమ సందేశాలను అందిస్తూ, పాటల ఎంపికతో శ్రోతల హృదయాలను అలరించేది. సాయంత్రాలు, రాత్రిళ్లకు "చిత్ర లహరి", "సినిమా గాసిప్", "వినోదాల వనమాలి", "సంగీత సరితా", "రసరంజని" వంటివి సంగీత ప్రియులకు ఊహకు అందని ఆనందాన్ని ఇచ్చేవి. పాటల మధ్య వ్యాఖ్యాత గళం వినడం కూడా పాటలకంటే మించి మధురంగా అనిపించేది. "సంగీత సరితా" అనే కార్యక్రమం ద్వారా శాస్త్రీయ సంగీతానికి అనుబంధంగా రాగాలు, తాళాలు, కళాకారుల పరిచయాలు వినిపించేవి. "హరిదాసుల పద్యాలాపన", "భగవద్గీత ప్రవచనాలు", "వేదార్థ సందేశం" వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు తెల్లవారుఝామున మనసును చల్లార్చేవి. అంతే కాదు, "పల్లె బాట" అనే గ్రామీణ అభివృద్ధి కార్యక్రమం పల్లె ప్రజల సమస్యలు, పథకాలు, పరిష్కారాలను పరిచయం చేస్తూ, గ్రామ జీవితానికి ఓ భాష్యం లాగా వినిపించేది. వ్యవసాయం, నీటి నిర్వహణ, పేదరిక నిర్మూలన, పాడి పంటలు, బావ గారి కబుర్లు వంటి అంశాలను గ్రామీణ శ్రోతలకు చేరువ చేసింది. బాలానందం చిన్నారులకు కథలు, పద్యాలు, శ్లోకాలు, పాటల ద్వారా విజ్ఞానం అందించేది. చిన్నారుల గొంతుకలలో వచ్చే పద్యాలాపనలు మన గుండె తంతులను తాకేవి. "యువ వాణి" వయోజన యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా విశేషాలు, జీవిత మార్గదర్శకాలను అందించేది. "ప్రశ్నోత్తర ప్రాంగణం" విద్యార్థుల చక్కటి ప్రయోజనాల కోసం రూపొందించ బడిన గొప్ప కార్యక్రమం. రాత్రిళ్ళకు "నలుగురితో కలసి" అనే ప్రజా సంబంధ కార్యక్రమం ప్రసారమయ్యేది. ప్రజల ఫోన్లు స్వీకరించి, అధికారుల సమక్షంలో వారి సమస్యలు చర్చించేవారు. ఇది ప్రజల సమస్యలు నేరుగా ప్రభుత్వానికి వినిపించే వేదికగా నిలిచింది. రేడియో నాటకాలు అంటే వినిపించే పాత్రల గొంతులనే కాక, మన ఊహాశక్తిని శ్రద్ధగా కదిలించే అనుభూతి. "పరమార్థ గురువు", "విచిత్ర వివాహం", "నవరసాల పల్లకీ", "కనకదుర్గ కథలు", "తెరపైకి మళ్లిన భూతం" వంటి శబ్ద నాటకాలు ఊహకు రెక్కలుగా మారి వినిపించేవి. ట్యూనింగ్ చేయడం, యాంటెన్నా తిప్పడం, రేడియో ట్యూబులు వేడెక్కినవా చూడడం, స్పీకర్ నుంచి వచ్చే ఓ స్వరం కోసం పరితపించడం – ఇవన్నీ ఒక తరం అనుభవించిన మధుర క్షణాలు. పల్లెలో తపాలా కార్యాలయం వద్ద, పంచాయతీ కార్యాలయం ఎదురుగా పెద్ద స్పీకర్ల ద్వారా ప్రసారాలు వినిపించేవి. అక్కడే ప్రజలు కూర్చుని వార్తలు వింటూ రాజకీయ చర్చలు జరుపుకునే వేదికగా మలుచుకునే వారు. టీ హోటల్స్ దగ్గర "ఆకాశవాణి వార్తలు" వినిపించేవి – అదే చర్చలకు కేంద్ర బిందువు. ఆకాశవాణి అనేది ఒక సాధారణ ప్రసార సంస్థ కాదు. అది సంస్కృతి ప్రసారిణి. అది తల్లి వాక్యం, తండ్రి ఆదేశం, స్నేహితుడి సరదా మాట, గురువు సందేశం అన్నీ కలిసిన గొంతుక. మన బాల్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని శ్రవణ పరంగా మలచిన అపురూప ఆణిముత్యం. ఈ డిజిటల్ యుగంలో పాడ్‌కాస్ట్‌లు, ఓ టీ పీ లు వచ్చినా %-% " ఆకాశవాణి%ొ%" అన్న వాక్యం వినిపించగానే గుండె కొట్టుకునే స్పందన ఇప్పటికీ ఉంటుంది. ఆ గళం వెనక ఉన్న నిబద్ధత, ఆ కార్యక్రమాల వెనక ఉన్న సామూహిక బాధ్యత, ఆ పాటల వెనక ఉన్న భావోద్వేగాలు %-% ఇవన్నీ కలిస్తే రేడియో అనుభవం దైవికంగా మారుతుంది. ఓ గళం కూడా మన జీవితాలను మార్చగలదని, ఓ శబ్ద తరంగం కూడా సమాజాన్ని స్పృశించగలదని ...గత తరం, నేటి తరాలకు చెబుతుండాలి. ఆకాశవాణి గళం – అది వినిపించిన ప్రతీసారి మన హృదయాల అలలపై తృప్తి గీతంలా ఊసులేస్తుంది. ఈ గళానికి, ఈ అనుబంధానికి, ఈ జ్ఞాపకానికి మన హృదయ పూర్వక కృతజ్ఞతలు. **రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్టు – 9440595494**

# ధన్‌కడ్ రాజీనామా స్వచ్ఛందమా? లేక వ్యూహాత్మకమా?



భారత రాజ్యాంగ వ్యవస్థలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పదవుల్లో ఒకటైన ఉప రాష్ట్రపతి స్థానం నుంచి జగదీప్ ధన్‌కడ్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. 2022లో ఎన్డీఏ తరఫున ఉప రాష్ట్రపతిగా ఎన్నికై, రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన, 2025 జూలై 21న తన పదవికి విరమణ చేయడం పలువురు ఆశ్చర్యానికి గురయ్యేలా చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసిన రాజీనామా లేఖలో, ఆయన తన నిర్ణయానికి కారణంగా ఆరోగ్యపరమైన విషయాలనే పేర్కొనడం తెలిసిందే. అయినప్పటికీ, ఈ తక్షణ రాజీనామా వెనుక ఉన్న రాజకీయ, వ్యూహాత్మక, వ్యక్తిగత అంశాలపై అనేక వాదనలు, విశ్లేషణలు వినిపిస్తున్నాయి. జగదీప్ ధన్‌కడ్ జీవిత ప్రయాణం న్యాయవేత్తగా ప్రారంభమై రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి కేంద్ర మంత్రిగా, రాష్ట్ర గవర్నర్‌గా, ఆపై ఉప రాష్ట్రపతిగా అభివృద్ధి చెందడం గమనార్హం. ఆయన 1951 మే 18న రాజస్థాన్‌లోని జున్‌ఝునూలో జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఆయనకు న్యాయ రంగంపై మక్కువ పెరిగి, విద్యనభ్యసించి, 1979లో అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. భారత సుప్రీంకోర్టు సహా అనేక హైకోర్టుల్లో న్యాయవాది సేవలు అందించారు. న్యాయపరంగా ఉన్న స్పష్టత, రాజకీయ విషయాల్లో ఉన్న అవగాహన ఆయనను కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించడానికి దోహదపడింది. 1990లో జంతా దళ్ తరఫున ఆయన కేంద్ర పార్లమెంటులో సభ్యుడిగా ఎన్నికై, కేంద్ర ప్రభుత్వంలో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేశారు. అనంతరం రాజకీయంగా ఎన్డీఏ బలోపేతానికి తమ వంతు పాత్రను నిర్వహిస్తూ, రాజస్థాన్ బీజేపీకి కీలక నేతగా ఎదిగారు. 2019లో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులై, రాష్ట్ర పాలన వ్యవహారాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం తీరును తరచూ ప్రశ్నించడం ద్వారా విభేదాలకు కేంద్రబిందువయ్యారు. రాజ్యాంగ సంబంధిత అంశాలపై గవర్నర్‌గా దిగ్విజయంగా వ్యవహరించినా, ఆయన వ్యాఖ్యలు, అధికార విధానాలు అప్పట్లో తీవ్ర చర్చలకు దారితీశాయి. పశ్చిమ బెంగాల్‌లోని ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా గవర్నర్‌గా పలుమార్లు కౌంటర్ ఇచ్చిన సందర్భాలు, తాను నియమించుకున్న వీసీ లను బంగాళా ప్రభుత్వం తిరస్కరించిన ఘటనలు, రాష్ట్రపతి వరకు వెళ్లిన సమస్యలు ఆయన గవర్నర్‌గా తీసుకున్న నిర్ణయాలకు ఉదాహరణలుగా నిలిచాయి. 2022 జూలైలో ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ అభ్యర్థిగా ధన్‌కడ్ ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ శిఫారసు చేయగా, విపక్షాల నుండి మార్గరెట్ ఆల్వా పోటీలో నిలిచారు. ధన్‌కడ్ కు528 ఓట్లు లభించగా, ఆల్వా 182 ఓట్లకే పరిమితమయ్యారు. ఈ విజయం ద్వారా ధన్‌కడ్ కేంద్రం విశ్వాసాన్ని సంపాదించడమే కాకుండా, రాజ్యాంగబద్ధ పదవిలో తనదైన ముద్ర వేసే అవకాశం పొందారు. రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయన పలు కీలక చర్చలను నడిపించడం, పార్లమెంటు అభ్యంతరాల సందర్భంగా సమగ్ర సమన్వయం కల్పించడం ప్రశంసనీయం. మహిళా సభ్యులను రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ప్యానెల్లో చేర్చడం వంటి పరిణామాలు ఆయన దృష్టికోణానికి నిదర్శనంగా నిలిచాయి. అయితే 2025 మధ్యభాగానికి వచ్చేసరికి ఆయన ఆరోగ్య పరిస్థితి కొద్దిగా దెబ్బతినడం ప్రారంభమైంది. సమాచారం ప్రకారం ఆయన ఇటీవల ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించు కున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు అధికారిక కార్యక్రమాల నిర్వహణలో కొంత మందకడే కనిపించడంతో, ఆయన ఆరోగ్యంపై అనేక సందేహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో జూలై 21న ఆయన రాజీనామా ప్రకటించగా, అది తక్షణమే అమలులోకి వచ్చింది. రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్న "నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రజాసేవ చేసే మార్గంలో ఆరోగ్యాన్ని రక్షించుకోవడం కూడా ఒక విధమైన బాధ్యత" అనే మాటలు, వ్యక్తిగత పరిణతి, బాధ్యతాయుత దృక్కోణాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ అనూహ్య పరిణామం నేపథ్యంలో దేశ రాజకీయ వర్గాల్లో విభిన్న స్పందనలు వినిపించాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేష్ ఈ రాజీనామా వెనుక 'ఇంకా పెద్ద కారణాలు ఉండే అవకాశముంది' అని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. ఆయన "జూలై 20 సాయంత్రం నుండి 21 మధ్యాహ్నం 4:30 వరకూ ఏదో తీవ్రమైన పరిణామం జరిగింది" అని వ్యాఖ్యానించడం రాజకీయ విమర్శలకు తావిచ్చింది. కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ధన్‌కర్ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ, ఆయన ఆరోగ్యానికి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ పరంగా ఉప రాష్ట్రపతి పదవి ఖాళీ అయిన నేపథ్యంలో ఆరు నెలల లోపే ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. భారత పార్లమెంటు సభ్యుల ఓట్లతో ఈ ఎన్నిక జరగనుంది. పదవీకాలం ముగియకముందే రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతుల చరిత్రలో ధన్‌కడ్ మూడో వ్యక్తిగా నిలిచారు. మొదటిగా వెంకట్ రామన్ 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడం కోసం రాజీనామా చేయగా, తర్వాత హమీద్ అన్సారీ రెండవ టర్మ్ ముగించడానికే రాజీనామా చేశారు. ఇక జగదీప్ ధన్‌కర్ ఆరోగ్య కారణాల వల్ల పదవికి వీడ్కోలు పలికారు. సారాంశంగా చెప్పాలంటే, జగదీప్ ధన్‌కడ్ రాజీనామా రాజకీయ పరిణామాల్లో మైలురాయిగా నిలవనుంది. అధికారికంగా ఇది ఆరోగ్యపరమైన నిర్ణయమే అయినప్పటికీ, రాజకీయ, వ్యూహాత్మక నేపథ్యాలపై అనేక విశ్లేషణలు, సందేహాలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఆయన నిర్ణయానికి మౌలికంగా ఉన్న నైతిక బలం, బాధ్యతాయుత వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. న్యాయవేత్తగా, గవర్నర్‌గా, ఉప రాష్ట్రపతిగా తాను నిర్వహించిన బాధ్యతలన్నింటిలోనూ సమర్థతను చాటుకున్న ధన్‌కడ్, దేశ రాజకీయ చరిత్రలో ఒక విలక్షణ వ్యక్తిగా నిలిచారు. ఆయన రాజీనామాతో ప్రారంభమైన ఈ కొత్త అధ్యాయానికి తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో కలుగజేస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# చంఘీజ్ ఖాన్

## నరహంతకుడా? వాతావరణ రక్షకుడా?

చరిత్రలో అత్యంత క్రూరమైన పాలకులలో ఒకరిగా నిలిచిన చంఘీజ్ ఖాన్ పేరు వినగానే మనసులో భయం కలుగుతుంది. 12వ శతాబ్దం చివరి నాటికి చైనా నుండి యూరప్ వరకు విస్తరించిన అతని మంగోల్ సైన్యం వేలాది దండయాత్రలు చేసింది. ఈ దాడులు ఎంతో హింసాత్మకంగా, విపరీతమైన మానవ నష్టాన్ని కలిగించాయి. అంచనాల ప్రకారం.. అతని పాలనలో కనీసం 4 కోట్ల మంది మరణించారు. అయితే, ఇదే చంఘీజ్ ఖాన్‌కు 'ఎకో సేవర్' అనే ఆశ్చర్యకరమైన బిరుదును శాస్త్రవేత్తలు ఎందుకు ఇస్తున్నారు?

**–హింస వెనక వాతావరణానికి ప్రయోజనం?...** చంఘీజ్ ఖాన్ నరహంతకుడిగా చరిత్రలో నిలిచిపోయినప్పటికీ, అతని చర్యల వల్ల భూమిపై గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలు తగ్గాయని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీకి చెందిన పర్యావరణ శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం ప్రకారం చంఘీజ్ ఖాన్ దండయాత్రల కారణంగా అనేక గణనీయమైన పర్యావరణ మార్పులు సంభవించాయి. యుద్ధాల కారణంగా ప్రజల సంఖ్య తగ్గడం, నగరాలు నాశనం కావడం వల్ల వనరుల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. దండయాత్రలు, జననష్టం వల్ల వ్యవసాయ భూములు బీడు భూములుగా మారాయి. ఇది కార్బన్ డయాక్సైడ్ పరిమాణాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించింది. ప్రజలు లేకపోవడం, వ్యవసాయం ఆగిపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో అడవులు తిరిగి పెరిగాయి. ఇది వాతావరణం నుండి కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించే సామర్థ్యాన్ని పెంచింది. ఈ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపించిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**–ప్రపంచ జనాభా క్షీణత... ప్రకృతికి ఉపశమనం?...** చంఘీజ్ ఖాన్ దాడులు చేసిన దేశాల్లో ప్రజలు భారీగా మరణించారు. నగరాలు, గ్రామాలు ఖాళీ అయ్యాయి, వ్యవసాయం పూర్తిగా నాశనమైంది. దీనితో భూమిపై మానవుల ఉనికి తక్కువ కావడంతో సహజసిద్ధంగా కార్బన్ ఉద్గారాలు తగ్గి, గ్రీన్ కవరేజ్ పెరిగిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఒక విధంగా అపారమైన మానవ విధ్వంసం ప్రకృతికి కొంత ఉపశమనాన్ని ఇచ్చిందని ఈ అధ్యయనం సూచిస్తుంది.

**–మరో కోణం: చరిత్రను పునఃవిశ్లేషించాల్సిన అవసరం...** ఇంతటి విపరీత నరహంతకుడికి 'ఎకో సేవర్' అనే ట్యాగ్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇది చంఘీజ్ ఖాన్‌కి మద్దతు కాదు, కానీ "ఒక అతి దారుణమైన చారిత్రక సంఘటనలో కూడా ప్రకృతి దృక్పథంలో కొన్ని ప్రభావాలు ఉండవచ్చన్న సంకేతం" అని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ విశ్లేషణ, ఒక సంఘటన లేదా వ్యక్తి యొక్క వివిధ కోణాలను పరిశీలించడం, చరిత్రను కేవలం ఒకే కోణం నుండి చూడకుండా విభిన్న దృక్పథాలతో అంచనా వేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది.

**చంఘీజ్ ఖాన్ – నరహంతకుడా? ప్రకృతి రక్షకుడా?...** చంఘీజ్ ఖాన్‌ను చరిత్ర అత్యంత క్రూరమైన నాయకుడిగా గుర్తించింది. అయితే, అతని చర్యల ప్రభావం భూమి వాతావరణంపై కొంతవరకు ప్రకృతికి అనుకూలంగా మారిందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ విశ్లేషణ నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే వనరుల వినియోగం, జనాభా వృద్ధి, మరియు కార్బన్ ఉద్గారాలు అన్నీ భవిష్యత్ వాతావరణ మార్పులపై ఎంతటి ప్రభావం చూపుతాయో గుర్తించాలి. చంఘీజ్ ఖాన్ వంటి చారిత్రక వ్యక్తులు అందించే గుణపాఠం వినాశమే మార్గం కాదు, పరిమిత వినియోగమే పరిష్కారం.

# భారత జాతీయోద్యమ పిత బాలగంగాధర తిలక్ - జూలై 23...తిలక్ జయంతి సందర్భంగా



బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 – ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో–వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువుతున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3–డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్–బాల్–పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం–856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు. బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేశాభివృద్ధికి రేడియో ప్రసారాల చేయూత - జూలై 23...బొంబాయి రేడియో కార్యక్రమాల ప్రారంభ దినం

ప్రస్తుత కాలంలో ఇంటిలో ఇప్పుడు టివి ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంటిలో రేడియో సెట్ ఉండేది. రేడియో ద్వారానే నాడు నిత్య ప్రాపంచిక విషయాలు ప్రజలకు చేరేవి. సమయ సారిణిని క్రమంగా వివిధ కార్యక్రమాలు ప్రసారం జరిగేవి. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధాన మైనది. జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైనా, 1927 జూలై 23న తొలి సారిగా బొంబాయి రేడియో స్టేషన్ ప్రారంభం అయింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది. అలా 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్ ప్రారంభం అయి తద్వారా ప్రసారాలు ప్రారంభం అయినాయి. తర్వాత కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. తొలి రోజులలో వాల్వులను ఉపయోగించి, రేడియోలను తయారు చేసేవారు. అవి ఎక్కువ విద్యుత్‌ను వాడేవి, పరిమాణంలో కూడా చాలా పెద్దవిగా ఉండేవి. ఒక చోట మాత్రమే ఉంచి వినవలసి వచ్చేది. 1960లు వచ్చేటప్పటికి, ట్రాన్సిస్టరు కనిపెట్టబడి, ఆ ట్రాన్సిస్టర్ లను వాడిన రేడియోలు వాడకంలోకి వచ్చాయి. వీటిని ట్రాన్‌సిస్టర్ రేడియోలు అని పిలిచే వారు. ఇవి విద్యుత్‌ను చాలా తక్కువగా వాడుకుని, అలాగే ఘటము (బ్యాటరీ)తో కూడా పని చేయగలవు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ఈ ట్రాన్సిస్టర్ సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెంది, రేడియోలు పరిమాణంలో చిన్నవి, అతి చిన్నవిగా మారి పోయాయి. జేబులో పట్టే రేడియోలు కూడా వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లోకి విడుదలవుతున్న ప్రతీ కంపెనీ మొబైల్స్ లోనూ రేడియో అప్లికేషను తప్పనిసరి అయి పోయింది. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ సమకూర్చుకుని మార్కోనీ విస్తృత పరిశోధనలు చేశాడు. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన గొప్పతనం మార్కోనీ కే దక్కింది. మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ



సందేశం పంపించ గలిగాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారీ జరిగింది. బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశవాణి ప్రపంచములోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరు కుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగు తున్నాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 అకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాల (144 %వీఔ% కేంద్రాలు, 54 %ూఔ% కేంద్రాలు, 139 ఎఫ్ఎం కేంద్రాలు)తో 77 ఆకాశవాణి కేంద్రాలు 99.13% ప్రజలకు ప్రస్తుతం ప్రజలకు సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. ఆకాశవాణి తొలి తెలుగు ప్రసారాలు 1938 జూన్ 16న ప్రారంభమయ్యాయి. ఆరోజు సాయంత్రం 5.30గంటలకు సౌరాష్ట్ర రాగంలో త్యాగరాజ స్వామి రచించిన శ్రీ గణపతిని సేవింపరాదే అనే తెలుగు కృతిని తిరువెన్కాడు సుబ్రహ్మణ్యపిళ్లై నాదస్వరంపై వాయిస్తూండగా అదే తొలి ప్రసారంగా మద్రాసు కేంద్రం ప్రారంభమైంది. ఆ రాత్రే 8.15కు భారతదేశం – రేడియో అంశంపై ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రధాని సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు తెలుగులో ప్రసంగించారు. మద్రాసు కేంద్రం తొలి తెలుగు ప్రసంగాల్లో 1938 జూన్ 18న సజీవమైన తెలుగు అనే అంశంపై గిడుగు రామమూర్తి పంతులు, జూన్ 21న మన ఇల్లు – దాని అందము చందము అనే అంశంపై కోలవెన్ను రామకోటేశ్వరరావు, జూన్ 23న రవీంద్రుని గురించి బెజవాడ గోపాలరెడ్డి 15నిమిషాల వ్యవధి గల ప్రసంగాలు చేశారు. ముద్దుకృష్ణ రాసిన అనార్కలి మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమైన తొలి తెలుగు నాటకం. 1938 జూన్ 24 రాత్రి 8.30గంటలకు ఆ నాటకం ప్రసారమైంది. 1938 జూన్ 25 రాత్రి తొలిగా జానపద సంగీతం ప్రసారమైంది. ఆకాశవాణి మద్రాసు కేంద్రం తెలుగులో తొలి ప్రసారాలు చేయగా 1948 అక్టోబరు 12న తొలి తెలుగు రేడియో స్టేషనుగా విజయవాడ కేంద్రం ప్రారంభమైంది. అదే సంవత్సరం డిసెంబరు 1 నుంచి విజయవాడ కేంద్రం ప్రసారాలు ప్రారంభించింది. 1933లో హైదారాబాద్ చిరాగ్ అలీ వీధిలో మహబూబ్ అలీ 200వాట్ల శక్తిగల రేడియోకేంద్రం స్థాపించారు. దాన్ని 1935 ఫిబ్రవరి 3న నిజాం తన అదుపులోకి తీసుకున్నారు. దక్కన్ రేడియోగా 7వ అసఫ్ జా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిజాము ఉర్దూ ప్రసారాలతో ప్రారంభించినా పరిమితంగా తెలుగు, కన్నడ, మరాఠీ కార్యక్రమాలుండేవి. స్టూడియో సరూర్ నగర్ నుంచి ఖైరతాబాద్ యావర్ మంజిల్ కు తరలింది. 1948 డిసెంబరు 1నాటికి 800వాట్ల శక్తితో షార్ట్ వేవ్, మీడియం వేవ్ లతో ఉన్న దక్కన్ రేడియోలో తెలుగు కార్యక్రమాలను పెంచేందుకు మాడపాటి హనుమంతరావు ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. 1950లో దక్కన్ రేడియో కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆలిండియా రేడియో హైదారాబాద్ కేంద్రంగా మార్చింది. ఇటీవలి కాలంలో టీవీ ఛానెళ్ల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎఫ్ ఎమ్ రేడియో చానెళ్లు అన్ని వర్గాల వారికీ శ్రవణానందాన్ని కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆకాశవాణి ప్రసార కేంద్రాలు అనంతపురము, కడప, విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, తిరుపతి, మార్కాపురంలో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదు, కొత్తగూడెం, నిజామాబాదు, వరంగల్లు , ఆదిలాబాదు తదితరాలు పని చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జాతీయ ప్రసార దినోత్సవం - రేడియో తరంగాల్లో ప్రజల జీవన ప్రవాహం : జూలై 23.... జాతీయ ప్రసార దినోత్సవం



భారతీయ ప్రసార చరిత్రలో మైలురాయిగా నిలిచిన జూలై 23వ తేదీని జాతీయ ప్రసార దినోత్సవంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1927 జూలై 23న ముంబయిలో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో మొదలైన అధికారిక రేడియో ప్రసారాలు, దేశ సమాచార యుగానికి నాంది పలికాయి. ఇది రేడియో పరంపర ప్రారంభమైన రోజు మాత్రమే కాదు, అది భవిష్యత్ భారత సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని శాసించిన శ్రవణ మాధ్యమానికి ఆవిర్భావ దినం. భారతదేశంలో ప్రయోగాత్మక రేడియో ప్రసారాలు 1923 నుంచే కొన్ని ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ప్రారంభమైనా, ప్రభుత్వ అధికారిక ప్రమేయం మాత్రం 1927 నుంచే. 1930లో కేంద్ర ప్రభుత్వం %×దీజ%ని స్వాధీనం చేసుకుని లిలిఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌గా నిర్వహించింది. 1936లో దీనికి 'ఆకాశవాణి' అనే శాశ్వత, భారతీయతను ప్రతిబింబించే పేరు కల్పించారు. స్వాతంత్ర్యానికి ముందు కేవలం మూడు కేంద్రాలే ఉన్నప్పటికీ, స్వాతంత్ర్యం అనంతరం రేడియో అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసింది. 1950 నాటికి 6 కేంద్రాలుండగా, 2024 నాటికి దేశవ్యాప్తంగా 420కి పైగా ప్రసార కేంద్రాలు, 600కు పైగా ట్రాన్స్‌మిటర్లు ఏర్పడి 99.2% జనాభా పరిధిని కవర్ చేస్తుండడం ఈ వ్యవస్థ సామర్థ్యానికి ప్రతీక. రేడియో ఓ భావోద్వేగపు అనుబంధం. ఇది కేవలం సమాచారం అందించే సాధనం కాదు. 1950ల నుంచి 1990ల దాకా ఇది ప్రతి ఇంటిలో వినిపించే స్నేహ గళం. తెల్లవారగానే "ఆకాశవాణి" శబ్దంతో ప్రారంభమయ్యే ప్రసారాలు %–% శ్లోకాలు, వార్తలు, వ్యవసాయ సూచనలు, జానపద గీతాలు, కథలు, నాటకాలు, సినీ గీతాలు %–% అన్ని వయస్సులవారికీ ప్రత్యేక అనుభూతిని అందించేవి. ఆదివారాలు "వినోద వీణ", "అనురాగ గీతాలు", "సుప్రభాతం", "భక్తి రసార్చన", "ఆరోగ్య భారతీ" వంటి కార్యక్రమాలు అలరించేవి. రాత్రిళ్లు "చిత్రలహరి", "సినిమా గాసిప్", "కవిసమ్మేళనం", "నాటకాలు" ఊహాశక్తిని పెంపొందించేవి. రైతులకు ప్రియమైన "పల్లె బాట" వంటి కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధిని తాకినవి. "పేదరిక నివారణ" వంటి సమస్యలపై చర్చలు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు "శ్రావణ రాగాలు", "వైద్యుల సందడి", "చింతన చేష్టలు" వంటి శ్రావ్యమైన వేదికలుగా నిలిచినవి. విద్యార్థుల కోసం "బాల వాణి", "యువ వాణి", "ప్రశ్నోత్తర ప్రాంగణం" వంటి విద్యా సంబంధిత కార్యక్రమాలు లక్షల మందిని విజ్ఞానంతో అభివృద్ధి చేశాయి. "సంగీత సరితా" ద్వారా శాస్త్రీయ సంగీతాన్ని జనానికి చేరువ చేయడంలో రేడియో పాత్ర అమోఘం. "హరిదాసుల పద్యాలాపన", "వేద పారాయణం", "గీతా ప్రవచనాలు" వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు తెల్లవారుఝామున గాలి తరంగాల్లో వినిపిస్తూ భక్తి భావన కలిగించేవి. రేడియో అంటే ఒక ఊహాజనిత బంధం. పల్లెటూర్లలో పంచాయతీ కార్యాలయాల వద్ద ఉండే పెద్ద స్పీకర్ల ద్వారా ప్రజలంతా వినేవారు. పంటకూలీలు పొలాల్లో పనిచేస్తూ రేడియో వంక చూశేవారు. టీపాయింట్ల వద్ద వినిపించే "ఆకాశవాణి వార్తలు"పై చర్చలే ఆ గ్రామానికి వార్తాశ్రావ్యతను కలిగించేవి. ఓ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, ఓ కొత్త సినిమా పాట, ఓ కవి వాక్యం... అన్నీ రేడియో ద్వారా ప్రజల గుండెకు చేరేవి. నేటి డిజిటల్ యుగంలో కూడా రేడియో తన ఆధునిక రూపాలతో ముందుకు సాగుతోంది. పాడ్‌కాస్ట్‌లు, FM స్టేషన్లు, ఆన్‌లైన్ రేడియో స్ట్రీమింగ్‌లు వినిపిస్తున్నా, ఆకాశవాణి యొక్క నమ్మకమైన, నిష్పక్షపాత స్వరం మాత్రం అపూర్వమైనదిగా నిలిచింది. "న్యూస్ ఆన్ AIR" యాప్ ద్వారా 24 గంటల వార్తల సేవ, బహుభాషా ప్రసారాలు అందుబాటులో ఉన్నాయి. సముద్రంలో మత్స్యకారులకు వాతావరణ సూచనలు, సరిహద్దుల్లో జవాన్లకు భాషా బంధాలు కలిగించే గళం, "జన గణ మన"తో ముగిసే ఆ రోజంతా వినిపించే స్వరం – ఇవన్నీ భారతీయుల గుండె గదుల్లో సజీవంగా నిలిచి ఉన్నాయి. ఈ రోజు జాతీయ ప్రసార దినోత్సవం సందర్భంగా మనం గుర్తు చేసుకోవలసిన విషయం %–% రేడియో అనేది ఒక భావోద్వేగ వేదిక. అది వినిపించే ప్రతి గళం ఓ అనుబంధం, ప్రతి కార్యక్రమం ఓ జ్ఞాపకం. అది మనం వినిపించుకున్న నాడీ తంతువు. అందుకే, "ఆకాశవాణి..." అనే ఆ గళానికి మన హృదయపూర్వక నమస్సులు. **రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్టు – 9440595494**

# అరుదైన అవకాశం.. ఆదాయం ఘనం

కొత్తగూడెం : అరుదైన లోహకాల అన్వేషణ దిశగా సింగరేణి యాజమాన్యం వేగంగా అడుగులు వేస్తోంది. సింగరేణి పరిధిలో అరుదైన భూలోహకాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఉన్నట్లు నిర్ధారించుకుని.. వాటిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తోంది.

**రెండు సంస్థలతో ఒప్పందాలు**

కీలక ఖనిజాల అన్వేషణ, పరిశోధన, అధునాతన సాంకేతిక వాడకం, ఉత్పత్తితో పాటు పర్యావరణహిత పద్ధతుల వినియోగంలో పరస్పర లాభదాయక ఒప్పంద పత్రాలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ), సింగరేణి సంస్థ అధికారులు జూన్ రెండో వారంలో సంతకాలు చేశారు. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహకాలపై పరిశోధన, ఉత్పత్తి నిమిత్తం కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌తో సింగరేణి సంస్థ ఈనెల 4న ఒప్పందం కుదుర్చుకుంది.

**ఉభయ జిల్లాల్లోని కొన్ని గుట్టల్లోనూ..**

అరుదుగా లభించే పదార్థాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) సింగరేణిలోని కొన్ని ఉపరితల గనుల్లో ఉన్నట్లు సింగరేణి సంస్థ ప్రాథమికంగా నిర్ధారించుకుంది. విద్యుదుత్పత్తి సందర్భంగా విడుదలయ్యే బూడిదలో నూ భూ లోహకాలు ఉన్నాయని కనుగొంది. మణుగూరుకు సమీపంలోని దుర్గంగుట్ట బ్లాకులో సగటున 266.21పీపీఎం స్థాయిలో ఇవి లభ్యమైనట్లు చెబుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని కొన్ని గుట్టల్లోనూ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు తేలిందని పేర్కొంటోంది. లాంథనం, సీరియం, ప్రసియోడిమియం వంటి ఆరు రకాల తేలికైన లోహకాలు, ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి ఎనిమిది రకాల భార లోహకాలు సింగరేణి ప్రాంతంలో ఉన్నట్లు కనుగొంది. ఎంతో విలువైన భూ లోహకాలను ఉత్పత్తి చేసేందుకు అయ్యే ఖర్చు, వాటిని విక్రయిస్తే వచ్చే లాభం మొదలైన అంశాలను విశ్లేషించాల్సి ఉంది. అరుదైన లోహాల ధరలు అధికంగా ఉంటున్నందున ఉత్పత్తి ఖర్చు కన్నా విక్రయించగా వచ్చే ఆదాయం అధికంగా ఉంటుందని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. ఈ భూ లోహకాలను వెలికితీయటం సింగరేణికి లాభించే అంశం. అందుకే ఆ రంగంలో అనుభవం కలిగిన కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. దేశీయంగా కీలక ఖనిజాల ఉత్పత్తికి ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తుండటంతో సింగరేణి ఈ రంగం వైపు దృష్టి సారించింది.ఎన్.బలరాం, సింగరేణి సీఎండీ

# పురాల్లో స్వచ్ఛతపై శీతకన్ను

సిద్దిపేట : ప్రజలు సహకరించాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అప్పుడే పురపాలికలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధ్యమవుతాయి. జిల్లాలోని కొన్ని పురపాలికల్లో ప్రధానంగా వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడంతో గతం కంటే ర్యాంకులు పడిపోయాయి. సిద్దిపేట ఒక్కటే జాతీయస్థాయిలో మెరిసింది. ఆదర్శ పట్టణం కొంత వెనుకబాటుకు గురైంది. రాష్ట్రస్థాయిలో 73వ, జాతీయస్థాయి 448వ ర్యాంకు సాధించింది. ఇంటింటి చెత్త సేకరణ 86 శాతం, ఇంటి వద్దే వేర్వేరుగా ఇస్తున్నది 53 శాతం, నిర్వహణ 58 శాతంగా ఉంది. ఘన వ్యర్థాల నిర్వహణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. బహిరంగ ప్రాంతాల్లో చెత్త పారబోతకు అడ్డుకట్ట వేయాలి. సంబంధిత అంశంపై కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను సంప్రదించగా.. విధుల్లో చేరినప్పటి నుంచి పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ముందడుగు వేస్తున్నామని తెలిపారు.



మూడు రోజులకోసారి... రాష్ట్రంలో 142వ ర్యాంకు పొందింది. డంపింగ్‌యార్డు పనులు అసంపూర్తిగా ఉంది. పట్టణంలో మూడు రోజులకోసారి ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న డంపింగ్‌యార్డు ఆవరణలో కుమ్మరిస్తున్నారు. సిబ్బంది, నిధుల కొరతతో పూర్తిస్థాయిలో చేయలేని పరిస్థితి ఉందని.. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని మెరుగైన ర్యాంకు యత్నిస్తామని కమిషనర్ నాగేందర్ తెలిపారు.

**మరింత దిగజారింది**

దుబ్బాక రాష్ట్ర స్థాయిలో 97.. జాతీయ స్థాయిలో 946వ ర్యాంకులో నిలిచింది. గత సంవత్సరం 18వ స్థానాన్ని సాధించింది. ఈసారి దిగజారింది. పురలో 20 వార్డులున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ 54 శాతం, తడి, పొడి వ్యర్థాల నిర్వహణ 34 శాతం జరుగుతోంది. సిబ్బంది లేక వ్యర్థాలను వేరుచేయడం లేదు. డీఆర్‌సీసీ కేంద్రంలో విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. పూర్తి స్థాయి పారిశుద్ధ్య అధికారి పోస్టు ఖాళీగా ఉంది. వ్యర్థాల నిర్వహణపై మరింత దృష్టి పెడతామని.. సిబ్బంది కొరతను అధిగమిస్తామని కమిషనర్ కె.రమేశ్‌కుమార్ చెప్పారు.

# సహకారం అమోఘం

హుస్నాబాద్: సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తడి, పొడి చెత్త వేరుగా సేకరించడం వంటి పలు అంశాల ప్రాతిపాదికగా హుస్నాబాద్ పురపాలికకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో 139, రాష్ట్రంలో 9వ ర్యాంకు.. జిల్లాలో మొదటి ర్యాంకును హుస్నాబాద్ సాధించింది. పురపాలికలో 20 వార్డులున్నాయి. ప్రధానంగా పేదలు ఉండే ప్రాంతాల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేశారు. కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ, వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలచి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడు అవార్డులు లభించాయి. సిబ్బందికి ప్రజలు సహకరించడం వల్లే అవార్డు సాధించగలిగామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**మెరుగైన ర్యాంకు** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంకు సాధించింది. గతంలో 142వ ర్యాంకు. 100 శాతం చెత్త సేకరణ చేపడుతున్నారు. రోడ్ల పక్కన కుప్పలుగా వ్యర్థాలు పారబోయడాన్ని నిరోధిస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్లు పర్యవేక్షించేందుకు వారంలో రెండు సార్లు ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నారు. 13 వేలకు పైగా నివాసాలు, 55 వేల జనాభా, 20 వార్డులు కలిగిన మున్సిపాలిటీలో 132 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

# ఆహార శుద్ధికి చేయూత కరవు



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలు మరింత ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు కేంద్రం ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని అమలు చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు రాయితీ అవకాశాన్ని కల్పించింది. అవగాహన లోపంతో ఉమ్మడి జిల్లాలో ఈ లక్ష్యం అటకెక్కింది. నైపుణ్యం, మార్కెటింగ్ మెలకువలు లేకపోవడంతో మహిళలు వ్యాపారాల్లో రాణించలేకపోతున్నారు. ఆసక్తి ఉన్న అతివలకు ప్రోత్సాహకంకరవై యూనిట్లు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటే వారు విభిన్న వ్యాపారాలపై దృష్టి పెట్టే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో 50,183 స్వశక్తి సంఘాల్లో 5,55,242 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రతి జిల్లాకు గతేడాది రెండు వందల చొప్పున యూనిట్ల లక్ష్యం విధించారు. రూ.50 వేల నుంచి రూ.20 లక్షల వరకు రుణం మంజూరు కానుంది. కొత్తగా నెలకొల్పడంతోపాటు పాత వాటిని పునరుద్ధరించుకోవడం, యంత్రాల సామర్థ్యం పెంచుకోవచ్చు. మహిళలకు 35 శాతం రాయితీ ఉంది. ఇప్పటి వరకు పెద్దపల్లిలో 168, కరీంనగర్‌లో 13, జగిత్యాలలో 142, సిరిసిల్లలో 64 యూనిట్లు మాత్రమే స్థాపించారు. ఉమ్మడి జిల్లాలో 800 యూనిట్లు లక్ష్యం ఉండగా 387 మాత్రమే గ్రౌండింగ్ చేశారు. కరీంనగర్‌లో అత్యల్పంగా ఉంది.

**నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా..**

స్థానికంగా పండిస్తున్న పంట ఉత్పత్తులతోపాటు ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. పిండిగిర్నీ, అటుకుల మిల్లు, కారం, పసుపు పొడి మిల్లు, పచ్చళ్ల తయారీ, మురుకులు, కుర్‌కురే, పౌల్ట్రీ, పశువుల దాణా తయారీ, తీపి పదార్థాలు, బిస్కెట్లు, పాల పదార్థాలు, చిరు ధాన్యాలు, నూనె, అప్పడాలు, పిండి వంటలు ఇలా 25రకాలకుపైగా ఉత్పత్తి చేసుకోవచ్చు. ప్రజల అవసరాలను బట్టి ఆహార శుద్ధి పరిశ్రమల యూనిట్లు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే మహిళలు ఎక్కువగా పిండి, కారం, పసుపు పొడి యూనిట్లకే మొగ్గు చూపుతున్నారు.

**అధికారులు ఇలా చేస్తే...**

కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకునే విధంగా నైపుణ్యాలు అందించాలి. రుచికరమైన నాణ్యమైన ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి. జీఎస్టీ చెల్లింపులు, మార్కెట్ మెలకువలపై పట్టు సాధించేందుకు తర్ఫీదు ఇవ్వాలి. వ్యాపారంలో నిలదొక్కుకునే వరకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి.

# ఎన్నేళ్లూ..ఈ కన్నీళ్లు..!



సూర్యాపేట : పుట్టుకతో కొందరు..అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ఇంకొందరు.. ఇలా జిల్లాలో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులు 'ఆసరా' అందక అష్టకష్టాలు పడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతగా సహకరించక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అందుకు ఆర్థిక భరోసా ఉంటుందని సర్కారు సదరం ధ్రువీకరణ పత్రం జారీచేసింది. దాని ఆధారంగా పింఛన్ కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం మంజూరు కోసం అనుమతి ఇస్తే దరఖాస్తులు తీసుకొని ఆసరా అందిస్తామంటూ అధికారులు తిప్పి పంపుతున్నారు.

**మూడేళ్లుగా నిరీక్షణ**

జిల్లా వ్యాప్తంగా వైకల్యంతో బాధపడుతూ సదరం ధ్రువీకరణ పత్రం పొందిన వారు ఈ మూడేళ్ల కాలంలో 2,022 మంది ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి మండలంలో పదుల సంఖ్యలో ఉన్నారు. నూతనకల్ మండలంలో 74, మోత్కూరు 20, తిరుమలగిరి 41, తుంగతుర్తి 42, జాజిరెడ్డిగూడెం 16 మంది ఉన్నారు. వీరిలో చాలావరకు నిరుపేదలే. కొందరు మహిళలే కుటుంబ భారాన్ని మోస్తున్నారు. వైకల్యంతోపాటు అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి అవసరమైన మందుల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కరూ ఒక్కో సమస్యతో అవస్థలు పడుతూ ప్రతి కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజావాణిలో అర్జీలు పెట్టుకుంటూ ప్రభుత్వ చేయూత కోసం ఎదురుచూస్తున్నారు.

**పలుమార్లు దరఖాస్తు చేశా**

మద్దెల ఏసు, తుంగతుర్తి

కొన్నేళ్ల వరకు కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకున్నా. రెండేళ్ల కిందట కాలికి గాయమవగా వైద్యులు కాలు సగానికి తొలగించారు. సదరం ధ్రువీకరణ పత్రం రావడంతో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికీ నాలుగుసార్లు సంబంధిత కార్యాలయానికి వెళ్లాను. నేటికీ మంజూరు కాలేదు.

**రెండేళ్లుగా నిలిపివేశారు**


ఎర్ర కృష్ణ, తుంగతుర్తి

రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరగటంతో వైద్యులు ఆపరేషన్ చేసి రాడ్స్ వేశారు. దాంతో కనీసం నడవలేని పరిస్థితి. మొదట సదరం ధ్రువీకరణ పత్రంలో 45శాతం వైకల్యం నమోదు చేయగా రెండేళ్లపాటు పింఛను ఇచ్చారు. ధ్రువీకరణ పత్రం గడువు ముగియడంతో పింఛన్ నిలిపివేశారు. రెన్యువల్‌కు వెళ్తే అందుకుతగ్గ వైకల్య శాతం ఇవ్వలేదు. తన ఆరోగ్య, కుటుంబ స్థితిగతుల్ని చూసి ఆసరా అందించాలంటూ కృష్ణ కన్నీరు పెట్టుకున్నారు.

**కార్యాలయం చుట్టు తిరుగుతున్నా**

బత్తుల లావణ్య, నూతనకల్‌వైకల్యంతో బాధపడుతున్న నాకు సదరం సర్టిఫికెట్ వచ్చింది. రెండేళ్ల కిందట పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. వారానికి ఒకసారి కార్యాలయం చుట్టు తిరుగుతున్నా మంజూరు కావడం లేదు. చేయూత ఇచ్చి ఆదుకోవాలి.

# పల్లెలకు కొత్త వెలుగులు



ఆలేరు : వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో విద్యుత్తు వినియోగం బాగా పెరిగిందనే చెప్పవచ్చు. వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగం పైన ఉంది. ఉపకేంద్రాలు, నియంత్రికలు అందుకనుగుణంగా పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విషయమై నాణ్యమైన విద్యుత్తు పంపిణీకి టీఎస్ఎస్‌పీడీసీఎల్ జిల్లాకు నూతనంగా 33/11 కేవీ సామర్థ్యం కలిగిన 16 విద్యుత్తు ఉపకేంద్రాలను మంజూరు చేసింది. సాధ్యమైనంత తొందరలో వీటి నిర్మాణాలు చేపట్టి వినియోగంలోకి తెచ్చేలా అధికార యంత్రం సమాయత్తమవుతోంది. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**స్థల సేకరణలో యంత్రాంగం..**

జిల్లాకు మంజూరైన విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలకు కనీసం ఎకరం స్థలం అవసరం ఉంటుంది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు స్థలాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.3 కోట్లు కేటాయించింది. లో ఓల్టేజీ సమస్య, తరచూ ట్రిప్ అవడం లాంటివి జరుగుతున్నందున వీటి నిర్మాణాలతో ఇక నుంచి సమస్యలకు చెక్ పడనుంది. ప్రధానంగా విద్యుత్తు పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నాగినేనిపల్లి (బొమ్మలరామారం), వంకమామిడి (సంస్థాన్ నారాయణపురం), దూదివెంకటాపురం (రాజపేట) ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణానికి దృష్టి సారించనున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

కొరటికల్(ఆత్మకూర్(ఎం), దూదివెంకటాపురం(రాజపేట), గంధమల్ల (తుర్కపల్లి), మాసాయిపేట (యాదగిరిగుట్ట), సీతారామపురం(గుండాల ), మాటూరు (మోటకొండూరు), నాగినేనిపల్లి (బొమ్మలరామారం), నర్సాపురం (వలిగొండ), దోతిగూడెం (భూదాన్‌పోచంపల్లి), వంకమామిడి, చిమిర్యాల, లక్ష్మమ్మగూడెం (సంస్థాన్ నారాయణపురం), శేరిల్లా, ఎనకటితండా (చౌటుప్పల్), మునివంపుల (రామన్నపేట), కోటమర్తి (అడ్డగూడూరు). **ఈ సారైనా నిర్మాణం జరిగేనా..**

రాజపేట మండలం దూదివెంకటాపురం శివారులో గత ప్రభుత్వ హయాంలోనే ఉపకేంద్రం మంజూరైంది. రెవెన్యూ అధికారులు సూచించిన స్థలం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉందనే గ్రామస్థుల విన్నపం మేరకు అప్పట్లో నిర్మాణానికి వెనక్కితగ్గారు. అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపన సైతం చేసినప్పటికీ సాంకేతిక పరమైన అడ్డంకుల కారణంగా పనులు ప్రారంభించలేదు. నిర్మాణం చేపడితే రాజనగర్, సోమారం, నెమిల, నగరం, ధర్మారెడ్డిగూడెం, దూదివెంకటాపురం గ్రామాలకు విద్యుత్తు పరంగా ప్రయోజనం చేకూరనుంది. ఈసారి ఎలాగైనా నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# సిద్ధించని స్వచ్ఛ లక్ష్యం

సంగారెడ్డి : స్వచ్ఛ సర్వేక్షణ్(2024-25) ర్యాంకుల్లో జిల్లాలోని పురపాలికలు వెనుకబడ్డాయి. రెండు చోట్ల మినహా ఆరు పాత బల్దియాలు ఆశించిన ర్యాంకులు సాధించలేదు. ఇంటింటి చెత్త సేకరణ సరిగా చేయకపోవడం.. డంపింగ్ యార్డుల నిర్వహణ వైఫల్యం, పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రెండు చోట్లే మెరుగు** జిల్లాలో పాత మున్సిపాలిటీలు ఎనిమిది ఉన్నాయి. వాటిలో హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న తెల్లాపూర్(18), అమీన్‌పూర్(31)కు మాత్రమే ఓడీఎఫ్ డబ్ల్యుప్లస్ ర్యాంకులు దక్కాయి. రాష్ట్రంలో 143 పురపాలక సంఘాలు ఉన్నాయి.

**వైఫల్యానికి ప్రధాన కారణాలివి**

జిల్లాలోని అన్ని పట్టణాల్లోనూ ఇంటింటి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. 60 శాతం మాత్రమే సేకరిస్తున్నారు.



తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు.

సదాశివపేట, జహీరాబాద్‌లో డంపింగ్ యార్డులున్నా.. నిర్వహణ కొరవడింది. సంగారెడ్డిలో 30 శాతం చెత్తను మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్నారు. నారాయణఖేడ్‌లో 50 శాతానికి మించడం లేదు. అందోలు-జోగిపేట, బొల్లారంలో డంపింగ్ యార్డులు లేవు.

నిషేధిత పాలిథీన్ కవర్లు విచ్చలవిడిగా వాడుతున్నా.. కట్టడి చర్యలు కరవయ్యాయి.మున్సిపాలిటీలకు మంచి ర్యాంకు రావడానికి ప్రజాభిప్రాయ సేకరణ కీలకం. జిల్లాలోని అన్ని పురపాలికలు ప్రజాభిప్రాయ సేకరణలో పూర్తిగా వెనుకబడ్డాయి. వీటిపై ప్రచారం చేయకపోవడమే ప్రధాన కారణం.

# నత్తనడకన ప్రయాణ ప్రాంగణాలు

గజ్వేల్: గజ్వేల్‌తోపాటు ప్రజ్ఞాపూర్‌లో చేపట్టిన మూడు బస్టాండ్ల నిర్మాణం నత్తనడకన కొనసాగుతున్నాయి. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది గడువు ఉండగా ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. నిధుల విడుదల, పర్యవేక్షణ లేక పనుల్లో జాప్యం అవుతోంది. మొన్నటివరకు ఎండలు, ప్రస్తుతం వానలతో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలో రూ.2.56 కోట్ల వ్యయం, ప్రజ్ఞాపూర్‌లో నిర్మించే చిన్న బస్టాండుకు రూ.3.81 కోట్లు గతంలో మంజురయ్యాయి. ప్లాట్‌ఫారాలు నిర్మించాల్సి ఉంది. ప్రజ్ఞాపూర్‌లో దాదాపు సగానికిపైగా పనులు పెండింగులో ఉన్నాయి. విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు రోజూ ఈ పట్టణానికి సుమారు 25 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు తలదాచుకునేందుకు



ఎలాంటి సౌకర్యం లేకపోవటంతో అవస్థలు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన పురోగతి లేదు.

దూరంగా ఉండటంతో ఆదరణ తక్కువ

గజ్వేల్-తూప్రాన్ ప్రధాన రోడ్డులో బాహ్యవలయ రహదారి జంక్షన్ సమీపంలో గత ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో ప్రధాన బస్టాండును నిర్మించింది. సీసీరోడ్లు, ఇతర సౌకార్యలు కల్పించకపోవటంతో అక్కడికి బస్సులు రావటం లేదు. పలితంగా ఇప్పుడు నిరుపయోగంగా ఉంది. సంగారెడ్డికి వెళ్లేవి, అక్కడి నుంచి వచ్చే బస్సులు తప్ప ఇక్కడికి వేరే బస్సులు వచ్చే అవకాశం లేదు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పనికిరాకుండా పోయింది. పాతికేళ్ల కిందట అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజ్ఞాపూర్ శివారులో బస్టాండు నిర్మించింది. ఊరికి దూరంగా ఉందని ప్రయాణికులు ఆదరించలేదు. దానిని డీఎం కార్యాలయంగా మార్చారు. గజ్వేల్‌లోనూ ఇదేతీరు నిర్మించారు.

# మన్యం వాసులకు మంచి రోజులు

కొత్తగూడెం : ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్యం వాసులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటివరకు యూజీ వైద్యవిద్య ఉన్నచోటే పీజీ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్యకళాశా లల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ కళాశాలలు నెలకొల్పాలని నిర్ణయించగా.. అందులో భద్రాచలం పట్టణానికి చోటు కల్పించింది.

**బోధనాసుపత్రిగా ఏరియా వైద్యశాల**

పీజీ కళాశాల ఏర్పాటుతో భద్రాచలంలో 200 పడకలు కలిగిన ఏరియా వైద్యశాల పీజీ కోర్సుల కోసం బోధనాసుపత్రిగా మారనుంది. స్థానికంగా అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులకు ఉన్నతస్థాయి వైద్యచికిత్స సులువుగా అందుతుంది. ప్రత్యేక వైద్యసదుపాయాలు(కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్ వంటివి) భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో లభ్యమవుతాయి. రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. ముఖ్యంగా పీజీ సీట్ల సంఖ్య పెరగటంతో జిల్లా యువతకు వైద్యవిద్యలో అవకాశాలు మెరుగుపడతాయి.

**జిల్లాకు మరో మణిహారమే..**మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్యులెవరూ ఆసక్తి చూపించని ప్రస్తుత పరిస్థితుల్లో పీజీ వైద్యకళాశాల ఏర్పాటు.. వైద్యరంగం పరంగా జిల్లాకు మణిహారంగా మారనుంది. పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో స్పెషలిస్టు డాక్టర్ల(ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్)ను తయారుచేస్తాయి. వీరు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అవకాశముంటుంది. కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. పీజీ కళాశాలలు వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తాయి. దీనివల్ల కొత్త చికిత్స పద్ధతులు, ఔషధాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించే డెంగీ, మలేరియా, టీబీ రోగాల నివారణకు ఇవి సహాయపడతాయి. **భద్రాచలం అభివృద్ధికి బాటలు..**కళాశాల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్తు, అంతర్జాల సేవల వంటి మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు (వసతిగృహాలు, దుకాణాలు) పెరుగుతాయి. ఇవి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. గిరిజన సమాజం ఆధునిక వైద్యవిద్య, సేవల్లో ఏకీకృతమవుతుంది. గిరిజన సంస్కృతికి గౌరవం లభిస్తుంది. పేద గిరిజనులకు ఆధునిక వైద్యం ఉచితంగా అందుతుంది.భద్రాచలంలో పీజీ వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. వైద్యకళాశా ల ఏర్పాటైతే వైద్యపరంగా జిల్లావాసులకు మంచిరోజులు వచ్చినట్లే. వివిధ విభాగాల్లో విద్యనభ్యసిం చేవారు ఉండటం ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

# అటవీ మార్గాలు.. అర్ధంతర పనులు

సారంగాపూర్: గ్రామాలను అనుసంధానించే మార్గాల్లో రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో ఏళ్ల తరబడి పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సారంగాపూర్, రాయికల్ మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉండగా అడవుల మధ్యలో నుంచే పలు రహదారులున్నాయి. మధ్యలో ఉన్న గ్రామాలను కలుపుతూ గతంలో ప్రభుత్వం రహదారి నిర్మాణాలు చేపట్టగా అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కొంతకాలంగా ఆర్అండ్‌బీ అధికారులు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపినా సమస్య పరిష్కారం కావడం లేదు. సారంగాపూర్ మండలం రేచపల్లి, మ్యాడారంతండా మీదుగా రాయికల్



మండలం కైరిగూడెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశారు. మ్యాడారం తండా వరకు తారు నిర్మాణం పూర్తి చేయగా అటవీ శాఖ అభ్యంతరంతో మిగతా పనులు నిలిచిపోయాయి. రేచపల్లి నుంచి రంగపేట మీదుగా జగిత్యాలకు వెళ్లే మార్గంలో కేవలం 200 మీటర్ల దూరానికి అటవీ అనుమతులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. గతంలో కంకర వేసినా తారు నిర్మాణానికి అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఉండిపోయాయి. మ్యాడారం తండా రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతూ సొంతంగా మొరం పోసి తాత్కాలిక దారి వేసుకున్నారు. ఆరు నెలల కిందట అటవీ శాఖ ఉన్నతాధికారులు రహదారులను పరిశీలించినా ఇప్పటివరకు అనుమతులు ఇవ్వలేదు. ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

# సరిహద్దున పటిష్ఠ నిఘా

ధర్మపురి : జిల్లా సరిహద్దున ఉన్న రాయపట్నం వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటుతో రహదారి ప్రమాదాలు, ఘర్షణలు, ఆత్మహత్యల కేసులు గణనీయంగా తగ్గాయి. ఇక్కడ గతంలో వంతెనలపై నుంచి దూకి ఆత్మహత్యలకు పాల్పడేవారు. దీన్ని నివారించడానికి 2023లో ఈ సరిహద్దు చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడ నిఘాను మరింత పెంచారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మరింత నిఘాను పెంచడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కరీంనగర్, మంచిర్యాల, జగిత్యాల జిల్లా సరిహద్దు ప్రాంతమైన రాయపట్నం వద్ద మూడేళ్లుగా తనిఖీ కేంద్రం కొనసాగుతోంది. ఇక్కడ సీసీ కెమెరాలు, దీనికి అనుగుణంగా ప్రత్యేక గది, కంప్యూటర్, ఇతర పరికరాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు



ఇద్దరు కానిస్టేబుళ్ల అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. డ్రంక్అండ్‌డ్రైవ్ కేసులతోపాటు గంజాయి తరలింపును అడ్డుకుంటున్నారు. ఇక్కడ గత ఆరు నెలల్లో ఆత్మహత్యాయత్నం చేసిన అయిదుగురు వ్యక్తుల ప్రాణాలను కాపాడారు.

**కేసుల తీరిలా..** రాయపట్నం తనిఖీ కేంద్రం ఏర్పాటైన తర్వాత నుంచి ఇప్పటి వరకు 4 ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. ఆత్మహత్యాయత్నం చేసిన 12 మందిని పోలీసులు రక్షించారు. గతంలో వారానికి మూడు ఆత్మహత్యాయత్నం కేసులు నమోదయ్యేవి. వారానికి రెండు ప్రమాదాలు జరిగేవి. తనిఖీ కేంద్రం ఏర్పాటుతో రెండేళ్లలో కేవలం 3 రోడ్డు ప్రమాదాలు మాత్రమే జరిగాయి. రాయపట్నం, మద్దునూర్ తీర ప్రదేశాల్లో విపరీతంగా జూదం నడిచేది. వీటిపై దాడులు చేయడంతో 3 జూదం, 2 గంజాయి కేసులు నమోదయ్యాయి.

# రామభక్తులు.. రైలు కూత వినేదెప్పుడు..?

భద్రాచలం : ఒడిశాలోని మల్కనగిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతా లను కలుపుతూ భద్రాచలం మీదుగా బూర్గంపాడు మండలం పాండురం గాపురం వరకు రైలుమార్గాన్ని ఐదేళ్లలో నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. 173.61 కి.మీ. పొడవైన మార్గం కోసం రూ.3,591.76 కోట్లు మంజూరు చేసినట్లు గతేడాది ఆగస్టులో ప్రకటించింది. కొత్త రైల్వేలైన్‌లో భాగంగా సిగ్నల్ టెలికమ్యూనికేషన్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాలకు నిధులు కేటాయించింది. భూసేకరణకు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా భద్రాద్రి జిల్లాలో జాప్యం జరుగుతోంది. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులకు రైలుబండి ప్రయాణం వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పాలకులు చొరవ చూపాలి

**భద్రాచలానికి తొలి ప్రాధాన్యం**

కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్లే మార్గంలో బూర్గంపాడు మండలం పాండురంగాపురం రైల్వేస్టేషన్ ఉంది. ఇక్కడి నుంచి సారపాక వరకు లైన్ పొడిగించాలని రెండు దశాబ్దాలుగా కోరుతున్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మల్కనగిరి లైన్ పుణ్యమా అని భద్రాచలం మీదుగా పాండురంగాపురానికి కలవనుంది. మల్కనగిరి లైన్ పనులు ఒడిశా నుంచి భద్రాచలం వరకు రావాలంటే చాలాకాలం పడుతుంది. దీన్ని గుర్తించి దాదాపు 20 కి.మీ. పొడవైన భద్రాచలం-పాండురంగాపురం లైన్‌కు మొదటి ప్రాధాన్యమిస్తే దేశంలోని మిగతా ప్రాంతాలకు భద్రాచలం నుంచి రాకపోకలు విస్తరించే ఆస్కారముంటుంది.

**2 కి.మీ. పొడవైన రైల్వే వంతెన**

మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు గోదావరి, శబరి వంటి నదులపై 300కి పైగా వంతెనలు నిర్మించనున్నారు. ఇందులో భద్రాచలం పట్టణ శివారులో ఎటపాక సమీపం నుంచి గోదావరిపై రైలు రాకపోకలకు 2 కి.మీ. పొడవైన వంతెన నిర్మించే అవకాశముంది. మొత్తమ్మీద రైలుమార్గం కోసం 846.68 ఎకరాల భూమి సేకరించనున్నారు. ఇందులో భద్రాద్రి జిల్లాలో 450 ఎకరాలు సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ ఈ సంఖ్య పెరుగుతుందని సమాచారం. 'మల్కనగిరి రైల్వేలైన్‌ను పాండురంగాపురం వరకు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ నిమిత్తం ప్రాథమిక సర్వేలు చేశాం. రైల్వేశాఖ ద్వారా అధికారిక ఉత్తర్వులు అందితే భూమి సేకరిస్తాం' అని భూసేకరణ అదనపు కలెక్టర్ కార్తీక్ కు తెలిపారు.

# 'పట్టా'భిషేకానికి వేళాయె




సంగారెడ్డి : ఐఐటీ ప్రాంగణం పరిశోధనలకు నిలయం. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ప్రాంగణ నియామకాల్లోనే అవకాశాలు దక్కించుకుంటున్నారు. ఉన్నత చదువుకు విదేశాలకు సైతం వెళ్తున్నారు. తమదైన ప్రతిభతో అన్నింటా ముందుంటున్నారు. విద్యతో పాటు సామాజిక, పర్యావరణ పరిరక్షణలోనూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తుండటం విశేషం. కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి పట్టాలు ప్రదానానికి ప్రతి ఏటా స్నాతకోత్సవం నిర్వహిస్తుంటారు. ఈనెల 19న సదరు వేడుక జరుగనుంది. ఈ సారి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరుకానుండటం విశేషం. ఐఐటీహెచ్‌లో ఇది 14వ స్నాతకోత్సవం. గత వేడుకల్లో 1,103 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ఈసారి ఆ సంఖ్య 1200 దాటనుంది. నాలుగేళ్ల బీటెక్‌తో పాటు పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు సైతం పట్టాలతో మురిసిపోనున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో తొలిసారిగా పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులూ పట్టాలు అందుకోనున్నారు. వేడుక చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులతో విద్యార్థులు తమ ఆనందాన్ని పంచుకోనున్నారు.

**సంప్రదాయబద్ధంగా..**

స్నాతకోత్సవం రోజు ఐఐటీయన్లు సంప్రదాయబద్ధంగా కనిపిస్తుంటారు. అందరూ చేనేత దుస్తులే ధరిస్తారు. ఏకరూప దుస్తులతో సందడి చేస్తారు. స్నాతకోత్సవానికి నెల రోజుల ముందు నుంచే విద్యార్థులు చేనేత దుస్తులు తెప్పించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రత్యేకంగా ఓ బృందాన్ని సైతం నియమించారు. చేనేత దుస్తులకు ఆదరణ పెంచాలన్న లక్ష్యంతో ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

**విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ**

కంది ఐఐటీలో అధ్యాపకులతో పాటు విద్యార్థులకు ప్రాంగణంలోనే వసతి కల్పిస్తారు. అధ్యాపకులు వారి కుటుంబంతో ఉండేలా అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు ఒక్కో అధ్యాపకుడికి కొంత మంది బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్ మార్గనిర్దేశనంతోపాటు వ్యక్తిగతంగా ఎదురయ్యే సమస్యలపై చర్చించేలా అధ్యాపకులతో బంధం ఏర్పడేలా చొరవ చూపుతారు.

# అక్షర సేవలో ఆరు దశాబ్దాలు




జగిత్యాల : ఎంతో మందికి ఉన్నత విద్యనందించిన సరస్వతీ నిలయం.. మరెందరో ప్రముఖులు పట్టా అందుకున్న చదువుల కోవెల.. ఆరు దశాబ్దాలుగా వందలాది మందిని తీర్చిదిద్దిన జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల 60వ వార్షికోత్సవానికి ముస్తాబవుతోంది.. జగిత్యాల, పరిసర ప్రాంత విద్యార్థుల కోసం 1965లో ప్రభుత్వం పట్టణంలోని మినీస్టేడియం సమీపంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసింది. 1978లో పట్టణానికి చెందిన కాసుగంటి నారాయణరావు ధర్మపురి రోడ్డులోని 32.07 ఎకరాల సొంత వ్యవసాయ భూమిని కళాశాలకు ఉదారంగా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఆ స్థలంలో నిర్మించిన నూతన భవనంలోకి 1987లో కళాశాలను మార్చారు. 6 ఎకరాల్లో భవనాలు నిర్మించగా ఒక ఎకరా భూమిని విద్యుత్తు ఉపకేంద్రానికి కేటాయించారు.

**సామాజిక సేవ.. నైపుణ్యాభివృద్ధి**

అనంతరం కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలతో, డిగ్రీ, పీజీ స్థాయిలో బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ(టాస్క్) కూడా అందుబాటులో ఉంది. జిల్లాకు సంబంధించి ఎప్‌సెట్, పాలిసెట్, ఈసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కేంద్రాలను కళాశాలలోనే నిర్వహిస్తున్నారు. **పేరు కోసం రూ.లక్ష డిపాజిట్** కళాశాలకు స్థలం వితరణ చేసిన దాత(శ్రీ కాసుగంటి నారాయణరావు-ఎస్‌కేఎన్ఆర్) పేరును రిజిస్ట్రేషన్ చేయడానికి 1978లో ప్రభుత్వానికి రూ.లక్ష డిపాజిట్ చేశారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం దాత పేరిట విద్యా సంస్థ నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఇంత పెద్దమొత్తంలో రుసుం చెల్లించి కళాశాల పేరును రిజిస్ట్రేషన్ చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

**నవంబరులో వేడుకలు**

వేడుకల నిర్వహణకు కళాశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్వ ప్రిన్సిపాళ్లను లేదా వారి కుటుంబసభ్యులను ఆహ్వానించనున్నారు. కళాశాల స్థాపించి జులైతోనే 60 ఏళ్లు పూర్తయినా వచ్చే నవంబరులో వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పూర్వ విద్యార్థులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వేడుకల నిర్వహణకు ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ చెరో రూ.లక్ష నిధులను పూర్వ విద్యార్థుల నిధికి అందజేశారు.

**పట్టా పొందిన ప్రముఖులు**

కళాశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్, పూర్వ వైస్ ఛాన్సలర్ వీరారెడ్డి, తెలుగు అకాడమీ పూర్వ ఛైర్మన్ కడార్ల భూమయ్య, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, డీఎఫ్‌వో రవిప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ తదితర ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాల నుంచి పట్టభద్రులైన వారే.

**వారం రోజుల పాటు నిర్వహణ**

రాష్ట్రంలో ఇంత విశాలమైన స్థలం, భవనాలున్న కళాశాల మరెక్కడా లేదు. న్యాక్‌లో కళాశాలకు మూడు సార్లు గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి హరిత అవార్డు వచ్చింది. ఉన్నత ప్రమాణాలు కలిగిన కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాపై ప్రతిపాదనలు పంపాం. 60 ఏళ్ల వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నాం. పూర్వ విద్యార్థుల సహకారంతో వారం రోజుల పాటు వేడుకలు వినూత్నంగా నిర్వహిస్తాం. అరిగెల అశోక్, కళాశాల ప్రిన్సిపల్

# అరకొర వసతులు.. అందని వైద్యం


జమ్మికుంట : జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల పరికరాలు లేక, ఉన్నవి నిరుపయోగంగా ఉండటంతో రోగులకు పూర్తిస్థాయి సేవలు అందటం లేదు. 30 పడకల ఆస్పత్రిలో అధికశాతం అవుట్ పేషెంట్లకు వైద్యం అందుతోంది. ముగ్గురు రెగ్యులర్.. ఏడుగురు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఆయుర్వేదిక్ వైద్యుడు సైతం ఇదే ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. జనరల్ వైద్య సేవలు, ప్రసవాలు, అత్యవసర విభాగాల్లో ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు.

**పరికరాల పరిస్థితి**

దంత వైద్య నిపుణుడున్నా పరీక్షలు చేసేందుకు వినియోగించే ఛైర్, పరికరాలను అమర్చకపోవటంతో సంబంధిత కంపెనీ వారికి తెలిపినా ఫలితం లేదు. దంత పరీక్షలు చేసి.. పాడైన దంతాలు తీయటం, వాటికి చికిత్స చేస్తున్నట్లు డా.శ్రీనివాస్‌రాజు తెలిపారు. పళ్లు పెట్టించుకోవడానికి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆర్థోపెడిక్ వైద్యుడు అందుబాటులో ఉన్నా ఎక్స్‌రే, సీఆర్మ్ యంత్రాలు లేకపోవటంతో ఎముకలు విరిగిన రోగులు స్థానిక ప్రైవేటు, కరీంనగర్, వరంగల్‌లలోని ఆసుపత్రులకు వెళ్తున్నారు.

**గైనిక్, జనరల్ సేవలకే పరిమితం**

రెండేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్తులో ఆస్పత్రిని చేర్చారు. కానీ జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, చర్మ, పిల్లలకు సంబంధిత నిపుణులు లేరు. నిత్యం 150-200 అవుట్ పేషెంట్లు, జనరల్, గైనిక్ సేవలకే ఆసుపత్రి పరిమితమైంది. ఈసీజీ కాలం చెల్లడంతో పరీక్షలు ప్రైవేటుగా చేయించుకుంటున్నామని పలువురు వాపోతున్నారు.



**కిందనే పోస్టుమార్టం**

శిథిలమైన గదిలో కింద లేదా స్ట్రెచర్‌పై మృతదేహాలకు పోస్టుమార్టం చేస్తున్నారు. రెండు ఫ్రీజర్లు పనిచేయక పోవటంతో మృతదేహాలను భద్రపరిచేందుకు బాధిత కుటుంబీకులు అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ శవపరీక్ష గదిలో అవసరమైన నిర్మాణాలు చేసి.. పరికరాలు శుభ్రం చేయాలని పుర కమిషనర్‌ను ఆదేశించారు.

**ప్రభుత్వానికి నివేదించాం**

ఆస్పత్రిలో సమస్యలు, అసవరమైన పరికరాలు తదితర అంశాలపై ఉన్నతాధికారులకు నివేదించా. త్వరలోనే నిపుణులను ప్రభుత్వం కేటాయించే అవకాశం ఉంది. శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, జమ్మికుంట.

# 'దూది'పింజల్లా హామీలు..!

జూలూరుపాడు : జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటుపై ప్రజాప్రతినిధుల హామీలు దూదిపింజల్లా తేలిపోతున్నాయి. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో ఏటా రూ.కోట్లలో పత్తి వ్యాపారం జరుగుతుంది. ఇదే రీతిలో మార్కెట్‌కు ఆదాయం సమకూరుతోంది. ఇంతకాలం ప్రైవేటు స్థలంలో కొనసాగిన యార్డు లీజు గడువు ముగియటంతో ఈఏడాది పత్తి కొనుగోళ్లు జరుగుతాయా లేదా అనే సందిగ్ధం నెలకొంది. జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటు ఆవశ్యకతపై కథనం.

**రూ.కోట్లలో వ్యాపారం**

తెలంగాణలో అత్యధిక పత్తి వ్యాపారం జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో జరుగుతుంటుంది. ఏటా దీనిద్వారా ఏన్కూరు మార్కెట్ కమిటీకి సుమారు రూ.2కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ యార్డులో ప్రతి సంవత్సరం 3లక్షల క్వింటాళ్లకు పైగా తెల్లబంగారాన్ని కొంటుంటారు. భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ జిల్లాలతో పాటు ఏపీలోని తిరువూరు, మైలవరం, నందిగామ ప్రాంతాల నుంచి రైతులు పత్తి తీసుకొస్తుంటారు. స్థానిక వ్యాపారులే కాకుండా, ఇతర రాష్ట్రాలకు చెందిన బయ్యర్లు కొంటారు. నుంచి సరకును మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు తరలిస్తుంటారు. ఇక్కడి పత్తి గుంటూరు, ఆదిలాబాద్ జిల్లాల్లోని జిన్నింగ్ మిల్లులకు వెళ్తుంది.

**పదెకరాల స్థలం కేటాయింపు**

ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని జూలూరుపాడు ఉ



ప మార్కెట్ స్థానంలో శాశ్వత మార్కెట్ నిర్మించాలనే ఆలోచనతో పదెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. మార్కెటింగ్‌శాఖ రూ.6కోట్లతో ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరుకాలేదు. ఇక్కడ మార్కెట్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళనలు నిర్వహించారు.

**ప్రత్యామ్నాయం దొరికేనా..?**

ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు మరికొంత సమయం పట్టవచ్చు. తాత్కాలిక స్థలం అందుబాటులో లేదు. దీనికి ప్రత్యామ్నాయాన్ని మార్కెటింగ్‌శాఖ అన్వేషించాల్సి ఉంది. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. అక్టోబరు నాటికి మార్కెట్‌కు తెల్లబంగారం రానున్న దృష్ట్యా ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆ లోపు చదును చేస్తే వినియోగించుకునే ఆస్కారం ఉంటుంది. 'జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటుకు రూ.6కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ఆమోదించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. లీజు గడువు ముగియటంతో ప్రైవేటు స్థలం ఈఏడాది అందుబాటులో లేదు. ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషిస్తున్నాం' అని ఏన్కూరు ఏఎంసీ కార్యదర్శి బి.బజారు తెలిపారు.

# బూచోళ్లకు 'గంట'కడదాం


ఖమ్మం: సంక్షిప్త సందేశాలు, వెబ్‌లింక్‌లు, డిజిటల్ అరెస్టు పేరిట బుల్లిపెట్టె లాంటి చరవాణి ఆధారంగా అమాయకులను బూచోళ్లు బురిడీ కొడుతున్నారు. ఆశల వల విసిరి కష్టార్జితాన్ని దోచేస్తున్నారు. రైతులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు.. ఇలా అందరూ కేటుగాళ్ల మాయలో పడిపోతున్నారు. ఇప్పటికే పలువురు నేరగాళ్లు జిల్లా ప్రజల బ్యాంకు ఖాతాలకు కన్నం వేసి రూ.కోట్లు కాజేశారు. సైబర్ నేరాలపై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. అప్రమత్తంగా లేనివారు నష్టపోతూనే ఉన్నారు. అవగాహన ఉన్నవారు వెంటనే తేరుకొని పోలీసులకు ఫోన్‌చేసి డబ్బులు పోకుండా జాగ్రత్త పడుతున్నారు.

**ఆరు నెలల్లో రూ.5.27కోట్లు హాంఫట్**

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రూ.5.27 కోట్లు ఊడ్చేశారు. 107 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఆరు కేసుల్లో 12 మంది నిందితులను పోలీసులు పట్టుకోగలిగారు. కొందరు బాధితులు సత్వరం నంబర్ 1930కి ఫోన్ చేసి డబ్బులు బదిలీ కాకుండా ఆపేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు.. ఇలా ఫోన్ చేసిన వారి బ్యాంకు ఖాతా నుంచి రూ.45.95 లక్షలు నిందితులకు బదిలీ కాకుండా పోలీసులు స్తంభింపజేయటం విశేషం.

**మే 23**

మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉద్యోగికి ముంబయి పోలీసుల పేరిట ఫోన్ వచ్చింది. డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించి అతడి నుంచి దఫదఫాలుగా



రూ.1.12కోట్లు దోచుకున్నారు. నిందితుడిని కర్ణాటకలోని హుబ్లీలో పోలీసులు అరెస్టు చేశారు.

**మే 26**

బోనకల్లు మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు కొందరు ఫోన్‌చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలొస్తాయని ఆశచూపారు. వాట్సప్‌కు ట్రేడింగ్ లింకులు పంపగా.. ఇంజినీర్ రూ.1.62 కోట్ల పెట్టుబడి పెట్టారు. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించి ఫిర్యాదు చేయటంతో ఐదుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు.

వివిధ శాఖల పేరిట అపరిచితులు ఫోన్ చేసి అధికారులమని చెప్పినప్పుడు, పెట్టుబడుల లింక్‌లు పంపినప్పుడు నమ్మవద్దు. ప్రభుత్వ పథకం పేరుతో వచ్చే ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేయొద్దు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే గంట(గోల్డెన్ అవర్)లోపు నంబర్ 1930, సైబర్ క్రైం పోలీసులు, పోర్టల్ ద్వారా సమాచారమందించాలి. సైబర్ క్రైం సందేశాలు వచ్చే నంబరుపై సంచార్ సాథి యాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. సునీల్‌దత్, సీపీ

# ఆమెకు రక్తం కావాలి..!

నల్గొండ : సాధారణంగా మహిళల్లో 14 శాతానికి మించి హిమోగ్లోబిన్ ఉంటే ఆరోగ్యకరంగా ఉన్నట్లని డబ్ల్యూహెచ్‌వో లెక్కలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో ఉన్న 8.25 లక్షల మంది మహిళల్లో 50 నుంచి 60 శాతం మంది మహిళలు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) 14 శాతం కంటే తక్కువతో బాధపడతున్నారు. ప్రసవంతో పాటు ఇతర శస్త్రచికిత్సల కోసం కేవలం జనరల్ ఆసుపత్రి మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనే రోజుకు 25 నుంచి 30 మంది చేరుతున్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో పాటు నెలసరి రుతుక్రమం మూలంగా ఎక్కువ శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

జిల్లా కేంద్రం పరిధిలోని గిరకబాయిగూడెం ప్రాంతానికి చెందిన సౌమ్య(28) ఇంట్లో రోజూవారీ పనులు చేస్తూ వారం క్రితం కింద పడిపోయింది. కారణం తెలియని భర్త వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెలో కేవలం 4 శాతం మాత్రమే రక్తం ఉందని, తక్షణం రక్తం ఎక్కించాలని సూచించారు.

జిల్లా కేంద్రానికి ప్రసవం కోసం వస్తున్న మహిళల్లో 60 శాతం మందికి రక్తం తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. శస్త్రచికిత్స సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని.. అందుకే ముందుగా రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వారికి సూచిస్తున్నారు. కారణం ఏదైనా ఇలా నిత్యం రక్తం కోసం వెతుకులాడే వారిలో ఎక్కువ శాతం మంది మహిళలే ఉంటున్నారు.

జంక్‌ఫుడ్ వదిలేయాలి: డా.స్వరూపారాణి, గైనిక్ హెచ్‌వోడి, ఎంసీహెచ్ నల్గొండ

జనరల్ ఆసుపత్రికి శస్త్రచికిత్సల కోసం వచ్చే మహిళల్లో 50 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. పురుషులతో పోల్చితే స్త్రీలకు నెలసరి, ప్రసవం కారణంగా రక్తం తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఎక్కువ మంది జంక్‌ఫుడ్ తీసుకోవడం, కారం ఎక్కువగా తినడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఐరన్ మాత్రలతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. గుడ్లు, రోజుకు తగినంత నీరు, బెల్లం ఎక్కువగా ఉండే పదార్థాలు, రాగులు, ములక్కాయలు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసాహారం తీసుకోవడంతో రక్తం ఎక్కువగా వస్తుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడేవారికి పూర్తి స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నాం.

# నెమ్మదిగా.. సాగుతున్న దిద్దుబాట..!

చౌటుప్పల్ : హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో(బ్లాక్ స్పాట్స్) పనులు సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నారు. 16 బ్లాక్ స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. మరో బ్లాక్ స్పాట్ ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద ఉంది. ఇప్పటికి సగం ప్రాంతాల్లో పనుల్లో వేగం పుంజుకోలేదు. ఈ పనులను హరియాణాకు చెందిన సంస్థ చేపడుతుంది. చౌటుప్పల్‌లో పరిస్థితి మరి దారుణంగా ఉంది. డ్రైనేజి, సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తంగడపల్లి రోడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవా నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు కంకర ఎగిరి ప్రజలకు తగులుతుంది. టైర్లు కూడా పంక్చర్ అవుతున్నాయని చోదకులు తెలుపుతున్నారు.

**చౌటుప్పల్ నుంచి కోదాడ సరిహద్దు వరకు..**

చౌటుప్పల్ బస్టాండు నుంచి చిన్నకొండూరు రోడ్డు వరకు 150 మీటర్లు ఫ్లైఓవర్ వస్తుంది. మిగతాది మట్టి కట్ట(వెహికల్ అండర్ పాస్)ను నిర్మిస్తారు. పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల– జనగాం కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెర్వు పైవంతెన శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆరంభంలోనే ఆదేశించింది. మరో నెల రోజులు గడిస్తే వర్షాలు కురిసే అవకాశముంది. పనులకు ఆటంకం కలగనుంది. వేసవిలో కూడా పనులు వేగంగా చేయకపోతే మరో ఏడాదికి పైగా సమయం పట్టనుంది. చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనుల ప్రారంభానికి ఇంకా రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశముంది. అడ్డుగా అక్రమ నిర్మాణాలు.. దూడల భిక్షంగౌడ్, భాజపా మునుగోడు అసెంబ్లీ కన్వీనర్

చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్డు, అండర్‌పాస్ నిర్మాణాలకు అడ్డుగా పలు అక్రమ నిర్మాణాలున్నాయి. వీటిని అధికారులు తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పనుల్లో జాప్యానికి కూడా ఇవి కారణంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పనులను చేపడుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వేగం పెంచుతాం.. నాగేశ్వర్‌రావు, ఎన్‌హెచ్–65 ప్రాజెక్ట్ డైరెక్టర్

బ్లాక్‌స్పాట్స్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. పెద్దకాపర్తి, చిట్యాలలో అండర్ పాస్ పనులను 50శాతానికి పైగా పూర్తయ్యాయి. తొలుత సర్వీసు రోడ్లు, భూగర్భ మురికి కాల్వ పనులు పూర్తి కావాలి. అండర్ పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మిస్తాం. ఆ తర్వాత గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపుతాం. ఈ పనులు రెండు నెలల్లోనే పూర్తి అవుతాయి. ఇప్పటికే గుత్తేదారు గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ సిద్ధం చేసి పెట్టారు. నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచాలని గుత్తేదారుకు సూచిస్తాం.

# భగీరథుడి తీరు.. నిమ్మకు నీరు..!

చిట్యాల : ఏళ్లుగా పెంచుతున్న నిమ్మతోటలను నీటి కొరత నుంచి కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి అవి ఆగి.. ఆగి పోస్తున్న నీటిని బొట్టుబొట్టుగా ఒడిసిపట్టుకుని తోటలను కాపాడుకుంటున్నారు. నకిరేకల్ ఉద్యాన క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో నిమ్మ రైతులు, కూరగాయల పెంపకం రైతులు కరవు పరిస్థితుల్లో తోటలను రక్షించుకునేందుకు నీటి గుంతలను నిర్మించుకుంటున్నారు. చిట్యాలలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు నారబోయిన నర్సింహకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల్లో నిమ్మతోట ఉంది. ఆయన ఇప్పటి వరకు 20 ఏళ్లలో 36 బోర్లు వేశారు. అందులో ంండు బోర్లు మాత్రమే ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం అవి రెండు కూడా ఆగి..ఆగి పోస్తున్నాయి. ఈ నీటిని డ్రిప్‌ద్వారా చెట్లకు పెట్టడం సాధ్యం కావడం లేదు. దీంతో రూ.1.50 లక్షల వ్యయంతో తోటలో 20 అడుగుల లోతు, 30 అడుగుల పొడవు, వెడల్పులతో నీటి గుంతను నిర్మించి పాలిథీన్ షీట్ ఏర్పాటు చేశారు. రెండు బోర్ల నుంచి అరకొరగా వస్తున్న నీటిని ఈ గుంతలో నిల్వ చేసి ఒకేసారి ఒత్తిడితో డ్రిప్ ద్వారా నిమ్మచెట్లకు నీటిని పెట్టి కాపాడుతున్నారు. నేరడ గ్రామానికి చెందిన మరో రైతు సీహెచ్.వెంకన్న రూ.2లక్షలతో పాలిథీన్ షీట్ గుంతను నిర్మించారు. నీటిని నిల్వ చేసి నిమ్మచెట్లను బతికించుకుంటున్నానని వివరించారు. మండలంలో భారీ వర్షాలు వచ్చినపుడు చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో నీరు చేరినప్పుడు మాత్రమే బోర్లు ఎక్కువ పోస్తున్నాయని, నీటి వసతులు లేక ఇక్కడ కరవు పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్



హైదరాబాద్ : కూరగాయలు, పూల హోల్‌సేల్ మార్కెట్ అంటే ముందుగా గుర్తుకొచ్చేది గుడిమల్కాపూరే. దీనిని తరలించాలని కొంతకాలంగా ఉన్న ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి. నగర శివారు అజీజ్‌నగర్‌లో అన్ని సదుపాయాలతో మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి కసరత్తు మొదలైంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మార్కెట్ కోసం స్థల సేకరణ పూర్తి చేశారు. కూరగాయలు, పూలతోపాటు పండ్ల మార్కెట్‌ను కలిపి సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు 150 ఎకరాల స్థలసేకరణ చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించినట్లు తెలిసింది. మెహదీపట్నానికి సమీపంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. నగరం అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం ప్రస్తుతం రద్దీగా మారింది. దీన్ని తరలించడానికి శంకర్‌పల్లి, శంషాబాద్, మొయినాబాద్, గండిపేట మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. బాహ్యవలయ (అవుటర్ రింగు రోడ్డు) రహదారికి సమీపంలోని మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అనువుగా ఉన్నాయని, ఇక్కడైతేనే రైతులు, హోల్‌సేల్ వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నంబరు 176లో సుమారు 220 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో 150 ఎకరాల్లో సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని ప్రభుత్వ ప్రతిపాదన. ఇప్పటికే భూముల వివరాలు కలెక్టర్‌కు అందగా.. దస్త్రం ప్రభుత్వానికి చేరింది.

**రైతులకు అనువుగా** అజీజ్‌నగర్‌లో పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్ అందుబాటులోకి వస్తే పశ్చిమ రంగారెడ్డి ప్రాంతాలైన వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు.

ఈ ప్రాంతం అవుటర్ రింగు రోడ్డుకు పక్కనే ఉండటంతో రవాణా సౌకర్యంగా ఉంటుంది. శివారు జిల్లాల నుంచి తాజా కూరగాయలు సైతం మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అత్యాధునిక సౌకర్యాలు కల్పించడమేకాకుండా.. పార్కింగ్ సమస్య తలెత్తకుండా 150 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

# రెండేళ్లు దిగులు.. ఆపై మిగులు




హైదరాబాద్ : మహానగరంలో మరో రెండేళ్ల పాటు తాగునీటి లోటు ఉండనుంది. ఐదేళ్లుగా డిమాండు, సరఫరా మధ్య అంతరం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తాగునీటి పరిస్థితి, 2030 వరకు అవసరాలు తీర్చేందుకు చేపట్టాల్సిన చర్యలను జలమండలి విశ్లేషించింది. 2020లో సుమారు 40 ఎంజీడీ(మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే)ల అంతరం ఉండగా.. ఇప్పుడది 100 ఎంజీడీలకు పైగా పెరిగింది. 2027 నాటికి అంతరం 260 ఎంజీడీలకు పెరిగే అవకాశం ఉందని అంచనా. అప్పటికల్లా గోదావరి 2, 3 దశలు పూర్తయితే 301 ఎంజీడీ(17.5 టీఎంసీలు)ల నీటితో నగరం అవసరాలు పూర్తిగా తీరడమే కాకుండా 34 ఎంజీడీల మిగులు ఉంటుందని జలమండలి భావిస్తోంది.ప్రస్తుతం జలమండలి ఓఆర్ఆర్ వరకు తాగు నీటిని సరఫరా చేస్తోంది. ఇప్పటికే నీటి కనెక్షన్ల సంఖ్య 14.07 లక్షలకు చేరుకుంది. కొత్త ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి నెలా సగటున 3వేల కొత్త కనెక్షన్లు ఇస్తుండటమే ఇందుకు నిదర్శనం.

**జలాలపై ప్రత్యేక దృష్టి..**

రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో 56 గ్రామాల పరిధిలో 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. అక్కడ భారీగా నీటి అవసరం ఉంది. అందుకే అదనంగా జలాలు తీసుకురావడంపై దృష్టిసారించారు. నివాసాలు, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు, వినోద విభాగాలు సహా ఏఐ, ఫిన్‌టెక్, స్మార్ట్ టెక్నాలజీల ఇన్నోవేషన్ హబ్‌లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నగరంలోని ఇతర ప్రాంతాల వాణిజ్య పారిశ్రామిక అవసరాలు, గేటెడ్ కమ్యూనిటీలు, రైల్వేలు, ఐటీ హబ్‌లు, సెజ్‌లకు 2027 నాటికి మొత్తం 100 ఎంజీడీల నీరు అదనంగా అవసరమని అంచనా. గోదావరి 2, 3 దశలతో అదనపు జలాలను అందుబాటులోకి తీసుకురావడం, వృథా తగ్గించటం, తాగటానికి కాకుండా ఇతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటి వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్లాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

# మత్తుచెరలో బాల్యం బందీ!



హైదరాబాద్ :ఆరో తరగతి పిల్లాడు.. ఒకరోజు నవ్వుతూ.. మరోరోజు దిగులుగా ఉండటంతో తల్లికి అనుమానం వచ్చింది. మార్కులు తగ్గటం వల్ల కావొచ్చని భావించింది. స్కూల్ బ్యాగు నుంచి వాసన రావటంతో బిడ్డ ఏదో దాస్తున్నట్టు గుర్తించింది. కడుపునొప్పితో బాధపడుతున్న కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్లినపుడు అసలు విషయం బయటపడింది. తెలిసీ తెలియని వయసులో పిల్లలు మత్తు చెరకు చిక్కుతున్నారు. వైట్నర్‌తో మొదలై... మరింత కిక్ కోసం సింథటిక్ డ్రగ్స్ వరకూ చేరటం ఆందోళన కలిగిస్తోంది. గత 5 నెలల్లో మత్తు పదార్థాలకు అలవాటుపడిన 600 మందిని గుర్తించారు. వీరిలో 200 మందికిపైగా 12–18 సంవత్సరాలలోపు విద్యార్థులే.

**ఎలా బయటపడుతున్నారంటే..**

తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) డ్రగ్స్ నియంత్రణలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాలతో నగరానికి ఉన్న లింక్‌లను ఛేదిస్తున్నారు. మత్తుపదార్థాలు విక్రయదారుల వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కొనుగోలుదారుల జాబితా రూపొందిస్తున్నారు. మాదకద్రవ్యాలు తీసుకుంటున్న వారికి మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. సాధారణ స్థితికి చేరే వరకూ వారిపై నిఘా ఉంచుతున్నారు. విద్యార్థులైతే వారి భవిష్యత్తుపై ప్రభావం పడకుండా చూస్తున్నారు. కేసు నమోదు చేయకుండా పునరావాస కేంద్రాలకు పంపుతున్నారు.

**సరదాగా మొదలై..**

నగరం, శివారు ప్రాంతాల్లోని పది పాఠశాలల్లో విద్యార్థులు ఈ–సిగరెట్‌కు అలవాటుపడినట్టు పోలీసులు గుర్తించారు. ఇలాంటివారు చోరీలకూ పాల్పడుతున్నారు. ముంబయి ముఠా ఏజెంట్ల ద్వారా పిల్లలకు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. రాజస్థాన్, ఒడిశా ముఠాలు గంజాయి చాక్లెట్లు, బిస్కెట్లను రుచి చూపుతున్నాయి. విద్యాసంస్థల సమీపంలోని కొన్ని కిరాణా, పాన్ షాపుల్లో వీటిని విక్రయిస్తున్నట్టు దర్యాప్తులో గుర్తించారు. స్నేహితుల ప్రభావంతో మత్తుకు దగ్గరవుతున్నారని మనస్తత్వ నిపుణులు తెలిపారు. గతేడాది ఓ పాఠశాలలో నలుగురు విద్యార్థుల బ్యాగుల్లో ఈ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కట్టడి చేయకపోతే పెద్ద నేరాలకు పాల్పడే ఆస్కారం ఉందని టీజీన్యాబ్ డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి హెచ్చరించారు.

**ప్రవర్తన మార్పులతో గుర్తించవచ్చు**

– సుజని, సైకాలజిస్టు, డ్రగ్ ట్రీట్‌మెంట్ సెంటర్, హైదరాబాద్

మాదక ద్రవ్యాలకు అలవాటుపడి కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో 10 శాతం మంది యువకులే ఉంటున్నారు. ఒక్కసారి డ్రగ్స్ తీసుకుంటే ఏంకాదనే అభిప్రాయంతో తప్పుదారి పడుతున్నారు. తామేం చేసినా ఎవరూ గుర్తించరనే ధీమాతో గాడి తప్పుతున్నారు. మిత్రుల ద్వారానే మత్తుకు దగ్గరవుతున్నారు. మత్తుపదార్థాలు తీసుకున్నట్టు చాలామంది గుర్తించలేరు. అకస్మాత్తుగా పిల్లల్లో అతిగా స్పందించటం, ఉత్సాహం, బాధపడటం, ఏడవటం వంటి ప్రవర్తన మార్పులు ఉంటే సీరియస్‌గా తీసుకోవాలి. ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లో డ్రగ్ ట్రీట్‌మెంట్ సెంటర్ (డీఆర్ఐ)లో వైద్యచికిత్స అందిస్తున్నారు.

# అతివల హితం.. నగదు రహితం

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం కాపులపల్లిలోని స్వశక్తి సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు, రుణ వాయిదాల డబ్బును వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్వాహకురాలికి అప్పగించారు. ఆమె సంఘాల ఖాతాల్లో జమ చేయలేదు. తర్వాత గుర్తించిన సభ్యురాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలో స్వశక్తి మహిళలు నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించారు. అయితే నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా వీవోఏ (గ్రామైక్య సంఘం) ప్రతినిధులకు ఇచ్చారు. వారు ఖాతాల్లో జమ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు అందుబాటులో లేకపోవడంతో పొదుపు సొమ్ము, రుణ కిస్తీల చెల్లింపులో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకులో



జమ చేయకుండా డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సెర్ప్ కార్యాచరణ చేపట్టింది. జిల్లాకు ఒక మండలంలో ప్రయోగాత్మకంగా నగదు రహిత లావాదేవీలపై అతివలకు అవగాహన కల్పించేందుకు సన్నద్ధమవుతోంది.

**పక్కదారి పడుతున్న పొదుపు సొమ్ము**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 42,504 సంఘాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.2,555.15 కోట్ల రుణ లక్ష్యం విధించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేకపోవడంతో మహిళలు స్థానిక సీఎస్‌సీ కేంద్రాలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన రుణ కిస్తీ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఖాతాలో జమ కాలేదని గుర్తించిన తర్వాత బాధితులు ప్రశ్నించినా బాధ్యులు చేతులెత్తేస్తుండటంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

**ఇదీ ప్రణాళిక..**

ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని నగదు రహిత లావాదేవీల అమలుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేస్తారు.

రుణ కిస్తీ, పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తారు.

ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై సభ్యుల సందేహాలు నివృత్తి చేస్తారు.సభ్యులు ఇంటి వద్దనే ఉంటూ బ్యాంకు ఖాతాకు నగదు చెల్లించేలా సన్నద్ధం చేస్తారు.

ప్రతి లావాదేవీకి రశీదు

స్వశక్తి మహిళలు ఇప్పటి వరకు బ్యాంకు లావాదేవీల సమయంలో రశీదులు తీసుకోవడం లేదు. నమ్మకంతో పొదుపు రుణ కిస్తులు చెల్లిస్తున్నా ఏదో ఒక చోట మోసాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి తావు లేకుండా డిజిటల్ బ్యాంకింగ్ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సభ్యురాలూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పిస్తాం. రవికుమార్, అదనపు ప్రాజెక్టు అధికారి, సెర్ప్

# మరోసారీ ముంపు ముప్పు!

ఖమ్మం: వర్షాకాలం సమీపిస్తుండటంతో ఖమ్మం జిల్లాలోని నగరపాలిక, పురపాలికల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యే లోతట్టు ప్రాంతాలకు ఈసారి ముంపు ముప్పు తప్పేలా లేదు. ముందస్తు సన్నద్ధత చర్యల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖమ్మంలో కన్నీరు'మున్నేరు'..**

ఖమ్మం నగరంలో మున్నేరు పరీవాహక కాలనీలు సారథినగర్, మంచికంటినగర్, వెంకటేశ్వరకాలనీ, పద్మావతినగర్, కాలొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్ గతేడాది జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం కాలనీలకు ఏటా వరద ముప్పు తప్పటం లేదు. వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మున్నేరుకు రెండువైపులా చేపట్టిన కరకట్టల నిర్మాణ పనులు కొనసా..గుతున్నాయి. నిజాంపేట, చెరువుబజార్, వరదయ్యనగర్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల వెంట మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కాల్వలు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మురుగుకాల్వల ఆక్రమణలతో పరిస్థితి మరింత దిగజారింది. ఈసారి వరద తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమించి.. స్థానికంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తామని తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత, సహాయక చర్యలపై 100 రోజుల ప్రణాళికను జూన్ 2 నుంచి అమలుచేస్తామన్నారు.

**మధిరలో మారని తీరు**

మధిర అంబారిపేట పెద్దచెరువుకు రాతి కరకట్ట లేకపోవటం వల్ల ఏటా వానాకాలంలో వరదరాఘవాపురం, హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీకి వరదనీరు పోటెత్తుతుంది. మట్టి కట్ట స్థానంలో కిలోమీటరు మేర రాతికట్ట నిర్మిస్తేనే ముంపు సమస్యకు కొంత అడ్డుకట్ట వేయొచ్చు. బంజారాకాలనీ, లడక్‌బజార్‌లో వరద కాల్వ ఆక్రమణకు గురవటం వల్ల చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి, రహదారులపైకి భారీగా వరద నీరు చేరుతుంది.

కరకట్ట నిర్మాణం కలేనా? వైరా

నల్లచెరువు వాగు నిండి ఏటా ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోంది. సుమారు 200 ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఇక్కడ ముంపు నివారణకు కరకట్ట నిర్మించాలనే డిమాండ్ 15ఏళ్లుగా అమలుకు నోచుకోవటం లేదు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే సమీపంలోని రాజీవ్‌కాలనీకి వరద పోటెత్తుతుంది. ఏటా తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్రంబజార్, శాంతినగర్, సంతబజార్‌లు ఏటా వరద గుప్పిట్లో చిక్కుకుంటాయి. మురుగునీటి వ్యవస్థను పటిష్ఠపరిస్తేనే ముంపు ముప్పు తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

సత్తుపల్లిరాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌ను ఏటా వరదనీరు ముంచెత్తుతుంది. శివారు ప్రాంతాలను ఆనుకుని ఉన్న మురుగుకాల్వలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపు ముప్పును తప్పించవచ్చు.

# అ'ధన'పు వెలుగులు

కర్నూలు : విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఆ శాఖ 50 శాతం రాయితీ ప్రకటించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించింది. పెద్ద సంఖ్యలో వినియోగదారులు ముందుకొచ్చారు. నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,673 విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి 10,427 కిలోవాట్ల అదనపు లోడు పెంచాలంటూ రూ.1,26,11,850 మేర నగదు జమ చేశారు.


**పెరిగిన విద్యుత్తు వినియోగం**

కొత్తగా విద్యుత్తు కనెక్షన్ మంజూరు నిమిత్తం గ్రామాల్లో కనీసం ఒక కిలోవాట్, పట్టణాల్లో 2 కిలోవాట్ల చొప్పున దరఖాస్తు చేయిస్తున్నారు. పదేళ్ల కిందట గృహాల్లోని ఎలక్ట్రానిక్స్ పరికరాల వినియోగం ఆధారంగా 0.5 కిలోవాట్ లోడుకు మాత్రమే రుసుం చెల్లించేవారు. కాలక్రమేణా ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. ప్రత్యేకించి ఏసీల వాడకం విపరీతంగా పెరగడంతో పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. దీంతో తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇందుకనుగుణంగా అవసరమైన చోట నియంత్రికలు ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది.

**నియంత్రికల ఏర్పాటుకు మార్గం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ అదనపు లోడు రుసుం విధిస్తున్నారు. దీంతో కొందరు వినియోగదారులు పునః పరిశీలనకు వినియోగదారులు అర్జీలు సమర్పిస్తున్నారు. మరి కొందరు రుసుం చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారు. ఈ కారణాలతో అదనపు లోడు తట్టుకునేలా అధిక సామర్థ్యమున్న నియంత్రికల ఏర్పాటు చేసేందుకు నిధుల కొరత వేధిస్తోంది. తాజాగా దరఖాస్తు రూపంలో నిధులు సమకూరడంతో నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు అవసరమైన చోట నూతన నియంత్రికలు ఏర్పాటు చేయనున్నారు.

**రాయితీతో పెరిగిన స్పందన**



ఇళ్లలోని ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఇతర పరికరాలకు వినియోగిస్తున్న విద్యుత్తు ఆధారంగా లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. కిలోవాట్‌కు విద్యుత్తు శాఖకు సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, దరఖాస్తుకు రూ.50, డెవలప్‌మెంట్ ఛార్జీగా రూ.2 వేలు చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్ విద్యుత్తు పొందాలంటే రూ.2,250 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం రాయితీ ప్రకటించారు. ఒక్కో కిలోవాట్‌కు రూ.1250 చొప్పున వసూలు చేశారు. ఎంత అదనపు లోడు క్రమబద్ధీకరించుకున్నా 50 శాతం రాయితీ ఇచ్చారు. దీంతో చాలామంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రుసుము చెల్లించారు.

దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూర్యఘర్ పేరుతో సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రోత్సాహకం ఇస్తోంది. ఈ పథకం కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారు ఇంట్లో విద్యుత్తు లోడు ఎన్ని కిలోవాట్లు ఉంటే అంతే సామర్థ్యంతో సౌర విద్యుత్తు యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చాలామంది వినియోగదారులు సోలార్ యూనిట్లను దృష్టిలో పెట్టుకుని లోడు పెంపునకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో సంస్థకు మరింత ఆదాయం సమకూరుతోంది.

సర్వీసులు 2,408

అదనపు లోడు (కిలోవాట్లు) 3,471

ఆదాయం(రూ.ల్లో) 42,30,850

# విద్యార్థులు అధికం.. వసతులు హీనం..

పార్వతీపురం : మండలంలోని ఎమ్మార్‌నగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా సరిపడా వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయిదేళ్లుగా అదనపు తరగతి గదులు, వంటశాల, భోజన గదుల నిర్మాణాలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి. పాఠశాలలో 6 నుంచి పది తరగతుల్లో 416 మంది చదువుతున్నారు. కొన్ని తరగతులకు రెండేసి గదుల్లో బోధన సాగుతోంది. ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, ఉపాధ్యాయులు,



ప్రయోగశాల, గ్రంథాలయం, మధ్యాహ్న భోజన సరకుల నిల్వలకు గదుల అవసరం ఉంది. 10 గదులే ఉండటంతో వంటలకు అవస్థలే..: ఇక్కడ విద్యార్థులకు అవసరమైనన్ని పాత్రల్లేక బయట నుంచి తీసుకొచ్చి వంటలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్నది ఒక్కటే సిలిండర్ కావడంతో కొన్నిసార్లు కట్టెల పొయ్యిలే దిక్కవుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సిలిండర్ల సంఖ్య పెంచలేదని హెచ్‌ఎం డీవీ.కుమార్ తెలిపారు. విషయం ఎంఈవో 2 ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

# ఉత్సవం వస్తోంది.. 'ఉరు'కులు పెట్టాలి



మంత్రాలయం : నెలరోజుల ఉత్సవం.. ఐదు రాష్ట్రాల భక్తులు.. ఇసుకేస్తే రాలనంత జనం.. ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి సన్నిధి కిటకిటలాడుతుంటుంది.. ప్రసిద్ధి గాంచిన ఈ పుణ్యక్షేత్రం శ్రావణమాస ఉత్సవాలకు సిద్ధమైంది.. ఈనెల 25 నుంచి నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలొస్తారు. వారొచ్చే బాటలు నలుదిక్కులూ బాగా లేవు.. అడుగడుగునా గుంతలతో నిండిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఆలయానికి ఏడాదికి రూ.12 నుంచి రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది.. పశ్చిమ ప్రాంత వాసుల ఇంటి దేవుడి కోవెలకు వెళ్లి మొక్కుతీర్చుకోవడానికి 'మార్గం'సుగమం చేయాలని భక్తజనం విన్నవిస్తోంది.

**నలుదిక్కులా గుంతలే**

ఆలయానికి ప్రధానంగా ఆదోని నుంచి ఎరిగేరి, కామవరం మీదుగా చేరుకుంటారు. తెలంగాణ, కర్ణాటకలోని రాయచూరు, గుల్బర్గా తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారు మాధవరం, కోసిగి మీదుగా ఉరుకుందకు వస్తారు. బళ్లారి, సిరుగుప్ప, సింధనూరు తదితర ప్రాంతాల నుంచి కౌతాళం మీదుగా చేరుకుంటారు. మాన్వి, సిరవార, దేవదుర్గ తదితర ప్రాంతాల వారు కౌతాళం మండలంలోని కుంబళనూరు వద్ద తుంగభద్ర నదిని దాటి హాల్వి గ్రామం మీదుగా ఉరుకుందకు చేరుకుంటారు. ఆలయానికి నలువైపులా ఉన్న రహదారుల నుంచి భక్తులు వాహనాలు, బస్సుల్లో వేలాదిగా తరలొస్తారు.

ఆదోని-ఉరుకుంద మార్గంలో ఎరిగేరి నుంచి ఉరుకుంద-హాల్వి వరకు 18.2 కి.మీ రహదారి నిర్మాణానికి 2020లో పుష్కరాల సందర్భంగా రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో ఈ రహదారిలో అడుగడుగునా గుంతలే ఏర్పడ్డాయి. ఇటీవలే కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టినా.. మళ్లీ గుంతలమయంగా మారాయి.

హాల్వి-ఉరుకుంద, ఉరుకుంద-కౌతాళం, ఉరుకుంద-ఆదోని గ్రామాల మధ్య రహదారులు గుంతలమయంగా మారాయి. హాల్వి రహదారిలో అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి.

ఉరుకుంద-కోసిగి రహదారి అనేక మలుపులు, ఇరువైపులా పంటపొలాలు ఉండటంతో ఒక వాహనమే వెళ్లడానికి వీలుంది. ఎదురెదురుగా మరో వాహనం వస్తే రాకపోకలు స్తంభిస్తాయి. గతంలో ఆదోని-ఉరుకుంద రహదారిలో గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పలువురు భక్తులు గాయపడగా, ఓ వృద్ధుడు మరణించారు.

# గాజులదిన్నె నింపితేనే గడపకు నీరు



కర్నూలు : హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్‌ఎన్‌ఎస్ఎస్) కాల్వ వస్తున్న నీటిని గాజులదిన్నెకు ఎప్పటి నుంచి మళ్లిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. తుంగభద్ర డ్యాంలో 80 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయలేం.. ఎల్లెల్సీకి రబీకి నీటిని విడుదల చేయమని తుంగభద్ర బోర్డు అధికారులు అధికారికంగానే ప్రకటించారు. దీంతో సుంకేసుల జలాశయంలో తగినంత నీటిని నిల్వ చేసే పరిస్థితి ఉండదని తేల్చారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలో నివసిస్తున్న సుమారు 6.5 లక్షల మందికి సుంకేసుల నుంచి తాగునీరు అందించడం సవాలుగా మారనుంది. దీన్ని అధిగమించడానికి గాజులదిన్నెలో నీటిని నిల్వ చేసుకుని వచ్చే వేసవిలో వినియోగించుకోవాలని తీర్మానించారు.

**పెండింగు పనులు పూర్తయితే..**


గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచే పనులను రూ.57.35కోట్లతో చేపట్టారు. ఇంకా 476.19ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రైతులకు పరిహారం చెల్లించలేదు. తాజాగా హెచ్‌ఎన్ఎస్ఎస్ నుంచి పుష్కలంగా నీరు వస్తున్న నేపథ్యంలో పెండింగు పనులు పూర్తిచేయాలి.

**హంద్రీ వస్తోంది.. అప్రమత్తం కావాలి**

హంద్రీనీవా కాల్వలో 3,850 క్యూసెక్కులు ప్రవహించేలా విస్తరించారు. తాజాగా నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా కాల్వ నుంచి గాజులదిన్నె జలాశయానికి వెళ్లే కాలువ ప్రవాహ సామర్థ్యం 300 క్యూసెక్కులే. 114 రోజుల పాటు నీటిని తరలిస్తే గానీ జలాశయానికి మూడు టీఎంసీల నీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం జలాశయంలో 1.6 టీఎంసీల నీరుంది. మొత్తం సామర్థ్యం 4.5 టీఎంసీలు. ఇప్పటి నుంచే నీటిని తరలిస్తేనే వచ్చే వేసవికి తాగునీటిని పూర్తిస్థాయిలో నిల్వచేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

ఇటీవల జరిగిన నీటిపారుదల సలహామండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కూడా అధికారులను అప్రమత్తం చేశారు. నగర అవసరాలకు తగినట్లుగా గాజులదిన్నె ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది ఇంకా ఖరారు చేయలేదు. వాస్తవానికి జలవనరులశాఖ, కార్పొరేషన్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రభుత్వపరంగా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై చర్చించుకోవాల్సి ఉండగా ఆ దిశగా ఏమాత్రం ఆలోచించడంలేదు.

# పండ్ల తోటలకు 'ఉపాధి' గొడుగు



నంద్యాల : ఇప్పటి వరకు ఉపాధి హామీ పనుల్లో మట్టి పనులకు ప్రాధాన్యమిచ్చిన అధికారులు పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించారు. రైతుల పొలాలు, చెరువు గట్లు, ఖాళీ స్థలాలు, రహదారుల ఇరువైపులా మొక్కలు నాటాలని ప్రణాళిక రూపొందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,000 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని డ్వామా లక్ష్యంగా నిర్ణయించుకుంది. కర్నూలు జిల్లాలో 4,500 ఎకరాలు, నంద్యాలలో 4,500 ఎకరాల్లో పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ జాబితాలో కొబ్బరి, మామిడి, నిమ్మ, జామ, చీనీ, సపోటా, నేరేడు, మునగ తోటలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల్లో తోటల సాగు లక్ష్యంగా నిర్ణయించుకున్నా.. మెట్ట ప్రాంతాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**నీటి వనరుల గట్లపై..**

గ్రామాల్లోని చెరువులు, జలాశయాల గట్లపైన కొబ్బరి మొక్కల పెంపకానికి ప్రణాళికలు రూపొందించారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల వివరాలు సేకరించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 100 చొప్పున ఎకరాల్లో అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ఒక్కో 50 కి.మీ. పొడవునా రహదారుల వెంట నీడనిచ్చే మొక్కలు పెంచనున్నారు. ఒక్కొక్క జిల్లాలో 30 సంస్థల్లో పండ్ల మొక్కలు పెంచనున్నారు. చుట్టూ ప్రహరీ ఉండి రక్షణకు అనువుగా ఉండే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో వీటిని పెంచనున్నారు.

**మహిళా సంఘాలకు బధ్యతలు**

మొక్కల సంరక్షణ బాధ్యతను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించాలని నిర్ణయించారు. మొక్కల పెంపకం, నిర్వహణ బాధ్యతలను ఉపాధి పథకం సహకారంతో వారే చూస్తారు. కొబ్బరి చెట్ల దిగుబడి వచ్చిన తర్వాత వాటిపై వచ్చే ఆదాయాన్ని ఆయా సంఘం సభ్యులందరికీ వర్తించేలా ప్రణాళికలు రూపొందించారు.ఎకరానికి 60 మొక్కలు

డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లి, కోవెలకుంట్ల, రుద్రవరం, ఆత్మకూరు, మిడుతూరు, కొత్తపల్లె, మహానంది, పాణ్యం, గడివేముల, సంజామల, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, నందవరం, చిప్పగిరి, ఆస్పరి, దేవనకొండ, హాలహర్వి, పెద్దకడబూరు, సి.బెళగల్, గూడూరు తదితర మండలాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ఎకరానికి 60 మొక్కల చొప్పున నాటనున్నారు. మొక్కలను ప్రభుత్వ నర్సరీల ద్వారా తెప్పిస్తారు. ప్రభుత్వం ఇప్పటికే ధరలు నిర్ణయించింది. మామిడి, కొబ్బరి, చీనీ, దానిమ్మ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మునగ సాగుకు విత్తనాలను సిద్ధంగా ఉంచారు.

# ఉచిత ఇసుకకు రెక్కలు

డోన్ : ఉచిత ఇసుక వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. తుంగభద్ర తీరం వెంట కె.శింగవరం, ఈర్లదిన్నె, పల్‌దొడ్డి, ముడుమాల, కొత్తకోట, కౌతాళం మండల పరిధిలో పలు చోట్ల ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కౌతాళంలో ఓపెన్, సి.బెళగల్ మండలంలో డీసిల్టింగ్ పద్ధతిలో ఇసుక తీస్తారు. డోన్ పట్టణ పరిధిలో ఎక్కడా రీచ్‌లు లేవు.. నిల్వ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు.. దీన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకొన్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఇసుక రీచ్‌ల వద్ద ఉచితంగా తీసుకొస్తున్నారు. టిప్పర్లలో తెచ్చి కంబాలపాడు సర్కిల్ సమీపంలో పెద్దఎత్తున నిల్వ చేసుకొంటున్నారు.

**టిప్పర్లలో తెచ్చి.. ట్రాక్టర్ లెక్కన అమ్మి**

డోన్ పట్టణానికి చెందిన కొందరు తాడిపత్రి నుంచి టిప్పర్లలో తీసుకొస్తున్నారు. అక్కడ ఒక టిప్పర్‌కు రూ.13 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇక్కడ పట్టణ సమీపంలో నిల్వ చేసి ట్రాక్టర్ లెక్కన విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.2500 నుంచి రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. ఒక టిప్పర్‌లో ఐదు ట్రాక్టర్ల వరకు ఇసుక వస్తుంది. నిత్యం అక్కడ వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇసుక నిల్వలపై రెవెన్యూ సిబ్బందికి ఇటీవల సమాచారం అందటంతో తనిఖీలకు వెళ్లారు. వ్యాపారులు బెదిరింపులకు దిగారు. ఇసుకను స్వాధీనం చేసుకుంటే ఎలా పనిచేస్తారో చూస్తామంటూ ఓ వ్యాపారి



హుకుం జారీ చేయడం గమనార్హం."డోన్ సమీపంలో ఇసుక నిల్వలపై అధికారికంగా అనుమతుల్లేవు.. సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించి పరిశీలన చేయించి చర్యలు తీసుకుంటామని" ఆర్డీవో నరసింహులు తెలిపారు.

**వాగుల్లో తెచ్చి..**

గృహ అవసరాల నిమిత్తం వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గనులు, భూగర్భ శాఖ రూపొందించిన ఏపీ శాండ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఊరు దాటి వెళ్లే వాహనాలను తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై పర్యవేక్షించాలి. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తీసుకెళ్తే జరిమానా విధించొచ్చు. క్షేత్రస్థాయిలో తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు గృహ అవసరాల పేరుతో నదులు, వాగులు, వంకల్లో ఇసుకను తవ్వి ఊరు దాటిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.1,500-2,500, రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇది బహిరంగంగా జరుగుతున్నా సచివాలయ ఉద్యోగుల నుంచి గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు.

# మల్లన్న భద్రతకు మసక

శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో నిఘా కళ్లు మసక బారాయి. తరచూ చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయ భద్రతకు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు, ఆర్మ్‌డ్ పోలీసులు, ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. వీరందరినీ సమన్వయం చేసి పనిచేయించడానికి ముఖ్య భద్రతాధికారి(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) పోస్టును దేవాదాయశాఖ మంజూరు చేసింది. కొన్నేళ్ల పాటు ఆ పోస్టును భర్తీ చేసి నిర్వహణ చేపట్టారు. ఈ కుర్చీని గత మూడేళ్ల నుంచి ఖాళీగా ఉంచడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది.

**ట్రాఫిక్ విధులకే హోంగార్డులు**

శ్రీశైల క్షేత్ర పరిధిలో మొత్తం 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించేందుకు ఈవో కార్యాలయం పక్కనే కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీని బాధ్యత సెక్యూరిటీ గార్డులకు అప్పగించారు. అక్కడ హోంగార్డులను నియమించకపోవడం లోపభూయిష్టంగా కనిపిస్తోంది. స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణాలు, క్యూలైన్లపైన నిఘా పెట్టాల్సి ఉండగా, నైపుణ్యం తక్కువగా ఉండే సెక్యూరిటీ గార్డులను నియమిస్తుండడంతో ఆలయంలో జరిగే దొంగతనాలను సకాలంలో గుర్తించలేకపోతున్నారు. పోలీస్ శాఖలో శిక్షణ పొంది



వచ్చిన హోంగార్డులను కేవలం క్షేత్ర పరిధిలోని పలు ప్రదేశాల వద్ద ట్రాఫిక్ విధులకు వినియోగించు కుంటున్నారు.

**పర్యవేక్షణ ఖాళీ**

శ్రీశైల దేవస్థానంలో ముఖ్యభద్రతాధికారి(సీఎస్‌వో) పోస్టును మూడేళ్ల నుంచి ఖాళీగా ఉంచారు. డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ హోదా కలిగిన వారు ఆసక్తి చూపడం లేదు. డీఎస్పీ అధికారినే నియమించాలని కొందరు ఈవోలు మొండి పట్టు పట్టడంతో అతీగతి లేకుండా పోయింది. ప్రస్తుతం పర్యవేక్షకుడి హోదా అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు.ఆలయంలో పనిచేసే ఆర్మ్‌డ్, ఎస్పీఎఫ్, హోంగార్డులు, సెక్యూరిటీ గార్డులకు షిఫ్టుల వారీగా రోల్ కాల్ నిర్వహిస్తుంటారు. రోల్‌కాల్‌లో భద్రతా సిబ్బంది విధులకు హాజరు కావడమే కాకుండా, డ్యూటీ పాయింట్‌లో ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలన్నది హెచ్చరిస్తుండాలి. మొక్కుబడిగా రోల్‌కాల్ జరుతుండటం లోపాలకు తావిస్తోంది. ఆలయ ప్రాంగణంలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు తక్కువగా ఉన్నాయి. లగేజీ స్కానర్ పనిచేయడం లేదు. మెటల్ డిటెక్టర్లు, స్కానర్లను ఏర్పాటు చేయాలి.

చురకలు



## ఆటిజం బాలలకు ప్రత్యేక పాఠశాల

పెదవాల్తేరు : పోలియో వ్యాధి నివారణలో పెదవాల్తేరు ప్రభుత్వ రాణిచంద్రమణి దేవి (ఆర్.సి.డి.) ఆసుపత్రి ఒకప్పుడు దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చేవారు. సంవత్సరాలపాటు ఇక్కడే ఉంటూ శస్త్రచికిత్స, ఫిజియోథెరపి చేసుకొని పూర్తిగా నయమైన తరువాత స్వస్థలాలకు వెళ్లేవారు. ప్రస్తుతం పోలియో తగ్గిపోవడంతో ఆసుపత్రిలో చిన్నపిల్లలు, ఎముకల వ్యాధులకు వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో ఆటిజం బాలలకు ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ బాధిత పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి ఇస్తారు. వస్తువులను పోల్చుకోవడంపై, పేర్లపై అవగాహన కల్పిస్తామని, సెలబ్రల్‌పాల్సీ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తామని



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హెచ్.వి.గోపాలకృష్ణ తెలిపారు. 70 పడకల సామర్థ్యం గల ఆసుపత్రిలో ప్రతి నెల సుమారు 15 వరకు కాలివంకర్లు, తదితర అవకరాలకు శస్త్రచికిత్సలు చేస్తుంటామన్నారు. ఆసుపత్రికి ఎముకల సంబంధిత వ్యాధులతో ఎక్కువ మంది వస్తున్నారు. ఇక్కడ అన్ని రకాల రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, తదితర వైద్యపరికరాలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు గాయపడిన వారికి చికిత్స అందిస్తామని, వంశపారం పర్యంగా వచ్చే వ్యాధులకు వైద్యం అందుబాటులో ఉంటుందని డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ ఉంటుందని చెప్పారు.

## దారి.. మహాదారుణం!

అనకాపల్లి : భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు.. జిల్లాలోని రహదారుల్లో ప్రధానమైనది. 81 కి.మీ. పొడవుండే ఈ రోడ్డు చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలను కలుపుతుంది. రోజూ కొన్ని వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి. 20 ఏళ్లలో దీనికి కనీసం ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు. దీంతో చాలాచోట్ల రూపురేఖలు లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో మహాదారుణంగా తయారైంది. గత ఐదేళ్లలో 8 మందికిపైగా గోతుల్లో పడి మృతి చెందారు. 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. వందల సంఖ్యలో వాహనాలు మరమ్మతుకు గురయ్యాయి.

గ్రానైట్, క్వారీ వాహనాలు భారీగా తిరగడంతో బీఎన్ రోడ్డు పలుచోట్ల ఛిద్రమైంది. పాలకులు, అధికారులు దీని మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణమంటే నరకంలా తయారైందంటూ చోడవరానికి చెందిన కొంతమంది న్యాయవాదులు కోర్టులో పిటీషన్ వేశారు. దీంతో న్యాయాధికారి జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 26న కలెక్టర్‌తో సహా మరికొంతమంది అధికారులు న్యాయస్థానంలో హాజరు కావాల్సి ఉంది. దీంతో జిల్లా అధికారిక యంత్రాంగం ఆగమేఘాలపై తాత్కాలికంగా గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టింది. కనీసం ఈ పనులైనా సక్రమంగా చేస్తున్నారా.. అంటే అదీ లేదు. మొత్తం గోతులు పూడ్చడం మానేసి కేవలం పెద్దగుంతలను మాత్రమే కప్పుతున్నారు. వాటిలోనూ కంకర, మట్టి వేసి రోలర్ తిప్పి.. మమ అనిపించేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. అధికారులు న్యాయస్థానంలో సమాధానం చెప్పేందుకు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. నాలుగు రోజులు



వానలు పడితే ఇప్పుడు కప్పిన మట్టి కొట్టుకుపోయి మళ్లీ గోతులు తేలుతాయి. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. **నిధులిచ్చినా పనులు శూన్యం:** చోడవరం మండలం గంధవరం నుంచి నర్సీపట్నం వరకు, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకూ రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రూ. 110 కోట్లు మంజూరు చేసింది. కానీ.. వైకాపా ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులు గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పనుల్లో పురోగతి లేదు. **ప్రజలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు:** బీఎన్ రోడ్డు అధ్వానంపై న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది వాస్తవమే. రోడ్డు పరిస్థితిని మేమూ గుర్తించాం. గుత్తేదారుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. తొలుత ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేస్తున్నాం. తర్వాత పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపడతాం. సాంబశివరావు, ఆర్అండ్‌బీ ఈఈ, అనకాపల్లి

## కానరాని చినుకు.. కర్షకులకు లేదు కునుకు



పెద్దవడుగూరు : జిల్లాలో ఈఏడాది వరుణుడు కరుణించకపోవడంతో ఖరీఫ్ పంటలసాగుపై మొదట్లోనే రైతన్నలు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో రైతులు నెలరోజుల కిందట సాగు చేసిన పత్తిపంటకు వర్షం లేక తేమశాతం భూమిలో లేకపోవడంతో మొక్కల ఎదుగుదల ఆగిపోయింది. ఆవులాంపల్లికి చెందిన శంకర్‌రెడ్డి ఏడు ఎకరాల్లో వేసిన పత్తిపంటను ట్రాక్టర్ సాయంతో తొలగించారు. ఈఏడాది జులై మాసం పూర్తి కావస్తున్నా చినుకు జాడకరవైందని, ఇక లాభం లేదనుకొని ప్రత్యామ్నాయ పంటలే దిక్కని వాపోయారు. సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇదే బాట మరికొంత మంది రైతు ఉండటం గమనార్హం. జిల్లాలో సాధారణ వర్షపాతం 120 మి.మీ ఉండగా కనీసం ఇరవై మి.మీ.లు కూడా నమోదు కాకపోవడాన్ని బట్టి ఇక్కడి కరవు పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

## మామూళ్ల మత్తు.. అక్రమార్కులకు మద్దతు!



అనంతపురం : అక్రమార్కుల చర్యలు.. అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్లు నష్టం వాటిల్లుతోంది. గత వైకాపా పాలనలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు వేసి విక్రయించారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. భూబదిలీ చేయకుండానే ప్లాట్లు వేయడం ద్వారా రెవెన్యూ శాఖకు నష్టం వాటిల్లుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ లేఅవుట్లపై ప్రజాప్రతినిధులు, స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అహుడా అధికారులు నివేదికలు అందిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. దీంతో అమాయకులు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాటు కొనుగోలు చేసి నష్టపోతున్నారు.

**నిబంధనల ఉల్లంఘన**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అత్యధిక శాతం పంచాయతీలు అహుడా (అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోకి వస్తాయి. లేఅవుట్‌లో 10 శాతం భవిష్యత్తు అవసరాలకు కేటాయించాలి. ప్రాంతాన్ని బట్టి 33, 60 అడుగుల రోడ్లు ఏర్పాటు చేయాలి. దీంతో 30 నుంచి 40 శాతం భూమి వదులుకోవాల్సి వస్తుందని యజమానులు అహుడా నుంచి అనుమతులు తీసుకోవడం లేదు.

అహుడా నివేదిక మేరకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. లేఅవుట్ యజమానులకు నోటీసులు అందించి ఎల్‌ఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలి. స్పందించకపోతే తొలగించాలి. అలా చేయకపోతే పంచాయతీ కార్యదర్శులపై చట్టపరంగా చర్యలు తీసుకునే అధికారం జిల్లా అధికారికి ఉంటుంది. అహుడా నివేదికలను అటు పంచాయతీ అధికారి, ఇటు కార్యదర్శులు బుట్టదాఖలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేని వాటికి రిజిస్ట్రేషన్ చేయవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నివేదికలు పంపుతున్నా వారు పట్టించుకోవడం లేదు.

**రూ.వందల కోట్ల నష్టం**

అహుడా అనుమతి పొందాలంటే భూమి విలువను బట్టి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించాలి. రెండు జిల్లాల్లో అనుమతులు లేని లేఅవుట్ల విస్తీర్ణం సుమారు 6 వేల ఎకరాలు ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి కనీసం రూ.50 కోట్ల నష్టం చేకూరుతోంది. లేఅవుట్‌లో 10 శాతం భూమి చొప్పున ఇరు జిల్లాల్లో సుమారు 600 ఎకరాలు పంచాయతీలకు స్వాధీనం చేయాల్సి ఉంటుంది.ఆ భూమి విలువ కనీసం రూ.300 కోట్లు ఉంటుందని అంచనా.

**తగిన చర్యలు తీసుకుంటాం- నాగరాజు, డీపీవో, అనంతపురం**

అనధికార లేఅవుట్లకు సంబంధించి బాధ్యులకు ఇప్పటికే నోటీసులు అందించాం. త్వరలోనే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. విధిగా నిబంధనలు పాటించాల్సిందే.

## ఎత్తిపోతలకు నిధుల గ్రహణం



ముదిగుబ్బ : హంద్రీనీవా నీటితో భూములను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. ముదిగుబ్బ మండలం ములకవేముల వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు నిధులలేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. రూ.1.47 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకొచ్చారు. అనంతపురం జిల్లా నుంచి చిత్తూరుకు వెళ్లే హంద్రీనీవా కాలువ ముదిగుబ్బ మండలంలో 8 కిలోమీటర్ల మేర ఉంది. మలకవేముల క్రాస్‌లోని హంద్రీనీవా నుంచి ఆ గ్రామ చెరువుకు నీరందేలా ఏర్పాటు చేశారు. లిఫ్ట్ పద్ధతిలో హంద్రీనీవా జలాలను చెరువుకు నింపేలా పంప్‌హౌస్, ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**తవ్వి వదిలేశారు..** 2021, జులైలో పంప్‌హౌస్ నిర్మాణానికి గుంత తవ్వి వదిలేశారు. కాలువ నుంచి చెరువు వరకు పైప్‌లైన్ తవ్వి కొంతమేర పైపులు ఏర్పాటు చేశారు. ఏడాదిన్నరలో పనులు పూర్తిచేయాల్సి ఉన్నా నిధులలేమితో 20 శాతమే అయింది . మిగిలిన 80 శాతం పనులు ఆగిపోయాయి. గత వైకాపా పాలనలో పనులు ముందుకు సాగలేదు. పథకం పూర్తయితే ఏటా 0.039 టీఎంసీల హంద్రీనీవా జలాలను చెరువులో నింపుతారు. ముదిగుబ్బ మండలం ములకవేముల, ఎనుములవారిపల్లితో పాటు నల్లమాడ మండలంలోని ఎర్రవొంకపల్లి, చుట్టుపక్కల గ్రామాలతో కలిపి సుమారు 200 ఎకరాలకు సాగు నీటి సమస్య తీరుతుంది. భూగర్భజలాలు పెరిగి మరిన్ని బీడుభూములు సాగులోకి వచ్చే అవకాశముంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– లోకేష్, ఏఈఈ, ఏపీఎస్ఐడీసీ పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

## నవోదయం స్ఫూర్తి.. నాటు సారా విముక్తి!



అనంతపురం : నాటుసారా వ్యసనం వ్యక్తి ఆరోగ్యంతోపాటు కుటుంబాన్ని కబళిస్తోంది. ఆర్థికంగా కుంగదీసి కుటుంబాలను వీధిన పడేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా నిర్మూలించడానికి 'నవోదయం 2.0' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**జిల్లాలో 51 నాటుసారా రహిత గ్రామాలు**

అనంతపురం జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన నివారణ చర్యల కారణంగా నాటుసారా తయారీ తగ్గుముఖం పట్టింది. జిల్లాలో ఏడాది క్రితం 104 నాటుసారా ప్రభావిత గ్రామాలు ఉండేవి. ప్రస్తుతం వాటిలో 51 ఊళ్లు ఆ మహమ్మారి రహిత గ్రామాలుగా రూపాంతరం చెందాయి. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సారా ప్రభావిత గ్రామాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి నవోదయం 2.0 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టింది. దానివల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామసభల ద్వారా అవగాహన కల్పించారు. సారా తయారు చేస్తే పడే శిక్షలు గురించి పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించారు. సారా తయారీ, విక్రయాల్లో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి బైండోవర్ చేశారు.

**నక్కనదొడ్డి తండా ఆదర్శం..**

ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమం ఓ గ్రామంలో నాటుసారా పేరు వినిపించకుండా చేసింది. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి పంచాయతీలోని నక్కనదొడ్డి తండాలో నాటుసారా గుప్పుమనేది. తండాలో 170 కుటుంబాలు ఉండగా, 30 కుటుంబాలకు సారా తయారీనే జీవనోపాధిగా ఉండేది. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అబ్కారీ అధికారులు ఆ ఊరిని పూర్తిగా మార్చారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసే వ్యాపారులపైనా కేసులు నమోదు చేశారు. కొందరు పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. 12 మందికి ప్రభుత్వం రుణాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు పంపారు. 40 మంది మహిళలకు ఐవోసీ సంస్థ సహకారంతో ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించారు. త్వరలో వీరందరికీ కుట్టుమిషన్లు అందజేయనున్నారు. తమ గ్రామం నాటుసారా రహితంగా గుర్తించడంపై నక్కనదొడ్డి తండా సర్పంచి డుంగావత్ వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

**సంపూర్ణంగా నిర్మూలిస్తాం..**


– నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

నవోదయంతో ప్రజల్లో గణనీయంగా మార్పు వస్తోంది. ఈ ఏడాది చివరికల్లా జిల్లాలో నాటుసారా సంపూర్ణంగా నిర్మూలిస్తాం. నక్కనదొడ్డి తండా ఓ స్ఫూర్తి. జిల్లాలో మొదటి నాటుసారా రహిత గ్రామంగా ప్రకటించాం. సారా తయారీ ఆధారంగా బతికే వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపిస్తాం.

## అమాత్యా.. రైవాడపై దయ చూపరూ!

దేవరాపల్లి : జిల్లాలోని జలాశయాల్లో ముఖ్యమైన రైవాడ నిర్వహణ లోపాలతో కొట్టుమిట్టాడుతోంది. దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం తదితర మండలాలకు చెందిన 15,344 ఎకరాలతో పాటు విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన అదనపు ఆయకట్టు 6 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు దీనిని 40 ఏళ్ల కింద నిర్మించారు. విశాఖ నగరానికి ప్రతిరోజూ 50 క్యూసెక్కుల తాగునీరు ఈ జలాశయం ద్వారానే అందిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైవాడ నిర్వహణపై పాలకులు దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. మధ్యతరహా నీటిపారుదలకు చెందిన ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 3.6 టీఎంసీలు. దీని అత్యధిక నీటిమట్టం 114 మీటర్లు. 1990లో వచ్చిన భారీ వరదకు జలాశయ నీటిమట్టం ఒక్కసారిగా ప్రమాదస్థాయిని దాటింది. 65 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన గేట్లపై నుంచి సుమారు లక్ష క్యూసెక్కులు ప్రవహించింది. ఈ ఉధృతికి స్పిల్‌వే బాడీవాల్‌పై నుంచి కిందవరకు బీటలు వారింది. కుడి, ఎడమ కాలువల ప్రధాన తూములు సైతం బీటలువారాయి. అంతేకాకుండా వాటికి అమర్చిన రెగ్యులేటింగ్ గేట్లు సైతం వంగిపోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. మట్టిగట్టు సైతం చాలాచోట్ల జారింది.

**336 కోట్లతో ప్రతిపాదన ...** నిపుణులు చేసిన హెచ్చరిక నేపథ్యంలో



ప్రమాదస్థితిలో ఉన్న ఈ జలాశయం వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను డ్రిప్ (డ్యాం రీహేబిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం) కింద చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనుల కోసం రూ. 336 కోట్లు మంజూరు చెయ్యాల్సిందిగా ప్రపంచ బ్యాంకును కోరింది. గత వైకాపా ప్రభుత్వం దీని గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలోనైనా దీనికి మోక్షం కలుగుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ జలాశయం నుంచి సాగునీరందించే కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు తెదేపా ప్రభుత్వం రూ. 30 కోట్లతో జైకా నిధులు మంజూరు చేసింది. ఈ పనులు సైతం అసంపూర్తిగా ఉండిపోయాయి. రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన ఈ జలాశయాన్ని కాపాడుకోవడానికి ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శతవిధాలా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం చోడవరంలో పర్యటించనున్నారు. ఆయన ఈ జలాశయం పరిరక్షణపై దృష్టిసారించి పెండింగ్ పనులు పునః ప్రారంభించడంపై సారించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

**హెచ్చరించిన నిపుణుల బృందం**


ఈ జలాశయాన్ని జాతీయ జలాశయాల భద్రతా మండలికి చెందిన నిపుణుల బృందం 2018-2019లో పరిశీలించింది. గతంలోలాగే వరద వస్తే జలాశయానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిర్ధారించింది. అత్యవసరంగా ఈ జలాశయం వద్ద అత్యవసరంగా చెయ్యాల్సిన పనులపై పలు కీలక సూచనలు చేసింది. తమ నివేదికని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సీడబ్ల్యూసీకి (సెంట్రల్ వాటర్ కమిషన్) పంపించింది. ఈ నిపుణుల బృందం అనేక సూచనలు చేసింది. రేడియల్ గేట్లను అమర్చాలని, బీటలు వారిన పియర్స్‌తోపాటు పొర్లుకట్ట పునర్నిర్మాణం చెయ్యాలని, మట్టిగట్టు జారిన దగ్గర పటిష్ఠం చెయ్యాలని, సుమారు 6 మీటర్లు పొడవైన మట్టికట్టకు అనుసంధానంగా సర్వీసు రోడ్డు నిర్మించాలని కుడి, ఎడమ కాలువల ప్రధాన తూములను పునర్నిర్మించాలని సూచించింది.

## పాడిరైతులకు అండ.. మినీ గోకులం

దేవరాపల్లి : కూటమి ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో గత ఏడాది జిల్లాకు 813 మినీ గోకులం షెడ్లు మంజూరుకాగా వీటిలో 742 పూర్తి చేశారు. ప్రస్తుతం వాటికి చెల్లింపులు చేస్తున్నారు. రెండో విడతలో పంచాయతీకి రెండు చొప్పున మినీ గోకులాల ఏర్పాటుకు పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో 646 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 1292 గోకులాల యూనిట్లు నిర్మించాలనేది ప్రతిపాదన.

ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రైతులు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థకు (డ్వామా) దరఖాస్తు చేసుకోవాలి.

**యూనిట్ల వివరాలు:** రెండు పశువుల యూనిట్ విలువ రూ, 1.15 లక్షలు, నాలుగింటికి రూ. 2.3 లక్షలు, ఆరింటికి రూ. 2.3 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం కింద 90 శాతం రాయితీ



రాగా, మిగిలిన 10 శాతం వాటా లబ్ధిదారులు చెల్లించాలి.

**మేకలు, గొర్రెలకు:** 20 గొర్రెలు, మేకల యూనిట్ విలువ రూ.1.30 లక్షలు, 50 జీవాలకు రూ.2.30 లక్షలు, 100 కోళ్ల షెడ్డుకు రూ. 87 వేలు, 200లు పైన ఉన్న వాటి యూనిట్ విలువ రూ. 1.32 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం కింద 70 శాతం రాయితీ రాగా, మిగిలిన 30 శాతం లబ్ధిదారులు వాటా కింద చెల్లించాలి.

**అనుమతులు రాగానే దరఖాస్తుల స్వీకరణ:** జిల్లాలో 1292 మినీ గోకులాల యూనిట్లు ఏర్పాటుకు అడుగులు వేస్తున్నాం. ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మిస్తాం. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు రాగానే అర్హులైన రైతుల నుంచి గోకులాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తాం.

బి.రామమోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

# కూలిన గదులు.. కుదరని పనులు

కర్నూలు : ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం.నిధులు ఇవ్వకుండా విద్యార్థులకు తిప్పలు మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో 75 పాఠశాలల భవనాలు నేలమట్టం చేశారు. పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో 2023 చివరి నాటికే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు వాటిని మళ్లీ చేపట్టనే లేదు. 80 శాతం వరకు పూర్తయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. మిగతా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మొదటి విడత కింద ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.41.6 కోట్లు కేటాయించింది. వేసవి సెలవులు ముగిసేలోగా చివరి దశ పనులు పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగవుతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పదండి ముందుకు బడిని బాగు చేసుకుందాం**

అక్షరాలు నేర్పిన బడి అంటే ఎవరికైనా మమకారమే.. మనం ఓ స్థాయికి చేరాక.. తిరిగి అదే పాఠశాలకు వెళ్లినప్పుడు వచ్చే ఉద్వేగాన్ని మాటల్లో చెప్పలేం.. అలాంటి విద్యాలయాలు పాడై ఉంటే గుండె తరుక్కుపోతుంది.. చదివిన బడిని బాగు చేయడంలో మనమూ ఓ



చేయి కలుపుదాం.. మనకు ఎన్నో గుర్తులు.. అనుభూతులు.. జ్ఞాపకాలు మిగిల్చిన పాఠశాలలను బాగు చేసుకుందాం. తలో చేయి వేస్తే సమస్యను పరిష్కరించడం చాలా సులువు.. ఇప్పుడు వేసవి కాలం.. బడులకు సెలవులొచ్చాయి.. తడ'బడి'న చదువులమ్మ నేలను బాగు చేయించడానికి ఇది చక్కని సమయం.. ఇంకా ఆలోచన ఎందుకు.. పదండి మన బడిని బాగు చేసుకుందాం..!!

పాఠశాలల్లో రెండో విడత కింద ఆగిపోయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 80 శాతం వరకు నిర్మాణాలు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను సేకరించింది. వీటిని వెంటనే పునః ప్రారంభించి పూర్తి చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

గతంలో మాదిరిగా సిమెంటు కొనుగోలు, సరఫరాపై ఉన్న ఆదేశాలను సడలించింది. బహిరంగ విపణిలోనే సిమెంటు కొనుగోలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఇటీవల ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రివాల్వింగ్ ఫండ్‌తో చేపట్టనున్నారు.

**రూ.423 కోట్లు అవసరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు – నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలు జిల్లాకు 243 కోట్లు అవసరం ఉంది.

కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. ఇందులో అరకొరగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.3.73 కోట్లను ఆయా పాఠశాలల పీడీల ఖాతాలో జమ చేశారు.

నంద్యాలలోని 973 బడుల్లో పనులు ప్రారంభించారు.రూ.11.77 కోట్లు కేటాయించగా రూ.3 కోట్లు వచ్చాయి.

పడగొట్టి పంపించారు

కర్నూలు బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు స్మారక నగరపాలక పాఠశాలలో 279 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. ఉన్న గదులు కూలగొట్టారు.. పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేశారు.రూ.2.16 కోట్లు కేటాయిస్తే రూ..49.21 లక్షలు వెచ్చించారు.

**సిమెంటు ఇస్తే పనులు మొదలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాలని అనుకొన్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షలు వెచ్చించారు. సిమెంట్ సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.. వాటిని చేపట్టాలంటే రూ.23 లక్షలు అవసరం..ప్రస్తుతం పాఠశాల ఖాతాలో రూ.6 లక్షలు ఉన్నాయి.

**అమ్మాయిల అవస్థ**

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,612 మంది విద్యార్థినులున్నారు. రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాది వేశారు. నాలుగు గదులు రూఫ్ లెవర్ వరకు పూర్తవగా.. మరో రెండు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన నాలుగు అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేస్తే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది. ఇందు కోసం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తే నాలుగు తరగతి గదులు వినియోగంలోకి తీసుకురావచ్చు.

మంజూరైన అదనపు గదులు: 1986
తుది దశలో ఆగినవి: 587
పైకప్పు దశలో ఉన్నవి : 489
యూనిట్ లెవల్‌లో నిలిచినవి : 48
బేస్‌మెంట్ దశలో ఉన్నవి : 59
పూర్తయిన నిర్మాణాలు : 198
పనులు మొదలే కానివి: 32

# విరబూసి.. నష్టాలు మిగిల్చి..!

కుప్పం : శాంతిపురం మండలం దండికుప్పంకు చెందిన శీనప్ప రెండెకరాల్లో చెండు మల్లి సాగుకు రూ. లక్ష ఖర్చు చేశాడు. కోతకు వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. పూలను తోటలోనే ఎండబెట్టాల్సిన దుస్థితి. విరబూసిన పొలంలోనే వాడిపోతున్న పూలను చూసి శీనప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు మునుపు రూ.50 వేల పెట్టుబడితో పండించిన కర్బూజా పండ్లకు కూడా గిట్టుబాటు ధర లేక నష్టపోయినట్లు కంటనీరు పెట్టుకోన్నారు. తోటల్లోనే ఎండుతూ.. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఉద్యాన రైతులు వందలాది ఎకరాల్లో బంతి పూలు సాగు చేశారు. అప్పులు చేసి.. నీటి ఎద్దడిని అధిగమించి పండించిన పూలకు గిట్టుబాటు ధరలు కొరవడటంతో తీవ్రంగా నష్టపోయారు. చాలా చోట్ల తోటల్లోనే వదిలిపెట్టడంతో ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల పశువులకు ఆహారంగా మారాయి.

**శుభకార్యాలు లేక**ప్రస్తుతం పండుగలు, శుభకార్యాలు లేనందున విపణిలో పూలకు డిమాండు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా పూజలు, అలంకరణలకు వినియోగించే బంతి, చెండుమల్లి వినియోగం తగ్గింది.

# పీఎంశ్రీ.. పాఠశాలలకు సిరి!




అనకాపల్లి : విద్యారంగంలో మెరుగైన మార్పులు తీసుకురావడం.. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకం అమలు చేస్తున్నారు. దీనికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతుల ఆధారంగా జిల్లాలో పాఠశాలలను ఎంపిక చేశారు. దీంతోపాటు అదనంగా పాఠశాల విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లడం, జాతీయ వేడుకలకు, జాతీయ నాయకుల జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు, డిజిటల్ తరగతులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణం, ల్యాబ్‌లలో పరికరాలు సమకూర్చడం, క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తున్నారు.

జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 35 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో 125 పనులు చేసేందుకు ఎంపిక చేయగా.. ఇప్పటి వరకు 103 పనులు పూర్తయ్యాయి. రెండు విడతల్లో జిల్లా పరిధిలో రూ. 7.41 కోట్ల అంచనాతో 125 పనులు ప్రారంభం కాగా.. ఇందులో రూ. 6.4 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ. 5.2 కోట్లు ఖర్చు చేశారు.

**80 శాతానికి పైగా పనులు పూర్తి**

అనకాపల్లి జిల్లాలో పీఎంశ్రీ తొలి విడత 24, రెండో విడతలో 11 పాఠశాలలు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి.. వారి ఆలోచనలకు పదును పెట్టేందుకు ప్రయోగశాలలు నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు జిల్లాలో 15 పాఠశాలల్లో నూతన భవనం, ప్రయోగశాలలను నిర్మించారు. ఇందులో ఒక్కో ప్రయోగశాలకు రూ. 15 లక్షల వరకు కేటాయించారు. దీంతోపాటు 35 పాఠశాలల్లో రూ. 1.75 కోట్లతో క్రీడామైదానాలు అభివృద్ధి చేయాలని అంచనాలు రూపొందించారు. ఇందులో ఇప్పటివరకు రూ. 1.5 కోట్లు విడుదలయ్యాయి. 85 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

**నిర్వహణకు ప్రత్యేక నిధులు**

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ.. 21 పాఠశాలల్లో ఇంకుడు గుంతలు తవ్వుతున్నారు. బడిలోనూ కూరగాయలు పండించి.. వినియోగించేందుకు కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నారు. వీటితోపాటు మరుగుదొడ్ల మరమ్మతులు, గ్రంథాలయాలు ఏర్పాటు పనులు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ. 50 వేల నుంచి రూ. 1.5 లక్షల వరకు ఆయా బడులకు నిధులిచ్చారు.

**పనులు వేగవంతం**

జిల్లాలో పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు కేటాయింపు జరిగింది. వాటితో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రయోగశాలల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం. పనుల్లో జాప్యం కారణంగా వెనక్కి వెళ్లిపోయిన నిధులు కూడా వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. – జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్షా, అనకాపల్లి

**జిల్లాలో పీఎంశ్రీ వివరాలు ఇలా..**

ఎంపిక చేసిన పాఠశాలలు : 35
అంచనా విలువ : రూ 7.41 కోట్లు
మంజూరైన నిధులు : రూ. 6.40 కోట్లు
ఇంకా రావల్సింది : రూ. 1.01 కోట్లు

# అక్రమాలు.. చాపకింద 'నీరు'లా!!




విశాఖ : నగరంలోని టీఎస్సార్ (టౌన్ సర్వీస్ రిజర్వాయర్) లోని ట్యాంకుల నుంచి నిత్యం వివిధ హెూటల్స్, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లకు జీవీఎంసీ ఆధ్వర్యంలో నీటిని విక్రయిస్తుంటారు. మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది అక్రమాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. దొంగ బిల్లులతో రూ.లక్షలు నొక్కేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. అధికారుల అండదండలతోనే వ్యవహారం జరగడంతో నామమాత్రంగా విచారణ జరిపారు. అక్రమాలకు పాల్పడిన ఉద్యోగి విధులు నిర్వహించే ప్రాంతాన్ని మరోచోటకు మార్చి, చేతులు దులిపేసుకున్నారు. రూ.40 లక్షలకుపైగా దోచుకున్న ఉద్యోగిని సస్పెండ్ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అధికారులు ఆ విషయమే పట్టించుకోవడం లేదు.

5 కేఎల్(కిలో లీటర్) సామర్థ్యం గల ట్యాంకర్ వ్యాన్‌కు రూ.200, రెండు సింథటిక్ డబ్బాలు కలిగిన 2 కేఎల్ ఆటోకు రూ.80, ఓ సింథటిక్ డబ్బా కలిగిన 1 కేఎల్ ఆటోకు రూ.40 చెల్లిస్తూ... జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో రసీదు తీయాల్సి ఉంటుంది. ఆ రసీదును బట్టి నీటి సరఫరా సిబ్బంది నీటిని అందిస్తుంటారు.వేసవిలో రోజుకు 400 నుంచి 450 వాహనాల ద్వారా, మిగిలిన రోజుల్లో 150 నుంచి 200 వాహనాల ద్వారా నీటిని విక్రయిస్తుంటారు. అయితే ట్యాంకర్ వ్యాన్‌కు దూరాన్ని బట్టి రూ.800 నుంచి రూ.వెయ్యి, 2 కేఎల్ ఆటోకు రూ.500 నుంచి రూ.700, 1 కేఎల్ ఆటోకు రూ.450 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తూ.. వాహన నిర్వాహకులు నీటిని సరఫరా చేస్తుంటారు. ఇదీ జరిగింది..నీ నీటి కొనుగోలుకు సంబంధించిన రసీదుపై ఉండే నంబర్‌ను టీఎస్సార్ వద్ద ఓ పుస్తకంలో నమోదు చేసి, రసీదులో సగ భాగాన్ని చించి, వాహన చోదకుడికి ఇస్తారు. రిజర్వాయర్ వద్ద నీటిని నింపి, బయటకు వెళ్లేటప్పుడు గేటు వద్ద వాహన చోదకుడు రసీదు ఇవ్వాల్సి ఉంటుంది.అయితే అక్కడ పని చేసే ఓ ఉద్యోకి నీటి కొనుగోలుకు సంబంధించి నకిలీ రసీదు పుస్తకాన్ని అచ్చువేయించాడు. వాహన చోదకులు జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో తీసే అవసరం లేకుండా నేరుగా తానే డబ్బులు తీసుకుని, రసీదు ఇచ్చేవాడు. ఆ రసీదు ఆధారంగానే చాలా మందికి నీటి విక్రయాలు జరిగాయి. అలా దాదాపు రూ.40 లక్షలు వరకు దారి మళ్లించినట్టు వెలుగులోకి వచ్చింది. ఆ ఉద్యోగి నాలుగేళ్ల నుంచి అక్కడే పని చేస్తుండడంతో.. ఇంకా ఎన్ని అక్రమాలకు పాల్పడ్డాడో అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుట్టుగా విచారణ: రోజువారీ నీటి విక్రయ వాహనాలు పెరుగుతున్నా... ఆదాయం రాకపోవడంతో అనుమానం అధికారులు విచారణ చేపట్టగా.. అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. దొంగ రసీదులు సృష్టించినట్టు సదరు ఉద్యోగి అంగీకరించినా... కఠిన చర్యలు తీసుకోవడంలో మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. చర్యలు తీసుకుంటాం: సదరు ఉద్యోగి అక్రమాలకు పాల్పడినట్టు నీటి సరఫరా సహాయ ఇంజినీర్ గుర్తించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి, తదుపరి చర్యలు తీసుకుం టాం. ఇకపై ఆన్‌లైన్‌లో నిధులు చెల్లించి రసీదు తీసుకునేలా మార్పులు తీసుకొస్తాం. – కేవీఎన్.రవి, జీవీఎంసీ, మంచినీటి సరఫరా పర్యవేక్షక ఇంజినీర్.

# 'ప్రైవేటు' మెడలో జల విహారం!!

విశాఖపట్నం : ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి విశాఖలో 'సముద్ర జల విహారం' కేంద్రం నుంచి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కాకినాడ, మచిలీపట్నంలలో తీరాలున్నా విశాఖే పర్యాటకులకు ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. కొత్త బోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తే ఆదాయం పెంచుకోవచ్చు. ఆ దిశగా అధికారుల ప్రణాళిక లేకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల పిలిచిన టెండర్లు తీరూ అలాగే ఉంది. సంస్థ ఆదాయానికి నష్టం కలిగించే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు ముందుకువెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. **ఎంతో అవకాశమున్నా:** జల విహార ప్రాజెక్టులకు ఏపీటీడీసీ గత నెలలో టెండర్లు పిలిచింది. భీమిలి, రుషికొండ, తెన్నేటిపార్క్, మంగమారిపేట, ఫిషింగ్‌హార్బర్, బర్లపేట ప్రాంతాల్లో బోట్లు తిప్పేందుకు సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇక్కడే అసలు కథ నడిచింది. వీటిల్లో డిమాండున్న ప్రాంతాలకు, కొత్తగా నిర్వహించే ప్రదేశాలకు రమారమి ఒకే రకమైన ప్రాథమిక ధర నిర్ణయించడంపై విమర్శలు వచ్చాయి. ఏటా ఏపీటీడీసీకి రూ.20 లక్షలకుపైన ఆదాయం వచ్చే చోట ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించడం గమనార్హం. త్వరలోనే గుత్తేదారులకు ఒప్పంద పత్రాలు అందజేయనున్నారు. – రుషికొండలో జెట్ స్కీ స్కూటర్ల నిర్వహణకు ఏపీటీడీసీ ప్రాథమిక ధర రూ.4 లక్షలు చూపిస్తే రూ.13 లక్షలకు పాడారు. అక్కడే స్కూబాడైవింగ్ కోసం పిలిచిన టెండరు రూ.17 లక్షలకు వెళ్లింది. – భీమిలి తీరంలో రూ.50 వేలకు టెండరు పిలిస్తే రూ.1.75 లక్షలకు దక్కించుకున్నారు. బర్లపేట వద్ద సుమారు అంతే ధరకు వెళ్లింది.

**అరకోటి వస్తున్నా..తక్కువ ధరకే:** టెండర్లు పిలిచే క్రమంలో ఏపీటీడీసీకి ఎక్కువ ఆదాయం వచ్చే ప్రదేశాల్లో ప్రైవేటుకు పెత్తనం అప్పగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిషింగ్‌హార్బర్‌లో ఏపీటీడీసీ ప్రస్తుతం 8 సీట్ల బోటు నడుపుతోంది. గతంలో ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ. 60 లక్షల ఆదాయం వచ్చేది. అటువంటి చోట టెండరు పిలిచి ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించారు. టెండరు పిలవడంతో ఓ గుత్తేదారు రూ.8 లక్షలకు దక్కించుకున్నారు. ఇక్కడ ప్రాథమిక ధర తక్కువగా నిర్ణయించడంపై విమర్శలున్నాయి.

**కొత్త బోట్లేవి:** విశాఖలో జల విహారం ద్వారా రూ.కోట్ల ఆదాయం వచ్చే అవకాశమున్నా ఏపీటీడీసీ నిర్లక్ష్యం వహిస్తోంది. రుషికొండ, షిషింగ్‌హార్బర్ వద్ద కొత్త బోట్లు నడిపేందుకు వీలున్నా కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. పదేళ్ల కిందట 50 సీట్ల బోటు ఒకటి ఉండేది. హుద్‌హుద్‌కు దెబ్బతినడంతో దాని స్థానంలో స్వర్ణవిహారి అనే 50 సీట్ల బోటు నడిపారు. ఆ సమయంలో ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం వచ్చేది. 2018లో ఆ బోటును ఆపేశారు. అప్పటి నుంచి 8 సీట్ల బోటు హార్బర్ వద్ద నడుపుతున్నారు. డిమాండున్న రోజుల్లో 50 సీట్ల బోటు నడిపితే రోజుకు రూ.లక్ష ఆదాయం వస్తుంది. ఈ కొత్త బోటు ప్రతిపాదనలు ఎప్పటినుంచో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

# తవ్వేయ్.. ఆక్వా సాగు చేసేయ్!

గూడూరు : ఆక్వా.. డాలర్ల పంటే కానీ.. పట్టా భూములతో పాటు అసైన్‌మెంట్, సీజేఎఫ్ఎస్, అటవీ, ప్రభుత్వ, పోరంబోకు భూములను కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన యంత్రాంగం మనకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో ముడుపులిచ్చి రాజకీయ పలుకుబడితో ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి పట్టాలుగా మార్చుకుంటున్నారు. ఈ అక్రమాలు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో కొనసాగుతు న్నాయి. చిల్లకూరు మండలం బెస్తపాలెం, అంకులపాటూరు, తిక్కవరం, ఏరూరు, తిప్పగుంటపాలెం, ముత్యాలపాడుబీ కోట మండలం కర్లపూడి, సిద్దవరం, దొరువుకట్ట, దైవాలదిబ్బ, గోవిందపల్లి వాకాడు మండలం తూపిలిపాలెం, పామంజి, వాలమేడు, కొండూరు, అందల మాల, వావిళ్లపాలెం, తిరుమూరు, దుగరాజపట్నం, ముట్టెంబాక, కొండూరుపాలెంబీ చిట్టమూరు మండలం ఆరూరు, పిట్టివానిపల్లి, పల్లంపర్తి, కొక్కుపాలెం, చిట్టమూరు, కోగిలి తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వీటిలో పది వేల ఎకరాల వరకు ఆక్రమణలున్నాయి. చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో ప్రభుత్వ, అటవీ భూముల్లో ఆక్వా సాగు చేపట్టారు.



**ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే..**నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన కొందరు వీఆర్వోలు, ఆర్ఐ, తహసీల్దార్లకు వేలాది రూపాయలు అక్రమంగా ముడుపులు ముట్టజెప్పి క్రమబద్ధీకరించుకోవడం పరిపాటిగా మారింది. వైకాపా పాలనలో అత్యధికం భూములకు పట్టాలు ఇచ్చారు. వీటిని ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే ఎన్నో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రతి మండలంలో ఇటీవల జరిగిన సాదాబైనమాలు.. మ్యుటేషన్లు వివరాలను పరిశీలిస్తే.. ప్రభుత్వ భూములను ఎవరికి పట్టాలు చేశారు.. ఎంత చేశారు.. ఏ గ్రామ పరిధిలో జరిగాయి.. అన్న వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

**నోటీసులిస్తాం..**దీనిపై వాకాడు తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పరిశీలించి నోటీసులు ఇస్తామన్నారు.

# జలఘోష తప్పేనా..?

భీమవరం : కూటమి ప్రభుత్వంలో పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తారని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు లేమి ఉందంటూ ఆర్థిక శాఖ అనేక మెలికలు పెడుతోంది. ఇప్పుడదే పశ్చిమ డెల్టా రైతులకు శాపంగా మారుతోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషితోఈ ఏడాదైనా జలఘోష తప్పేనా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో కాల్వలు, డ్రెయిన్‌లకు మరమ్మతు పనులు చేపట్టాలి. ప్రభుత్వానికి ఏనాడో ప్రతిపాదనలు పంపారు. పశ్చిమ డెల్టా పరిధిలో వేసవి మరమ్మతులకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రణాళికలు రూపొందించారు. నీటి సంఘాలు ఏర్పడడంతో రైతుల్లోనూ ఆశలు చిగురించాయి. కాలువలు ప్రక్షాళన జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ఏడాది రైతుల ఆశలు తల్లకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ క్లియరెన్స్ అయితేనే నిధులు మంజూరవుతాయి. ఒక దశలో ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరించింది. ప్రతిపాదనల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందేలా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పనుల నిర్వహణకు కాలాతీతమైంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. వాతావరణ శాఖ ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అదే జరిగితే మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోనుంది. జూన్ మొదటి వారంలోనే మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇటువంటి లెక్కలు వేసుకుని జలవనరుల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోగా కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాలి. గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించాలి. గట్లు బలహీనంగా ఉన్నచోట పటిష్టం చేయాలి. లేదంటే గండ్లు పడి పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. గడచిన ఖరీఫ్‌లో గండ్లతో అధిక నష్టం వాటిల్లింది. మరోవైపు డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. వేసవిలో పనులు చేపడితే ముంపు నుంచి గట్టెక్కవచ్చని అంతా అభిప్రాయపడ్డారు.

**నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం**

వేసవి పనులు చేపట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైంది. ఆ ప్రభావం రైతులపై పడుతోంది. రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. నారుమళ్లు దెబ్బతింటున్నాయి. లేదంటే నాట్లు కుళ్లిపోతున్నాయి. గడచిన ఖరీఫ్‌లో రైతులు ఇలాంటి ఇబ్బందులే పడ్డారు, రెండు పర్యాయాలు పంటకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్‌లు, కాలువలు పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షాలకు డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. జలవనరుల శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. పనులు చేపట్టాలని ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మత్తుల కోసం రూ.40 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో రైతుల్లోనూ ఉత్సాహం నెలకొంది. నీటి సంఘాల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాలువలు, డ్రెయిన్‌లలో సమస్యలను గుర్తించారు. అధికారులకు వివరాలు సమర్పించారు. పనుల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడంతో నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం నెలకొంది.

**నెల రోజులే గడువు** వేసవిలో పనులు చేపట్టడానికి నెల రోజులు మాత్రమే గడువు ఉంది. జూన్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. వేసవి పనులకు మే నెల కీలకం. ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు చేస్తే పనులు కేటాయిస్తారు. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వాస్తవానికి రూ.10 లక్షలపైన పనులు అయితే టెండర్‌లు పిలవాలి. లేదంటే నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిలో చేస్తారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేసినా సరే టెండర్‌లు పిలిచే అవకాశం లేదు. అంత సమయం లేదు. స్వల్పకాలిక టెండర్లు పిలిచినా వారం రోజుల సమయం పడుతుంది. అయినా సరే టెండర్లు ఖరారవుతాయన్న భరోసా లేదు. కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జలవనరుల శాఖ పనులంటేనే హడలి పోదుతున్నారు. దీంతో నీటి సంఘాల ద్వారానే పనులు చేయించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈసారి నామినేషన్‌లోనే పనులు చేపడితే వేగవంతంగా పూర్తవుతాయన్న నమ్మకంతో అధికారులు వేచి చూస్తున్నారు.

# మీటరు తిరిగింది.. నియంత్రిక కాలింది

చిత్తూరు : జిల్లాలో తీవ్రమైన ఎండలు.. పెరిగిన ఉక్కపోతతో విద్యుత్తు వినియోగం మరింతగా పెరిగింది. గృహ, వ్యవసాయ సర్వీసుల విద్యుత్తు వాడకం పెరగడంతో ఉప కేంద్రాలు, నియంత్రికలపై అధిక లోడు ఫలితంగా నియంత్రికలు దగ్ధమవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే జిల్లాలో సుమారు 622 నియంత్రికలు దగ్ధమైనట్లు జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**శరవేగంగా మరమ్మతులు**

జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. మార్చి నెలలో చిత్తూరు నియంత్రికల మరమ్మతు కేంద్రానికి 355, పలమనేరుకు 125, పుంగనూరుకు 165 నియంత్రికలు తరలించారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖ ప్రక్షాళనకు దృష్టి సారించింది. లో ఓల్టేజి, సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్ల ఏర్పాటు చేస్తున్నారు. నియంత్రికల మరమ్మతులకు అవసరమైన పరికరాలు, తీగలు, ఆయిల్ వంటి సామగ్రి కొరత



లేకుండా అందుబాటులో ఉంచారు. కేంద్రాలకు తరలిస్తున్న నియంత్రికలను సత్వరమే మరమ్మతులు చేసి రైతులకు అందజేస్తున్నామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

**వైకాపా నిర్లక్ష్య ఫలితమే**

ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రాల నిర్వహణ పట్టించుకోలేదు. అయితే నిర్వహణ పేరుతో పనులు చేపట్టకనే వైకాపా పెద్దలు, గుత్తేదారులు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. లో ఓల్టేజి సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నియంత్రికలను అమర్చలేదు. కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనే అవసరం లేనప్పటికీ ఇష్టానుసారంగా ఉప కేంద్రాల ఏర్పాటుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖ అధికారులే బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఆగిపోగా విద్యుత్తు లైన్ల నిర్వహణ మరిచిపోయారు. నిర్లక్ష్యం ఫలితంగా పూతలపట్టు, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, పెనుమూరు, ఐరాల, నగరి, విజయపురం యాదమరి, గంగవరం, బైరెడ్డిపల్లె తదితర మండలాల్లో ప్రస్తుత వేసవిలో సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్నాయి.

జిల్లాలోని సర్వీసుల వివరాలు (లక్షల్లో)
విద్యుత్తు: 7.35
గృహ : 4.96
వ్యవసాయ : 1.92

# పత్తి సాగుపై రైతుల అనాసక్తి

బి.కోడూరు : పత్తి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. పత్తి పైరుకు తెగుళ్లకు మందులు, ఎరువులు, సేద్యాలు, కూలీల ఖర్చు అన్నీ పోను పైరు బాగా పండితే మిగిలేది ఎకరాకు రూ.20వేలు మాత్రమే.బి.కోడూరు మండలంలో ప్రతి సంవత్సరం పత్తి దాదాపు 7వేల ఎకరాలు పైనే సాగు చేసేవారు. రాను రాను పెట్టుబడి ఎక్కువ కావడం, రోగాలు అధికంగా రావడం, వాటికి సరైన మందులు పిచి కారి చేసేందుకు సరైన సలహాలు అందించలేని అధికారులతో రాను రాను సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలం 50ఎక రాలలోపే పత్తి సాగు చేశారు. పత్తిపైరు నవంబ రు, డిసెంబరులో సాగు చేస్తే ఏప్రిల్, మేలో కోత లకు వస్తుంది. ఆ సమయంలో ఎండలు ఎక్కువ కావడం, కూలీలు దొరక్కపోవడం, సరైన రేటు లేకపోవడంతో రాను రాను రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపడంలేదు. దీంతో మండలంలో పత్తి సాగు పూర్తిగా కనుమరుగయ్యేటట్లు ఉంది.

**ఎండలు ఎండలు.. దొరకని కూలీలు**

ఏప్రిల్, మే మాసంలో పత్తి పంట కోతకు వస్తుం ది. అయితే మంచి ఎండలు , కూలీలు దొరక్క పోవడం, కూలీలు వచ్చినా అధిక రేటు కూలీ చెబుతుండడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అష్టకష్టాలు పడి పత్తి పండిం చుకున్నా తీరా రేటు దగ్గరకు వచ్చేసరికి పెట్టుబ డి కూడా రానంతగా ఈ దళారులు చేస్తుండడం తో పూర్తిగా పత్తిని ఆపివేశారు.

**తెగుళ్లు ఉన్నా .. పర్యవేక్షణ సున్నా**

పత్తి పూత, పిందె దశకు వచ్చేసరికి అధికంగా తెగుళ్లు సోకడం, రైతులు తెలిసీ తెలియని మం దులు తీసుకువచ్చి పిచికారి చేయడంతో దిగుబ డులు పూర్తిగా తగ్గిపోయాయి. అధికారులు రైతు లకు సరైన సమయంలో సలహాలు అందించి వచ్చిన రోగాలకు సరైన మందులు పిచికారి చేసే విధంగా అవగాహన కల్పించడంలో విఫలమవ డంతో రైతులు పత్తిపై ఆసక్తి చూపడంలేదు.

**పెట్టుబడి భరించలేక పత్తిసాగు తగ్గించారు**

పత్తి పంట సాగునకు పెట్టుబడి ఎక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు తగ్గించారు. అలాగే కూలీల కొరత రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఇది కూడా పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా చెప్పవచ్చు. –కౌశిక, వ్యవసాయాధికారి, బి.కోడూరు

**ఏటా పది ఎకరాలు పత్తి సాగు చేసేవారం**

ప్రతి సంవత్సరం పత్తి 10 నుంచి 15 ఎకరాల వరకు సాగు చేసేవారం. రాను రాను విత్తనాల ఖర్చు ఎక్కువ కావడం, రాను రాను రోగాలు అధికంగా రావడం, దిగుబడి తగ్గు తుండడంతో పత్తిని పూర్తిగా సాగు చేయకుండా మానేశాం. ప్రస్తుతం సజ్జ, మొక్కజొన్నలాంటి పంటలు వేసు కుంటున్నాం. కనీసం క్వింటా రూ.10వేలు అమ్మితే రైతుకు కాస్తో కూస్తో పెట్టుబడి పోను మిగులు తుంది. దీంతో పత్తిని పూర్తిగా మానివేశాం.
– దుగ్గిరెడ్డి. రైతు, ఐత్రంపేట

# నకిలీ ఈ-స్టాంప్‌ల సృష్టి




అనంతపురం: నకిలీ స్టాంపులను నియంత్రించడం కోసం ప్రవేశపెట్టిన ఈ-స్టాంప్ వ్యవస్థను సైతం కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. తాజాగా కళ్యాణదుర్గంలో మీ-సేవ నిర్వహకుడు ఈ-స్టాంప్‌లను ట్యాంపర్ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఫొటోషాప్ ద్వారా ఈ-స్టాంప్‌లను ఎడిట్ చేసి రూ.కోట్లల్లో కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. కళ్యాణదుర్గానికి చెందిన బోయ ఎర్రప్ప అలియాస్ బాబు స్థానికంగా మీ-సేవ నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య కట్ట భార్గవి పేరుతో స్టాక్ హెూల్డింగ్ కార్పొరేషన్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. బ్యాంకుల్లో తనఖా డాక్యుమెంట్లు, ఇతర రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్‌డ్యూటీ చెల్లించేందుకు ఈ-స్టాంప్‌ను అందిస్తుంటాడు. ఈ క్రమంలో స్టాంప్ డ్యూటీ కట్టేందుకు వచ్చే వారికి నకిలీ ఈ-స్టాంప్‌లు అంటగడుతూ వస్తున్నాడు. రూ.లక్ష కట్టాల్సిన చోట రూ.100 మాత్రమే చెల్లిస్తాడు. ఫొటోషాప్ ద్వారా రూ.100 స్థానంలో మరో మూడు సున్నాలు చేర్చి రూ.1,00,000గా మార్చేస్తాడు. ఇలా సుమారు 150కి పైగా ఈ-స్టాంప్‌లను వినియోగదారులకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. కళ్యాణదుర్గం నుంచి జారీ అవుతున్న ఈ-స్టాంప్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన స్టాక్ హెూల్డింగ్ కార్పొరేషన్ అధికారులు గతవారం ఎర్రప్పకు సంబంధించిన మీ-సేవలో సోదాలు నిర్వహించారు. పెద్దమొత్తంలో నకిలీ ఈ-స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్యే కంపెనీనే బురిడీ కొట్టించి..**

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుటుంబం నిర్వహిస్తున్న ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీకి ఎర్రప్ప నకిలీ ఈ-స్టాంప్‌లు విక్రయించినట్లు సదరు కంపెనీ ప్రతినిధులు అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎర్రప్పను అరెస్టు చేసి విచారిస్తున్నారు. అతడు చాలాకాలంగా ఎమ్మెల్యే కుటుంబానికి సన్నిహితంగా ఉంటూ వచ్చాడు. ఈ సాన్నిహిత్యంతోనే 2022 నుంచి తమ కంపెనీకి కావాల్సిన ఈ-స్టాంప్‌లను ఎర్రప్ప వద్ద తీసుకుంటూ వచ్చారు. ఇటీవల అనుమానం వచ్చి కొన్ని ఈ-స్టాంప్‌లను పరిశీలించగా నకిలీవని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సుమారు రూ.70 లక్షల మేర మోసం చేసినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు సమీప బంధువులకు చెందిన సురజ్ ఇన్‌ఫ్రా, నియో కన్‌స్ట్రక్షన్ కంపెనీల పేరుతోనూ నకిలీ ఈ-స్టాంప్‌లు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# అలంకారప్రాయంగా పీహెచ్‌సీలు



గుత్తి : గ్రామీణులకు అందుబాటులోకి వైద్య సేవలను అందించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. గత వైకాపా ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాకు 9 అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జనాభా ప్రాతిపదికన కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాకు ఐదు కేంద్రాలు, శ్రీసత్యసాయి జిల్లాకు నాలుగు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి.

తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసినా సొంత భవనాలను సమకూర్చలేదు. పైగా ఆయా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్రధానంగా ప్రమాదాల్లో గాయపడి వచ్చినా, ఇతరత్రా కట్లు కట్టేందుకు కావాల్సిన సిబ్బంది లేరు. మరోవైపు సూదులు వేసే నర్సులూ లేకుండాపోయారు. కేవలం వైద్యులను మాత్రమే నియమించారు.

**గ్రామీణులకు అందని వైద్యం**

పల్లె జనానికి సంపూర్ణ వైద్యసేవలందటం లేదు. వైద్యులు మాత్రమే పాత పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో విధులను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదివరకు ఉన్న పీహెచ్‌సీకి 10 కిలోమీటర్లు దూరంపైగా ఉన్న గ్రామాలకు జనాభాను బట్టి అదనపు పీహెచ్‌సీలను ఏర్పాటు చేసినా సొంత భవనాలు లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

అనంతపురం జిల్లాలోని శింగనమల నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల కేంద్రానికి సొంత భవనం లేదు. పాత ఉప ఆరోగ్యకేంద్రంలోనే నెట్టుకొస్తున్నారు. అక్కడ వైద్యులు ఉంటూ ప్రజలకు అరకొరగా సేవలను అందిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఎనుములదొడ్డిలోనూ సబ్ సెంటర్‌లో కేంద్రం కొనసాగుతోంది. కళ్యాణదుర్గంలోని నూతిమడుగులో పక్కా భవనాలను నిర్మించేందుకు భూమిపూజ చేశారు. రాయదుర్గంలోని తాళ్లకేరీ, అనంతపురం గ్రామీణంలోని రుద్రంపేటలోనూ కేంద్రాలకు సొంత భవనాలు లేవు.

**శ్రీసత్యసాయి జిల్లాలోనూ అదే తీరు**

శ్రీసత్యసాయి జిల్లాకు మంజూరైన కేంద్రాలు సైతం పాత సబ్‌సెంటర్లలో కొనసాగుతున్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కేంద్రానికి ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టు, నలుగురు సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌తోపాటు ఎఫ్ఎన్‌వో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది లేదు.. కేంద్రాలను నిర్మించలేదని వైద్యులు వాపోతున్నారు.

# జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిట



ఎలమంచిలి : జిల్లాలో వాతావరణ మార్పులతో జ్వరాల వ్యాప్తి పెరిగింది. వర్షాల కారణంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారి దోమలు బాగా పెరిగాయి. వీటి కారణంగా ప్రజలు మలేరియా బారినపడుతున్నారు. రోగాల బారిన పడినవారితో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ల్యాబ్‌ల వారు రోగుల నుంచి దండిగా డబ్బులు గుంజుతున్నారు. మరోవైపు కలుషిత నీరు కారణంగా టైఫాయిడ్ బారినపడుతున్న సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెపుతున్నారు. జిల్లాలో అనకాపల్లి వంద పడకల సుపత్రితో పాటు ఎలమంచిలి, నక్కపల్లి, నర్సీపట్నం, కోటవురట్ల, చోడవరం, కె.కోటపాడు తదితర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పది రోజులుగా రోగుల సంఖ్య బాగా పెరిగింది. వీరిలో ఎక్కువమంది జ్వరం, డయేరియాతో బాధపడుతూ ఆసుపత్రులకు వచ్చిన వారే ఉంటున్నారు. గత పదిహేను రోజుల్లో జిల్లాలోని, ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యానికి వచ్చిన వారిలో 50 మందికి పైగా డెంగీ జ్వరాలు సోకాయని గుర్తించారు. మలేరియాతో బాధపడుతున్నవారి సంఖ్య 300 లకు పైగా ఉంది. ఒక్క ఎలమంచిలిలోనే డయేరియాతో పదుల సంఖ్యలో మంచంపట్టారు. జ్వరాలకు చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళితే రూ. 5 వేలకు పైగా ఖర్చవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా పరీక్షల కిట్లు లేవంటూ... బయట పరీక్ష చేయించుకోమని చెబుతున్నారని ఎలమంచిలికి చెందిన రోగి నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, నర్సీపట్నం పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది జిల్లా యంత్రాంగం అంతా ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమంపై దృష్టి సారించడంతో స్థానికంగా పర్యవేక్షణ కరవైంది. ముఖ్యంగా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తుండటం రోగాలు ప్రబలడానికి కారణమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి పెట్టాల్సి ఉంది.

# చెప్పినంత.. చెల్లించాలి

చిత్తూరు : ఇంటర్ విద్య.. వ్యాపార ధోరణులన్నింటినీ దాటుకుని అక్రమార్జనకు వేదికవుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల పేరుతో ఎడాపెడా దండుకుంటున్నాయి. ఎంసెట్, జేఈఈ, నీట్ ఆశలు నూరిపోస్తూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి మరీ అక్రమ వసూళ్లకు తెగపడుతున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటే చాలని వారు చెప్పిన ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు రెండేళ్ల తరువాత లబోదిబోమంటున్నారు. అటు నీట్, జేఈఈ ర్యాంకులు రాక ఇటు ఇంటర్‌లో మార్కులు లేక అయ్యో ఎంత మోసపోయామో అంటూ అధికశాతం కన్నవారు వాపోతున్నారు.


ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు డిమాండు అధికంగా ఉంటోంది. పది ఫలితాలు రావడమే ఆలస్యం విద్యార్థుల ఇళ్ల ముంగిట వాలిపోతున్న యాజమాన్యాలు ర్యాంకుల పేరుతో ఊరిస్తున్నాయి. రూ.లక్షల్లో వసూలు చేసి పెద్దఎత్తున ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. వసతిగృహాల్లో ఎక్కువమంది చేరుతుండగా ఇరుకు గదుల్లో కుక్కేస్తున్నారు. ఎక్కువ భాగం సొంత భవనాలు లేకపోయినా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆట స్థలాలు పూర్తిగా కరవయ్యాయి.

**బట్టీ చదువులతో సరి**

నిరంతరం బట్టీ చదువులు తప్పితే ఏ అంశంలోనూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంపై దృష్టిసారించడం లేదు. మెటీరియల్ రూపొందించి ఆ అంశాలనే వల్లెవేయిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఊసెత్తడం లేదు. అధ్యాపకుల ఏర్పాటులో వివక్ష చూపుతున్నారు. అందరి నుంచి ఒకే ఫీజు వసూలు చేసినా విద్యార్థులను విడదీసి ఒకట్రెండు బ్యాచ్‌లకు మాత్రమే రూ.లక్షల్లో వేతనాలు చెల్లించి తరగతులు చెప్పిస్తున్నారు.

**తాయిలాలకు తలొగ్గి..**

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఐదు నుంచి పదిరెట్లకు పైగా వసూలు చేస్తున్నారు. కళాశాలల గుర్తింపు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో పెద్దఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తిరుపతిలో రీజినల్ అధికారి



కార్యాలయం ఉన్నప్పటికీ అందులోని అధికారులు ప్రైవేటు కళాశాలల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఉత్తుత్తి తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారని, ఫిర్యాదులున్నా తాయిలాలతో సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు.. ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. అందుకు తగిన రసీదులు ఇవ్వాలి. విద్యాశాఖ నిర్దేశించిన ఫీజులకు వ్యతిరేకంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. విశాలమైన భవనాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తప్పక ఉండాలి. ఎటువంటి లోపాలున్నా నోటీసులు ఇచ్చి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కళాశాలల గుర్తింపు రద్దు చేస్తాం. – రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి

# సుఖీభవ హక్కుకు రీసర్వే చిక్కు

అనకాపల్లి : రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్‌తో కలిపి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇందులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పేరుతో వారికి త్వరలో ఆర్థిక సాయం అందించనున్నారు. కానీ గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పిదాలు... రైతులకు ఇప్పుడు శాపంగా మారాయి. అప్పట్లో అస్తవ్యస్తంగా సాగిన రీసర్వేతో ఇప్పుడు కొందరికి పెట్టుబడి సాయం ప్రశ్నార్థకంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో సాగు భూములను రీసర్వే చేశారు. దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లను (ఎల్‌పీఎం) తీసుకువచ్చారు. సర్వే నంబరు ఒక వ్యక్తికి ఒక్కటే ఉంటుంది. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. రీ సర్వే తర్వాత నలుగురైదుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. ఎల్‌పీఎంలో ఏ రైతు పేరు నమోదు చేస్తే... మిగిలినవారి భూవిస్తీర్ణం మొత్తం ఆయన పేరుమీదే నమోదైంది. ఇలాంటి ఉమ్మడి ఎల్‌పీఎం నంబర్లు అన్నదాత సుఖీభవ లబ్ధికి చిక్కుముడిగా మారాయి. ఒక్క రైతు పేరే రికార్డుల్లో ఉండటంతో మిగిలిన వారికి లబ్ధి అందే పరిస్థితి కనిపించడం లేదు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో శీరంశెట్టి నూకరాజుకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో భూమి ఉంది. రెండు చోట్ల రెండు వేర్వేరు ఆధార్ నెంబర్లు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధార్ నంబరు తప్పుగా నమోదైంది. చాలామంది ఫోన్ నెంబర్లు తప్పుగా ఉన్నాయి.

మునగపాక మండలం చూచుకొండలో 35, మునగపాకలో 55 మంది



రీసర్వే డేటా రావడం లేదు. రీసర్వే చేసిన ప్రతి గ్రామంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ మండలంలో 17,536 మంది సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించగా... ఇంతవరకు 13,199 మంది రికార్డులు మాత్రమే సరిగ్గా ఉన్నట్లు గుర్తించారు.

**అర్హత తెలిసేదిలా..**

రైతు సేవాకేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారి లాగిన్లకు ఇచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం సరిగా ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తారు. అక్కడ నుంచి వ్యవసాయాధికారి లాగిన్‌కు పంపుతారు. ఆ తర్వాత జిల్లా వ్యవసాయాధికారికి చేరుతుంది. అక్కడ ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తారు.

సాగుదారులు: 5,10,110
సుఖీభవకు అర్హులు: 4,47,577
పరిశీలనలో ఉన్నవి: 14,058
తిరస్కరణ: 19,284
పెండింగ్: 90,097

పరిశీలిస్తున్నాం: రీసర్వే చేసిన గ్రామాల్లో కొన్ని ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమే. ముఖ్యంగా ఆధార్ నంబర్లు సరిగా ఉండటం లేదు. ఆధార్ లింకయిన ఫోన్ నంబర్లు ఉండాలి. కొన్ని చోట్ల ఫోన్ నంబర్లు తప్పుగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల ఎల్‌పీఎంలు సరిగా లేవు. వీటన్నింటిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా. అర్హులైన ప్రతి రైతుకు సుఖీభవ లబ్ధి దక్కేలా చూడాలని ప్రయత్నిస్తున్నాం. ఎం.రామారావు, ఏడీ, అనకాపల్లి

# రైల్వే జోన్ పనులు చకచకా

ఆరిలోవ : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. తెలుగు ప్రజల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లు ఆలస్యమైంది. జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించలేదని 2023లో అప్పటి రైల్వేశాఖ మంత్రి ప్రకటన చేసిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో 54 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూములు రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నాయని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో జోన్ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు.కథనంతో తొలగిన అడ్డంకి: కోల్‌కతాకు చెందిన ఓ సంస్థ టెండరు దక్కించుకుంది. మార్చి నెలలో పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక రామకృష్ణాపురం ప్రజలు తమకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 20 రోజులపాటు



పనులు జరగనీయలేదు. ఈ సమస్యను పరిష్కరించడంలో జాప్యమవుతోందని ప్రచురితమైంది.

స్పందించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళన చేస్తున్న రైతులకు దగ్గరలోని ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇప్పిస్తామని చెప్పి జోన్ పనులకు ఆటంకం లేకుండా చేశారు. దీంతో ఏప్రిల్ నెలాఖరు నుంచి తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రధాన భవనం నిర్మాణం కోసం భూమిని తవ్వుతున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 90 మంది కార్మికులు స్థలంలోనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని పనులు వేగంగా చేస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తికి రెండేళ్ల గడువు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైల్వే జోన్‌పై ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రధానమంత్రి, రైల్వేశాఖ మంత్రితో దఫదఫాలుగా చర్చలు జరిపి మార్గం సుగమం చేసింది. భూమి కేటాయింపు విషయంలో స్పష్టమైన ప్రకటన చేసింది. భూసార పరీక్షలు చేయించి ఫలితాలు వచ్చిన తరువాత టెండరు ప్రక్రియ ప్రారంభమయ్యేలా కృషి చేసింది. తూర్పు కోస్తా రైల్వే జోన్ కార్యాలయం గతేడాది డిసెంబరులో టెండరు పిలిచింది. జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.149 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించాలన్నది ప్రతిపాదన. ఈ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి చేయాలని గడువుగా పెట్టుకున్నారు.

చురకలు

బుధవారం 23 జూలై 2025

# రెడ్ ఫ్రాక్‌లో గుబులు పుట్టించిన ప్రగ్య

అందం ఉంది .. వేడి ఉంది.. క్రీగంటి చూపులతో కల్లోలం సృష్టించగలదు.. వలపు బాణాలు విసిరి కుర్రకారును స్పెల్ బౌండ్ చేయగలదు. అందుకే జయాపజయాలతో సంబంధం లేకుండా ప్రగ్య జైశ్వాల్ తెలుగు చిత్రసీమలో వరుసగా అవకాశాల్ని అందుకుంటోంది. అఖండ లాంటి బ్లాక్ బస్టర్ లో నటించిన ప్రగ్య, ఇప్పుడు ఎన్బీకే సరసన అఖండ 2లోను అవకాశం అందుకుంది. మరోవైపు టైసన్ నాయుడు అనే చిత్రంలోను కథానాయికగా నటిస్తోంది. ఒకేసారి టాలీవుడ్ లో క్రేజీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అదే సమయంలో ప్రగ్య తన అభిమానులకు సోషల్ మీడియాల్లో నిరంతరం టచ్ లో ఉ



ంది. ఈ వేదికపై వరుస ఫోటోషూట్లతో వేడి పెంచుతోంది. తాజాగా ఈ ముంబై బ్యూటీ రెడ్ హాట్ లుక్ లో ప్రత్యక్షమైంది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో స్టన్నింగ్ ఫోజులతో గుబులు రేపింది. ప్రగ్య టోన్డ్ బాడీ .. థై థండర్ సొగసులు యూత్ కి స్పెషల్ ట్రీట్. స్టూడియో సెటప్ లో ఫోటోషూట్ ప్రగ్యను మరో స్థాయిలో ఎలివేట్ చేసింది. ముఖ్యంగా ఈ భామ టోన్డ్ బాడీ మెరుపులు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ప్రగ్య ఇటీవల ముంబైలో తన బెస్ట్ ఫ్రెండ్స్ లక్ష్మి మంచు, రకుల్ ప్రీత్ లతో ఎక్కువగా షికార్లు చేస్తూ కనిపిస్తోందతి. ఆ ముగ్గురూ కలిస్తే రచ్చ రచ్చే. ఇంతకుముందు బీచ్ వెకేషన్ లో బోట్ షికార్ చేస్తున్న ఫోటోగ్రాఫ్స్ వైరల్ అయ్యాయి. బికినీ బీచ్ సెలబ్రేషన్, రెస్టారెంట్ పార్టీ, పబ్ లైఫ్.. కాదేదీ జాలీ లైఫ్ కనర్హం.

# శ్రీలీల రికార్డ్.. ఒకేసారి నాలుగు భాషల్లో..!

కన్నడ మూవీ 'కిస్'తో హీరోయిన్‌గా పరిచయం అయిన శ్రీలీల తెలుగులో 2021లో 'పెళ్లి సందడి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. తెలుగులో మొదటి సినిమానే ఫ్లాప్ కావడంతో శ్రీలీలను ప్రేక్షకులు, ఇండస్ట్రీ వర్గాల వారు పెద్దగా పట్టించుకోరని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ లక్కీగా శ్రీలీలకు ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుస ఫ్లాప్స్‌లో ఉన్న రవితేజతో శ్రీలీల నటించడంతో చాలా మంది పట్టించుకోలేదు. కానీ ధమాకా సినిమా హిట్ కావడంతో పాటు, ఆ సినిమాలో శ్రీలీల అందంతో పాటు డాన్స్‌తో మెప్పించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ధమాకాతో శ్రీలీల చేతికి ఏకంగా అర డజను సినిమాలు వచ్చి పడ్డాయి. హీరోయిన్‌గా ఒకే ఏడాదిలో డజనుకు పైగా సినిమాలతో వచ్చి అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఏడాది గ్యాప్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేయడం మాత్రమే కాకుండా పలు సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకోగా, కొన్ని సినిమాలు ఆమెకు నటిగా, డాన్సర్‌గా గుర్తింపును తెచ్చి పెట్టాయి.



2024 చివర్లో వచ్చిన పుష్ప 2 సినిమా శ్రీలీలను పాన్ ఇండియా రేంజ్‌కి చేర్చింది. పుష్ప 2 లో శ్రీలీల కిస్సిక్ సాంగ్‌తో ఒక్కసారిగా బాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ ఐటెం సాంగ్ హిందీలో సూపర్ హిట్ కావడంతో శ్రీలీలకు హిందీ సినిమా ఇండస్ట్రీ నుంచి మాత్రమే కాకుండా తమిళ్‌లోనూ మొదటి ఆఫర్‌ను తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. శ్రీలీల మొదటి సినిమా 2019లో చేయగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు, కన్నడ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఇప్పుడు తమిళ్, హిందీ సినిమాలను సైతం చేస్తుంది. ఒకేసారి నాలుగు భాషల సినిమాలు చేస్తున్న హీరోయిన్‌గా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఒకవైపు కన్నడంలో జూనియర్, తెలుగులో మాస్ జాతర, తమిళ్‌లో పరాశక్తి, హిందీలో ఆషికి 3 సినిమాలు చేసి ఒకే సారి నాలుగు భాషల్లో నటించి రికార్డ్‌ను సృష్టించింది. శ్రీలీల హిందీలో నటిస్తున్న ఆషికి 3 ఇంకా విడుదల కాలేదు. అప్పుడే హిందీలో మరో సినిమాకు ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా చిన్నా చితకా హీరో కాకుండా ఏకంగా బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌తో శ్రీలీలకు ఛాన్స్ దక్కింది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్ యంగ్ హీరోలు సౌత్ దర్శకులు, హీరోయిన్స్ వెంట పడుతున్నారు. అందులో భాగంగానే బాలీవుడ్ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ తెలుగు దర్శకుడు బాబీ దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన అతి త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేశారని తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో డాకు మహారాజ్ మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే హిందీ సినిమా నుంచి పిలుపు వచ్చింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. మరో వైపు తమిళ్‌లో పరాశక్తి విడుదల కాకుండానే మరో సినిమాను కూడా ఒకే చేసింది. ఆ సినిమా ప్రకటన త్వరలో రానుంది. మొత్తానికి శ్రీలీల మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఉంది.




# వారెవ్వా.. చరణ్ మామూలుగా లేడుగా!



టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్.. ఇప్పుడు పెద్ది మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. భారీ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాకు ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. మేకర్స్ ఫుల్ జోష్ లో షెడ్యూల్స్ ను కంప్లీట్ చేస్తున్నారని చెప్పాలి. రీసెంట్ గా నైట్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేసినట్లు సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. సెట్స్ లో చరణ్ నిప్పులు చెరుగుతున్నారని చెబుతూ అంచనాలు పెంచారు. అంతకుముందు భారీ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేశారు మేకర్స్. హైదరాబాద్ లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్ లో తీసిన ఆ సన్నివేశాల్లో చరణ్ జీవించేశారని అంతా అన్నారు. అలా పెద్ది సినిమాకు గాను రామ్ చరణ్ పూర్తిగా లీనమై, పాత్రకు ప్రాణం పోయడానికి తన శాయశక్తులా కృషి చేస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు అది నిజమనేలా.. సోషల్ మీడియా పోస్ట్ క్లియర్ గా చెబుతుంది. తాజాగా వర్కౌట్స్ చేస్తున్న వేరే లెవెల్ ఫోటోను రామ్ చరణ్ ఇన్ స్టాలో పోస్ట్ చేశారు. పెద్ది మూవీ కోసం చేంజ్ ఓవర్ స్టార్ట్ అయిందని రాసుకొచ్చారు. అందులో చరణ్ అయితే నెవ్వర్ బిఫోర్ అనేలా ఉన్నారు. లాంగ్ హెయిర్, గుబురు గడ్డం, కండలు తిరిగిన దేహంతో అదిరిపోయారు. సినిమా కోసం ఆయన ఎంతలా కష్టపడుతున్నారో పిక్ ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ పిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. సినిమా కోసం ఎంతో వెయిట్ చేస్తున్నట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అది బాడీ కాదురా.. బాక్సాఫీస్ అంటూ ఫ్యాన్స్ రచ్చ రచ్చ చేస్తున్నారు.

సోషల్ మీడియా బ్లాస్ట్ అంటున్నారు. కమ్ బ్యాక్ తో బాక్సాఫీస్ ను షేక్ చేసేయ్ అన్న అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మొత్తానికి చరణ్ పిక్ ను వైరల్ చేస్తూ ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. అయితే ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్స్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. అందులో చరణ్ లుక్ కు అంతా ఫిదా అయ్యారు. సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. చరణ్ ఖాతాలో మరో బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ఫిక్స్ అయ్యారు. నెవ్వర్ బిఫోర్ అనే విధంగా చరణ్ సందడి చేయనున్నారని డిసైడ్ అయిపోయారు. ఇక మూవీ విషయానికొస్తే.. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీశ్ కిలారు భారీ బడ్జెట్ తో నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటీనటులు యాక్ట్ చేస్తున్నారు. 2026 మార్చి 27న చరణ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ రిలీజ్ అవ్వనుంది.

# రజినీ 'కూలీ'.. తారక్ 'వార్-2'కు అది సాధ్యమా?



ఆగస్టు 14వ తేదీన బాక్సాఫీస్ వద్ద పెద్ద క్లాష్ జరగనున్న విషయం తెలిసిందే. ఒకేరోజు కూలీ, వార్–2 సినిమాలు వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానున్నాయి. రెండూ కూడా పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయనున్నాయి. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకుని రిలీజ్ కు సిద్ధమవుతున్నాయి. ఆడియన్స్ ను అలరించేందుకు వెయిట్ చేస్తున్నాయి. కూలీ సినిమాలో కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ లీడ్ రోల్ లో నటించగా.. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున, బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్, ఉపేంద్ర, సత్యదేవ్, శృతిహాసన్ తదితరులు సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మరోవైపు, వార్–2లో బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. కియారా అద్వాణీ హీరోయిన్ గా కనిపించనుండగా.. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. %=ఖీ% స్పై యూనివర్స్ లో భాగంగా వస్తున్న మూవీని యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతుండడంతో రెండు సినిమాల మేకర్స్ ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. అందులో భాగంగా వార్ 2 థియేట్రికల్ ట్రైలర్ జులై 23వ తేదీన రిలీజ్ అవ్వనుంది. మరోవైపు కూలీ ట్రైలర్ ఆగస్టు 2న విడుదల కానుంది. అలా ఒకే రోజు విడుదలవ్వనున్న చిత్రాల ట్రైలర్స్ రిలీజ్ కు 20 రోజుల గ్యాప్ ఉండనుంది. అదే సమయంలో వార్–2 కన్నా కూలీ మూవీపై ఎక్కువ హైప్ ఉందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అందుకు రకరకాల కారణాలు ఉన్నా అది మాత్రం నిజమే. దీంతో కూలీ ట్రైలర్ కన్నా 20 రోజుల ముందు వార్–2 ట్రైలర్ వస్తుండడంతో మేకర్స్ దానితో భారీ హైప్ క్రియేట్ చేయాలి. అదే మంచి అవకాశమని చెప్పాలి. ట్రైలర్ తర్వాత సాంగ్స్ తోపాటు భారీ ప్రమోషనల్ ఈవెంట్ తో మేకర్స్ బజ్ ను కొనసాగించాలి. ఆగస్టు 2న కూలీ ట్రైలర్ విడుదలైన తర్వాత కూడా కొత్త ప్రమోషనల్ టీజర్ లు లేదా పాటల విడుదలతో సందడి చేయాలి. అప్పుడే కూలీ హైప్ తో ఈక్వల్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మొత్తమ్మీద ప్రమోషన్లతో కూడా పోటీ పడాలి. మరి బాక్సాఫీస్ వద్ద ఏ సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# సముద్రంలో సైరన్ మోగించిన కృతి!

వరుసగా కెరీర్ బెస్ట్ సినిమాలతో జోరు మీద ఉంది కృతి సనోన్. జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ అందుకున్న తర్వాత ఈ బ్యూటీ కెరీర్ ఎంపిక పరంగా మరింత జాగ్రత్త వహిస్తోంది. క్రూ లాంటి కమర్షియల్ కంటెంట్ ఉన్న సినిమాలో నటించిన కృతి సనోన్ దోపట్టి లాంటి కల్ట్ సినిమాతోను మెప్పించింది. సినిమాల కోసం సెట్లలో కుస్తీలు పడుతూ అలసిపోతున్న శరీరానికి కాస్తంత సాంత్వన కూడా అవసరం. అందుకే వీలున్న ప్రతిసారీ బికినీ బీచ్ సెలబ్రేషన్స్ లో చిల్ అవుతూనే ఉంది. ఆదివారం మరోసారి కృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో క్రూయిజ్ షిప్‌లో తన వెకేషన్ కి సంబంధించిన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్ లో కృతి రంగురంగుల డిజైనర్ బికినీలో కనిపించింది. చుట్టూ బ్లూ సీ, క్రూయిజ్ పై భారీ



సెటప్, రుచికరమైన వంటకాల ఆస్వాధన, వైవిధ్యమైన ఫోటోషూట్లు.. ఇలా రోజంతా చిల్లింగ్ గా గడిచిపోయింది. ఇంతటి ఆనందకర సమయంలో కృతి ఒక అందమైన కవితను కూడా రాసింది. "ఉప్పు పట్టిన జుట్టు.. నా హృదయంలో ఇంద్రధనస్సు... అలలతో ప్రవహిస్తోంది.. పోస్ట్‌కార్డ్ సూర్యాస్తమయాలు!! అంటూ అందమైన కవితను శీర్షికలో రాసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. 1 నేనొక్కడినే, దోచేయ్, ఆదిపురుష్ లాంటి చిత్రాలతో తెలుగు ఆడియెన్ కి బాగా చేరువైన కృతి ప్రస్తుతానికి బాలీవుడ్ లో మాత్రమే నటిస్తోంది. మోస్ట్ అవైటెడ్ తేరే ఇష్క్ మే – షూటింగ్‌ను ఇటీవలే ముగించింది. తదుపరి రణ్ వీర్ డాన్ 3లో నటించనుందని వార్తలొస్తున్నాయి. కానీ అధికారికంగా దీనిని ప్రకటించాల్సి ఉంది.

# హీరోయిన్స్ నందు జాన్వీ కపూర్ వేరయ్యా...!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే ఉంది. గత ఆరు.. ఏడు ఏళ్ళుగా జాన్వీ కపూర్ సినిమాలు చేస్తూనే ఉంది. కానీ ఇప్పటి వరకు అక్కడ హిట్ పడలేదు. నటిగా మంచి మార్కులు దక్కించుకుంటుంది, అందంతో కవ్విస్తుంది, ఆకర్షిస్తుంది. దాంతో జాన్వీ కపూర్‌కి వరుస ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈమె హిందీ ప్రేక్షకుల ముందుకు హోమ్బౌండ్ సినిమాతో వెళ్లింది. ఆ సినిమా సైతం జాన్వీ కపూర్‌కి మళ్లీ నిరాశను మిగిల్చింది. బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్‌లు అవుతున్నా పారితోషికం విషయంలో తగ్గడం లేదు. పై పెచ్చు సినిమా సినిమాకు పారితోషికం పెంచుతూ వస్తుందట. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు, తెలుగులో ఒక సినిమాను చేస్తున్న జాన్వీ కపూర్ పారితోషికం గురించి షాకింగ్ వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. హిందీ సినిమాలకు నామమాత్రంగా వసూళ్లు చేస్తున్న జాన్వీ కపూర్ టాలీవుడ్ సినిమాలకు మాత్రం షాకింగ్ రేంజ్‌లో డిమాండ్ చేస్తుందట. దేవర సినిమాకు అప్పట్లో రూ. 4. 5 కోట్ల నుంచి



రూ. 5 కోట్ల మధ్య పారితోషికం తీసుకుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు రామ్ చరణ్‌తో బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో నటిస్తున్నందుకు అంతకు మించి పారితోషికం అందుకుందట. దేవర సినిమా విడుదలకు ముందే ఆ సినిమా కమిట్ అయింది కాబట్టి సరే పారితోషికం ఎక్కువ డిమాండ్ చేసిందని అనుకోవచ్చు. ఎన్టీఆర్ దేవర సినిమా భారీ ఓపెనింగ్స్ అయితే రాబట్టింది కానీ, సూపర్ హిట్ సినిమాల జాబితాలో నిలువలేదు అనేది వాస్తవం. అంతే కాకుండా ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత లేదు. ఆమె చేసిన చాలా హిందీ సినిమాలతో పోల్చితే దేవర సినిమాలో చేసిన పాత్ర పరిధి చాలా తక్కువగా ఉంది. అయినా కూడా ఆ స్థాయి పారితోషికం ఎలా అందుకుందని చాలా మంది బాలీవుడ్ వర్గాల వారు ముక్కున వేలేసుకున్నారట. జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో చేస్తున్న సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం ఆమె గత చిత్రాల ఫలితాలతో పోల్చితే చాలా ఎక్కువే అని చెప్పాలి. ఇక ఆమె తెలుగు సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం మరీ ఎక్కువ అనే టాక్ వినిపిస్తుంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం చేస్తున్న రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమా పారితోషికంను మించి మరో తెలుగు సినిమాకు డిమాండ్ చేసిందట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆ సినిమాలో నటించేందుకు గాను ఏకంగా రూ. 6. 5 కోట్ల నుంచి రూ. 7 కోట్ల మధ్య పారితోషికంను ఆమె డిమాండ్ చేసిందట. దాంతో నిర్మాతలు, మేకర్స్ అవసరమా అనే ఆలోచనలో ఉన్నారు. మంచి సినిమాలు చేయాలి, మంచి పాత్రలు చేయాలి, హిట్ కొట్టాలి అని కాకుండా జాన్వీ కపూర్ సినిమా సినిమాకు పారితోషికం పెంచుకుంటూ పోవాలి అనే ఆలోచన మంచిది కాదని, అది కెరీర్‌ను నాశనం చేస్తుందని సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. తెలుగులోనూ హిందీ సినిమాలకు తీసుకుంటున్నట్లుగా పారితోషికం తీసుకోవడం ఉత్తమం అని చాలా మంది సూచిస్తున్నారు. జాన్వీ మాత్రం తెలుగు, తమిళ సినిమాలు అనగానే పారితోషికంను ఆకాశమే హద్దు అన్నట్లుగా పెంచి చెబుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536